# అస్పృశ్యనయనాలు

వసుంధర



ASPRUSYA NAYANAALU :

A Novel by VASUNDHARA

Published by M. Seshachalam & Co.,
Machilipatnam - Secunderabad.
Printed at The Prasad Process, Machilipatnam.

Price : Rs. 3·50

POCKET BOOKS EMESCO

389

First Edition : June 1980

AN EMESCO POCKET BOOK

*Distributors :*
ANDHRA PRADESH BOOK DISTRIBUTORS
3237, Rashtrapathi Road, Secunderabad 500 003

అదృష్టం ఎన్నోరకాలు. అన్నింట్లోకీ ఉత్తమమైన అదృష్టం నన్ను వరించడం నిజంగా నా అదృష్టం.

ఎందరో వ్యాపారం చేస్తే అదృష్టం కొందరినే వరించగా వారే వణిక్ప్రముఖులై వైభోగాలతో తులతూగుతారు. ఎందరో అందగత్తెలుంటే కొందరికి మాత్రమే సినిమా తారలుగా అవకాశం లభిస్తుంది. ఎందరో తెలివైన వారుంటే కొందరికి మాత్రమే పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి.

డబ్బు, ఆకర్షణ, పేరు, ప్రఖ్యాతులు సంపాదించడానికి మానవ ప్రయత్నం కావాలి. ఆ ప్రయత్నానికి అదృష్టం తోడైతే ఎవరైనా వీటిని సాధించగలుగుతారు. మనిషి ప్రయత్నంతో సాధించలేనిది నా అభిప్రాయంలో ఒక్కటే ఉంది. ప్రయత్నంలో సాధించలేనిది లభించడమే అదృష్టాల్లోకి ఉత్తమమైనదని నేననుకుంటాను. అది నాకు లభించింది. అదే అందం!

నా అందం సామాన్యమైనదికాదు. పురాణకాలంనుంచీ కూడా వర్ణించాలని అనుకుని ఏ అందం విషయంలో కవులు అసమర్థులయ్యారో ఆ అందం నన్ను వరించింది. నా అందం నా తలిదండ్రులకే ఆశ్చర్యాన్ని కలిగిస్తూంటుంది.

పచ్చటి ఛాయ - చెంపకు చేరెడు కళ్ళు నాజూకైన శరీరం. శిల్పి చెక్కిన బొమ్మకు లాంటి అవయవాల పొందిక, వీటికి తగ్గ తీయని కంఠస్వరం.

అద్దంలో నన్ను నేను చూసుకుని ఆశ్చర్యపోతుంటాను. నా ప్రతిబింబం నాది కాదని అనిపిస్తూంటుంది. అది నాదేనని గుర్తించగానే గర్వం కూడా కళుగుతుంది.

నేను పుట్టినప్పుడే చాలా బాగున్నానని అంతా అన్నారుట. నాకు ఒకో నెలే గడుస్తూంటే నావి తన పోలికలని అమ్మా నాన్న లిద్దరూ దెబ్బలాడుకునేవారుట.

నిజానికి నాకు అమ్మ నాన్న లిద్దరి పోలికలూ వచ్చాయి. ఇద్దరిలోని మంచి లక్షణాలు మాత్రమే నేను సంతరించుకున్నాను. అది నా అదృష్టం.

నన్ను చూస్తే అందానికి నిర్వచనం తెలుస్తుందని నాన్నే ఓసారి అన్నాడు. ఇంత వరకూ ఎందరో కవులు, చిత్రకారులు, శిల్పులు అందాన్ని నిర్వచించాలని ప్రయత్నించి విఫలులయ్యారుట. ఆ లోటు నా పుట్టుకతో తీరిందట.

నాకు ఓ సంవత్సరం నిండే వరకూ నాన్న పేరుపెట్టలేదుట. నా అందానికి తగ్గపేరుకోసం కొంతకాలం ఆలోచించి ఆఖరికి సుమలత అని నామకరణం చేశాట్ట. మా నాన్న మామ్మ అత్తగారు తొంభై ఏళ్ళావిడ అప్పటికింకా బ్రతికి ఉందట. తన మునిమనుమరాలికి తన పేరు శంకరమ్మ పెట్టలేదని ఆవిడకు చాలా కోపం వచ్చిందిట.

నాతర్వాత మా నాన్నకు ఇద్దరబ్బాయిలూ ఇద్దరమ్మాయిలూనూ. నా రెండో తమ్ముడికీ, పెద్దచెల్లెలికీ నా అందం రాకపోయినా నా కళ్ళు వచ్చాయి. నాకు నాన్న కళ్ళు వచ్చాయని అంతా అంటారు.

చిన్నప్పట్నించీ నాకు అందమైన కళ్ళంటే ప్రత్యేకమైన ఆకర్షణ. అందుకే అమ్మ నాన్నలలో నాకు నాన్న దగ్గరే చేరిక ఎక్కువ. నేను ఎక్కువగా నా రెండో తమ్ముణ్ణీ, పెద్ద చెల్లెల్నీ చేరదీసేదాన్ని.

నా ఈ ఆకర్షణకు ప్రత్యేకమైన కారణం లేకపోయినా అది సాధారణమైన విషయంగా నాకు తోచేది.

కళ్ళకు అందం ఎలా వస్తుంది?

చూసే చూపులు కళ్ళ అందాన్ని పాడు చేయగలవు. మనిషి మనసులోని భావాలు కళ్ళలో ప్రతిఫలిస్తాయి.



కళ్ళు అందంగా ఉన్నాయంటే - ఆ కళ్ళలో ఆహ్లాదకరమైన భావాలు ప్రతిఫలిస్తున్నవని అర్థం. అంటే ఆ కళ్ళుగల మనిషి మనసు అమృత సదృశం అనుకోవాలి.

ఈ కారణంగా నాకు నాన్న, రెండో తమ్ముడు, పెద్ద చెల్లెలు చేసే ఏ పనిలోనూ తప్పు కనబడేదికాదు. ఇంట్లో ఎప్పుడు గొడవలు వచ్చినా నేను ఈ ముగ్గురి పక్షానా ఉండేదాన్ని. నా సిద్ధాంతం మీద నాకు అపనమ్మకం లేదు. కలగవలసిన పరిస్థితులు ఏర్పడనూలేదు.

ఈ ప్రపంచంలో నేను ఇష్టపడేవి రెండే రెండు. ఒకటి అందమైన కళ్ళయితే - రెండవది డబ్బు. మొదటిది నాకుంది కానీ రెండవది లేదు. అందుకు నాకు విచారం లేదు. ఎందుకంటే అందమైన కళ్ళు లేక డబ్బుండి ఉంటే అందమైన కళ్ళను సంపాదించుకోవడం నా వల్లకాదు. డబ్బయితే ఏదో ఒక రోజున నన్ను వెతుక్కువస్తుందన్న ఆశ నాకు ఉంది.

ఈ విషయంలో అమ్మకూ నాకూ చాలా గొడవలవుతూండేవి.

చిన్నప్పట్నించీ నాన్న నా అందాన్ని తరచుగా పొగుడుతూండేవాడు. అందువల్ల నేను చాలా గొప్ప అందగత్తె నన్న అభిప్రాయం నాలుగైదేళ్ళనించే నాలో స్థిరపడిపోయింది.

నాకైదేళ్ళున్నప్పుడు మా ఇంటికి చుట్టాలొచ్చి వెళ్ళారు. ఉన్నన్నాళ్ళూ వాళ్ళు నా అందాన్ని విపరీతంగా పొగిడారు. వాళ్ళు వెళ్ళిపోగానే నేను అమ్మను దిష్టితియ్యమని అడిగాను.

"ఎందుకూ?" అని అమ్మ అడిగింది ఆశ్చర్యంగా.

"నా అందానికి వాళ్ళవల్ల దిష్టితగిలింది -" అని అమ్మకు నేను చెబుతూంటే నాన్న నన్ను ముద్దులాడాడు.

ఆడపిల్లను గదా అని అమ్మనాకు పనులు నేర్పడానికి ప్రయత్నించేది.

"కోమలమైన ఆ చేతులు చీపురు పట్టుకోవడానికి కాదు-" అన్నాడు నాన్న ఓసారి నేను గది ఊడుస్తూంటే.

"రేపు అత్తారింటికి వెడితే....?" అని అమ్మ ఏది
అనబోగా

"ఈ దేవకన్య చేతికి చీపురు ఇచ్చేలాంటి చచ్చు వెధవుంట
డని నేననుకోను. ఉన్నా అలాంటివాడికి నా కూతుర్నివ్వను...."
అన్నాడు నాన్న.

తర్వాత అమ్మెప్పుడైనా ఇల్లు తుడవమంటే నేను నాన్న
మాటలే జవాబుగా ఇచ్చాను.

అమ్మ ఓసారి కంగారుగా నాన్నతో— "అమ్మాయి
అహంకారం పెరుగుతోందని అనుమానంగా ఉందండీ—" అంది

"అందానికి అహంకారం అవసరం—" అన్నాడు నాన్న

ఈ సంభాషణ నేను విన్నాను. నాలోని అహంకారం ఇంక
పెరిగింది.

నేను స్కూలుకు వెళ్ళి చదువుకునేదాన్ని. స్కూల్లో మేస్టర్లు
నన్నభిమానించేవారు. ఎటొచ్చీ నా క్లాసులో చాలామంది అమ్మా
యిలు నాకంటె మంచి బట్టలు వేసుకుని వచ్చేవారు. అది నాక
బాధగా ఉండేది. వారి పక్కన నేను పేదగా కనబడాలంటే మనస
చివుక్కుమనేది. పేదరికం అంటే నాకు చాలా అసహ్యం.

హైస్కూల్లో నాకే ఇబ్బందులూ ఎదురుకాలేదు. నా క్లాస
మేట్సంతా నన్ను అభిమానించేవారు. నా పేదరికాన్ని ఎవ్వరు
పరిహసించేవారు కాదు. నేను బాగా కష్టపడి చదివేదాన్ని. మంచి
మార్కులు తెచ్చుకునేదాన్ని. ఈ విధంగా టెన్తుక్లాసు ప్యాసయ్యేసరి
నాకు పదిహేనేళ్ళు నిండాయి.

అప్పటికి నా రూపురేఖలు మారాయి. నేనిప్పుడు చిన్న
పాపను కాదు. పూర్వంలా మగపిల్లలతో చనువుగా తిరగలేను
టెన్తుక్లాసు తర్వాత నన్నింకా చదివించడమా, మానడమా అని
ఇంట్లో తర్జనభర్జన జరిగింది.



ఇంటిపట్టున ఉండి పనీపాటా నేర్చుకుంటూ ప్రైవేటుగా పరీ
క్షకు వెళ్ళవచ్చునని అమ్మ అభిప్రాయం. నేను రోజూ బయటకు
వెళ్ళిరావడంలోని ఇబ్బందులు గురించి నాన్న భయపడుతున్నాడు.

"పనీ పాటలకోసం కాకపోయినా నువ్విక ఇంటిపట్టున
ఉండడమే మంచిదనిపిస్తోందమ్మా—" అన్నాడు నాన్న.

"ఎందుకని?" అని అడిగాను.

"అల్లారు ముద్దుగా, అతి సుకుమారంగా పెంచుతూ వచ్చాను
నిన్ను. కారుల్లోతప్ప మసలకూడని రాజకుమారివయ్యావు నీవిప్పుడు.
అలాంటి నిన్ను మండుటెండలో రోడ్డుమీద ఎలానడిపించగలను?"
అన్నాడు నాన్న.

ఆయన అలా అన్నప్పటికీ అసలు భయాన్ని అంతో ఇంతో
అర్థంచేసుకోలేని అమాయకురాలినికాదు నేను — "రాజకుమారి
రోడ్డుమీద నడిచినా అదో అందం నాన్నా! మరేమీ ఫరవాలేదు.
నేను స్కూలుకు వెళ్ళి చదువుకుంటాను—" అని చెప్పాను.

చదువు విషయంలో నాభయం లేదు. క్లాసుల్లో పాఠాలు
వినకుండా ప్రయివేటుగా పరీక్షలు కట్టి ప్యాసుకాగలనన్న ధైర్యం
నాకులేదు. నేను నా భవిష్యజ్జీవితం గురించి చాలా భారీఎత్తున
కలలు కంటున్నాను. నేను గొప్పదాన్నయిపోతానన్న నమ్మకం
నాకుంది. అందుకు చదువు ముఖ్యవసరమని నాకు తెలుసు. చదువు
మానివేయడం ద్వారా నా భవిష్యత్తును నేనే పాడుచేసుకున్నట్లవు
తుందని నా అభిప్రాయం.

నాన్న నా మాట విన్నాడు. నేను ఇంటర్మీడియట్ కోర్సులో
చేరాను. అయితే నాన్న ఈలోగా నాగురించి పెళ్ళి సంబంధాలు
చూడడం ప్రారంభించాడు.

నేను ఇంటర్మీడియట్ ఫస్టియర్లో ఉండగా ఓ సంబంధం
వచ్చింది.

కుర్రాడు చూట్టానికి బాగానే ఉన్నాడు. అతను ఒకసారి నా
వంక చూసి మళ్ళీ చూపులు తిప్పుకోలేకపోయాడు.

కుర్రాడి తల్లి— "అమ్మాయికి వంటొచ్చా ?" అనడిగింది.

"మీకిచ్చిన ఉప్మా, కాఫీ - అమ్మాయి చేసినవే !" అంది అమ్మ. ఆ అబద్ధానికి నేను ఉలిక్కిపడి అమ్మవంక చూశాను. అమ్మ చాలా ఫ్రీగా ఇంకా చాలా అబద్ధాలాడేసింది.

నాకు విపరీతమైన శుభ్రంట. ఇల్లంతా నేనొక్కత్తినే సర్దేస్తానుట. చుట్టుపక్కల వాళ్ళంతా ఇల్లు సర్దుకోవడంలో నా సలహాలే తీసుకుంటూంటారుట. నాలాంటి కూతురున్నందుకు వాళ్ళంతా అమ్మ అదృష్టాన్ని పొగడని రోజు ఉండదట.

ఈ అబద్ధాలు నన్ను రెండు రకాలుగా బాధించాయి. నాకు లేని లక్షణాలు ఆపాదించి నన్ను పొగిడితే నాకు చాలా చిన్నతనంగా ఉంటుంది. ఎందుకంటే నాకున్న లక్షణాలు పొగడతగ్గవి కాకపోయినప్పుడేకదా లేని లక్షణాలు ఆపాదించాల్సి వస్తుంది. ఇదిలాఉంటే పెళ్ళివారు యదార్థంగా కనబడుతున్న నా అందాన్నంతగా పట్టించుకున్నట్లులేదు. అమ్మచెప్పిన అబద్ధాలకే వాళ్ళెక్కువ ఆకర్షితులైనట్లు కనబడింది.

పెళ్ళివారు వెళ్ళిపోయాక నాన్న నన్నడిగాడు —"అబ్బాయెలాగున్నాడమ్మా !"

"అతను నా చేతికి చీపురు అందిస్తున్నట్లు అనిపించాడు—" అన్నాను.

నాన్న ఉలిక్కిపడ్డట్లు అనిపించాడు. ఆయన ముఖంలో బాధకూడా అనిపించింది— "అవునమ్మా - వాడు రాజకుమారుడు కాదు—" అన్నాడు.

పెళ్ళివారు పదివేలు కట్నం అడిగారు. నాన్న అంత ఇవ్వలేనన్నాడు. సంబంధం చెడిపోయింది. తర్వాత ఆ అబ్బాయి అందంలో నాతో ఏమాత్రమూసరిపోలని ఓ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నట్లు తెలిసింది.



ఈ విషయం మా స్కూల్లో నా క్లాసుమేట్సు మధ్య చర్చకు వచ్చింది.

అందరిలోకీ నేను ఎక్కువగా అభిమానించే అరుణ అనే అమ్మాయి— "నీలాంటి అందగత్తెక్కూడా పెళ్ళికీ కట్నానికీ ముడిపెట్టే దౌర్భాగ్యులున్న ఈ దేశంలో డబ్బులేని ఆడపిల్లలకు పెళ్ళిలాఅవుతుంది ?"— అంది.

నేను నవ్వి—"వాడు దౌర్భాగ్యుడని నాన్నకు తెలుసు. అందుకే ఈ సంబంధం వదిలిపెట్టేశాడు. లేకపోతే ముష్టి పదివేలివ్వలేక కాదు—" అన్నాను.

అరుణ ఆశ్చర్యంగా నా వంక చూసి— "కావాలని వదులుకున్నారా ఈ సంబంధం ? కట్నం ఇవ్వగలిగుండీ అలా ఎందుకు చేశారు ?" అంది.

"వాళ్ళు బాగా ఉన్నవాళ్ళని ముందు అనుకుని పెళ్ళిచూపుల కాహ్వానించాట్ట నాన్న. తీరా చూస్తే కుర్రాడికున్న ఉద్యోగం తప్ప ఇంకేమీ ఆధారం లేదని తెలిసింది...."

"అయితే ?"

"అయితే ఏమిటి—ఏదో ఒకరోజున ఓ గొప్ప సంబంధం నన్ను వెతుక్కుంటూ వస్తుంది...." అన్నాను గర్వంగా.

"గొప్ప సంబంధం అంటే ?"

"నాకేది నచ్చితే అదే గొప్ప సంబంధం. నాకు నచ్చని సంబంధం చేయడు నాన్న. ఈ వరుడు నాకు నచ్చలేదు. నాన్నకా విషయం చెప్పాను. కట్నం వంకపెట్టి మానేశాడు...." అన్నాను.

"నీకు నచ్చే గొప్ప సంబంధమేమిటో నాకు చెప్పవూ ?" అనడిగింది అరుణ.

"నీకు చెప్పకపోతే ఎవరికి చెబుతానే !" అని నవ్వి— అబ్బాయికి అందమైన కళ్ళుండాలి. ఉద్యోగం చేయనవసరం లేనంత డబ్బు ఉండాలి—" అన్నాను.

అరుణ ఏదో అనబోయి ఊరుకుంది. ఏమి అనబోయి ఊరుకుందో నేనూహించగలను. అయితే ఆమె నోటివెంట నా ఊహలోని మాటలు వినడం ఇష్టంలేదు. కాబట్టి నేనూ ఊరుకున్నాను.

అరుణకున్న అనుమానాలు లీలామాత్రంగా నాకూ కలుగుతూంటాయి. కానీ నేను లెక్కచేయను.

ఎందుకంటే ఏదో ఒకరోజున అదృష్టం నన్నువరించి నా కలలు నిజమవుతాయని నేను నమ్ముతున్నాను. ఆ నమ్మకానికి ఎటువంటి అనుమానాలనూ జోడించడం నాకిష్టముండదు.

నిజం చెప్పాలంటే నేను మా ఇంట్లో పాదరసం మాదిరి ఉంటున్నాను. ఎవరి భావాలతోటీ బాధలతోటీ నాకు నిమిత్తం లేదు. ఏదో శాపవశాన నేనీ ఇంట్లోపడ్డాను. ఒక రోజున శాపవిముక్తి లభించి అక్కణ్ణించి బయటపడతాను.

అయితే నాకు శాపవిముక్తి లభించేదెప్పుడు ?

మొదటి సంబంధం గురించి నా అభిప్రాయం విన్నాక నాన్న తనకు తానై ఇంకే సంబంధాలూ తీసుకురాలేదు. వరుడి గురించిన వివరాలన్నీ నాకు చెప్పి నా అభిప్రాయంకోసం ఎదురు చూసేవాడు.

నాకు శాపవిముక్తి కలిగించే అర్హతలు వాళ్ళలో ఎవరికీ ఉన్నట్లు కనబడలేదు. ఈలోగా నేను ఇంటర్మీడియట్ ఫైనల్ పరీక్షలు రాశాను.

## 2

"రంగనాయకులు కొట్టుకెళ్ళి సరుకులు తీసుకు రావాలి — అంది అమ్మ కాస్త భయంగా.

నాకు పనిచెప్పడానికి అమ్మ భయపడుతుంది. ఇప్పుడైతే ఎదిగిన ఆడపిల్లను కానీ చిన్నప్పట్నించీ అమ్మకు ఈభయం ఉండేది. ఇంటికి పెద్దపిల్లను కావడంవల్ల దుకాణం పని నాకు తప్పనిసరి



అయ్యేది. అయితే నేను బజారుకు వెళ్ళడానికి చాలా షరతులుండేవి. నేను సంచీలు మోయను. వెళ్ళేటప్పుడు చేతులూపుకుంటూ వెళ్ళి వచ్చేటప్పుడు ఏ కూలివాడిచేతో సరుకులు మోయించుకు వస్తాను. సరుకులు కూడా మరీ పేదవాళ్ళకులాగ పావుకిలోలూ, వంద గ్రాములూ అయితే కొనను. వస్తువుల్నిబట్టి - బియ్యం అయితే కనీసం పాతిక కిలోలూ, పప్పులు అయితే కనీసం ఒకో కిలో - ఇలా కనీసపు తూకాలు నిర్ణయించాను. అంతకంటె తక్కువ సరుకులు కొనడానికి దుకాణానికి వెళ్ళడానికి నాకు నామోషీగా ఉంటుంది. అందువల్ల తమ్ముడు కాస్త అందిరాగానే ఈ వ్యవహారం వాడికి అర్జంటుగా అప్పగించబడింది. వాడికి ఏ మాత్రమూ నామోషీలేదు.

"మన అవసరాన్నిబట్టి మనం సరుకులు కొనుక్కుంటాం తక్కువ కొనుక్కుంటే నామోషీ ఎందుకు ?" అంటాడు వాడు.

"అవసరాన్నిబట్టి కొనుక్కుంటే ఫరావాలేదు. పావుకేజీ కందిపప్పు తేవడానికి వెడుతున్నావు. అది ఈ పూటకు మాత్రం సరిపోతుంది. రెండు కేజీల కందిపప్పు మనకు పదిహేను రోజుల అవసరం. అంత డబ్బు ఒక్కసారివ్వలేక ఏ పూటకాపూట కొనుక్కుంటున్నాం. ఆ సంగతి కొట్టువాళ్ళు ఇట్టే గ్రహించేస్తారు. గ్రహించేక వాళ్ళు మనకేసి చూసే చూపు - అబ్బ.... అది నేను భరించలేను—" అని నేను తమ్ముడికి చెబితే ఈ సంభాషణ విన్న అమ్మ నాన్నకు చెప్పేది. అమ్మ ఫిర్యాదుగా చెప్పే విషయాన్ని నాన్న ముచ్చటగా వినేవాడు. నా అభిప్రాయం మరింత బలపడేది.

నాకు బట్టలు కొనేటప్పుడు కూడా నేను నాన్నను ముందుగానే అడిగేదాన్ని - ఎంత ఖరీదులో కొంటారని! ఖరీదైన బట్టలైతేనే నేనుకూడా నాన్నతోపాటు బట్టల దుకాణానికి వెళ్ళేదాన్ని. లేకపోతే వెళ్ళేదాన్నికాదు.

నా యీ మనస్తత్వం బాగా తెలిసినది కాబట్టి అమ్మ ఇప్పుడు భయంగా అడిగింది. అందులోనూ ఇప్పుడు నేను ఈడొచ్చిన ఆడ

పిల్లను. నన్ను దుకాణానికి పంపడమే పెద్దతప్పు. అయితే తమ్ముళ్ళిద్దరూ ఇంట్లోలేరు. చెల్లెళ్ళు మరీ చిన్నపిల్లలు.

"అంత అర్జంటు పనైతే - వాళ్ళకు పని చెప్పాకే ఆటలకు పంపించొచ్చుగా -" అన్నాను అమ్మతో.

"నాకు మాత్రం ఏం తెలుసు ? ఇప్పుడే మీ అత్తయ్య దగ్గర్నించి ఉత్తరం అందింది. ఆవిడ రాసి వారమైంది. నాలుగు రోజుల క్రితం అందాల్సిన ఉత్తరం ఈరోజు అందింది. ఇంకాసేపటికి ఆవిడ ట్రయిన్లో దిగుతుంది. ఆవిడ ముఖం ముందే సరుకులు కొనడం నా కిష్టంలేదు___" అంది అమ్మ.

అత్తయ్యంటే నాన్నకు స్వయానా చెల్లెలు. ఈవిడంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే ఆవిడ నన్ను బాగా అభిమానిస్తుంది. చిన్నప్పట్నించీ కూడా ఆవిడకు నేనంటే ప్రాణం. ప్రస్తుతం నా మెడలో ఉన్న ఒంటిపేట బంగారపు గొలుసు అయిదారేళ్ళ క్రితం అత్తయ్య నాకు చేయించినదే !

అత్తయ్యకు ముగ్గురు మగపిల్లలు. ఆడపిల్లలులేరు. ఆవిడకు ఆడపిల్లలంటే అమిత ప్రాణం. అస్తమానం మా అమ్మ అదృష్టాన్ని పొగుడుతూంటుంది.

"మగ వెధవలకెన్ని చేసినా ఓ అందం చందం ఉండదు. ఆడపిల్ల ఇంట్లో తిరుగుతూంటూనే లక్ష్మీకళ కనబడుతూంటుంది___" అని నిట్టూరుస్తూంటుంది అత్తయ్య.

ఆవిడ నిట్టూర్పు నాకర్థంకాదు. మెడనిండా నగలలో లక్ష్మీకళ ఓడుతున్న అత్తయ్యకు మా ఇంట్లో లక్ష్మీకళ ఎలాకనబడుతుందో నాకు తెలియదు. అత్తయ్య కళ్ళకు అమ్మ అదృష్ట వంతురాలిలా కనబడ్డం నాకింకా ఆశ్చర్యంగా ఉంటుంది.

అత్తయ్యకు చాలా డబ్బుంది. ఆవిడ గురించి చెప్పినప్పుడల్లా నాన్న మనింట్లో బిర్లా మీ అత్తయ్య అంటూ ఉంటాడు. మావయ్యగారు చాలా వ్యాపారాలు చేస్తూంటారు. ఎప్పుడో కానీ ఆయన ఇక్కడికి రారు. అత్తయ్య మాత్రం కనీసం ఏడాదికొక



సారైనా వచ్చి మమ్మల్ని చూసి వెడుతూంటుంది. వచ్చినప్పుడల్ల నన్ను ప్రత్యేకంగా చేరదీస్తుంది. నన్ను దగ్గరగా తీసుకుని___

"నీలాంటి కూతురు పుట్టకపోయినా___ కనీసం నీ అంత అందమై అమ్మాయిని కోడలుగా చేసుకునే అదృష్టమైనా భగవంతుడు నాకి లేదు...." అని నిట్టూరుస్తుంది.

అత్తయ్య పెద్ద కొడుకు నా కంటె మూడేళ్ళు చిన్నవాడు దురదృష్టం అత్తయ్యది కాదని, నాదేనని నాకు అనిపిస్తూంటుంది.

మూడో మగపిల్లవాడు పుట్టేక అత్తయ్యకు ప్రాణప్రమా దమ మరి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేసేశారు. అందువ అత్తయ్యకు ఇంక ఆడపిల్లలు పుట్టే అవకాశం కూడాలేదు.

"దీన్ని నాకిచ్చేయ కూడదూ ? పెంచుకుంటాను...." అన అత్తయ్య.

నాన్న ఊఁ అంటే బాగుండునని నాకు అనిపించేది క ఆయన అనేవాడు కాదు. నవ్వి ఊరుకునేవాడు.

ఒకటి రెండు సార్లు నాన్న దగ్గర నేను అన్నాను కూడా___ "పాపం - అత్తయ్యకు ఆడపిల్లలంటే చాలాఇష్టం. నన్ను పెం కోవాలని మనసు పడిపోతోంది___."

నాన్న నవ్వి___"ఏదో పైకి అలా అంటారు కానీ ఈ రోజు ఆడపిల్లలంటే నిజంగా మనసు పడేవాళ్ళెవరుంటారమ్మ ! త అదృష్టాన్ని ఇతరులచేత పరోక్షంగా గుర్తింపజేయడం కో కొంతమంది అలా అంటూంటారు___ అంతే !" అన్నాడు.

అత్తయ్య గురించి నాన్న అలా అనుకోవడం నాకు న లేదు. కానీ నాన్న మాటల్లో నిజం లేకపోలేదు. నా పెంప గురించి యధాలాపంగా అనడమే కానీ అత్తయ్య ఎప్పు నొక్కించలేదు. ఈ విషయం గుర్తించడం ఇష్టంలేక నేనీ యమై ఎక్కువ ఆలోచించలేదు.

ఇప్పుడు అత్తయ్య వస్తోంది. భాగ్యవంతురాలైన అత్త ఇంకో రెండుగంటల్లో మా ఇంటికి రానున్నది. అత్తయ్య

నాకిప్పుడు కొన్ని ఆశలున్నాయి. అత్తయ్య నాపై చూపించే ప్రేమానురాగాలకు నేనిప్పుడొక చిన్న పరీక్ష పెట్టబోతున్నాను. అందుకే దుకాణానికి వెళ్ళక తప్పదు.

ఇంట్లో నెలాఖర్లో సరుకులకు చాలా ఇబ్బంది అవుతుంది. కొనుక్కున్న సరుకులు రెండు వారాలు పైగా వస్తాయి. చివరి పదిపన్నెండు రోజులూ ఏ పూట కా పూట కొనుక్కుని జాగ్రత్తగా గడుపుకుంటాము.

"ఏదీ ఆ లిస్టు ఇలా ఇవ్వు—" అన్నాను చిరాకును కప్పి పుచ్చుకుంటూ.

అమ్మ భయపడుతూనే లిస్టు ఇచ్చింది. అందులో చాలా అయిటమ్సున్నాయి. కొన్ని అరకేజీ. కొన్ని పావు కేజీ, మరికొన్ని వంద గ్రాములూ — అలా రాసి ఉన్నాయి. ఆ లిస్టు నేను రంగ నాయకులికిస్తే అతడు నాకేసి చూసే చూపు ఊహించుకుంటే నా శరీరం అసహ్యంతో జలదరించిపోయింది-"ఛీ - ఏం బ్రతుకునాది-" అనుకుని - "మరీ ఇంత తక్కువరాశావేమిటి ?" అన్నాను.

"డబ్బు చాలదు...." అంది అమ్మ నెమ్మదిగా.

అరువుకు నాన్న ఒప్పుకోడని తెలుసు - "డబ్బు చాలదంటే ఎలా ? అత్తయ్యను పస్తులు పడుకోబెడతావా ?" అన్నాను చిరాగ్గా.

"మీ అత్తయ్య రెండురోజులే ఉంటుంది...." అంది అమ్మ.

పరిస్థితి నేను గ్రహించ గలను. అత్తయ్య రాకపోతే మేము ఎలాగో అలా రోజులు గడిపేసి ఉండేవాము. అత్తయ్య రావడంవల్ల కొన్ని సరుకులు కొనడం తప్పనిసరి అయింది. అందుకే ఇప్పుడు అత్తయ్య ఉన్నన్ని రోజులకోసమే సరుకులు కొనడం జరుగుతోంది.

"సరేలే — నేను వెడతాన్లే—" అన్నాను.

అమ్మ ముఖం వికసించింది.



ఈ రోజు నేను చేసిన త్యాగం సామాన్యమైనది కాదు. అయితే దాని వెనుక ఉన్న నా ఆలోచన అమ్మ ఊహకు అందదు. భవిష్యత్తుకు సంబంధించిన ఒక పెద్ద అవసరంకోసం - ఇప్పుడీ త్యాగం నేను చేయబోతున్నాను.

"మీ అత్తయ్య వచ్చేలోగా సరుకులు ఇంటికి చేరాలి-" అంది అమ్మ ఉత్సాహంగా. తన సమస్య ఇంత సులభంగా తేలిపోతుందని అమ్మ అనుకున్నట్లు లేదు.

"అలాగేలేవే బాబూ - నాకు మాత్రం తెలియదూ ?" అంటూ నేను లిస్టు పుచ్చుకుని వీధిలోకి నడిచాను.

# 3

ఈసారి అత్తయ్య మమ్మల్ని చూడ్డానికని రాలేదు. ఏదో స్వంత పనిమీద వచ్చింది. కూడా పిల్లల్ని తీసుకురాలేదు. అవతల తనకు చాలా అర్జంటు పనులున్నాయనీ ఏ పరిస్థితుల్లోనూ తన ప్రోగ్రాం మార్చడానికి వీలుకాదనీ—అనుకున్న ప్రకారం వెళ్ళిపోతాననీ అంది.

వచ్చిన రోజున భోజనంచేసి అలసటగా పడుకుంది. మర్నాడు ఊరంతా తిరిగింది. మధ్యాహ్నంభోజనానికి ఇంటికి రాలేదు. రాత్రి భోజనంచేసి అలసటగా పడుకుంది. ఆ మర్నాడు కూడా ఉదయం బయల్దేరి హడావుడిగా ఊరంతా తిరిగి మధ్యాహ్నానికి ఇల్లుచేరి భోంచేసి నిద్రపోయింది. సాయంత్రం నాన్న ఆఫీసునించి ఇల్లు చేరాక కానీ నిద్రలేవలేదు.

అత్తయ్య ఇలా ప్రవర్తించడంతో నేను చాలా నిరుత్సాహపడ్డాను. అత్తయ్య దగ్గర కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పాలనీ, ఎన్నో విశేషాలు మాట్లాడాలనీ ఆశపడ్డ నాకూ నిరాశే ఎదురైంది. సాధారణంగా బయటికి వెళ్ళినపుడు నన్నుకూడా తీసుకెళ్ళే అత్తయ్య ఈసారి తనపనులన్నింటికీ తానొక్కర్తే వెళ్ళింది. దీనిగురించి

ఇంట్లో ఎవరూ అంతగా పట్టించుకోలేదు. నేనొక్కర్తినే
ఆలోచిస్తున్నాను.

ఈ రాత్రి పడుకుని నిద్రలేస్తే ఉదయం ఏడు
అత్తయ్య ప్రయాణం! నేననుకున్నది జరుగదేమోని
భయపడ్డాను.

సాయంత్రం నిద్రలేచి అత్తయ్య ముఖం క
వచ్చేక నాన్న నెమ్మదిగా అన్నారు — " రెండురోజుల్నించ
తూనే ఉన్నావు. మళ్ళీ రేపుదయం ప్రయాణం. ఈ సా
సరదాగా అంతాకలిసి సినిమాకు వెడదామని కాస్త
వచ్చాను—...."

నాన్న ప్రపోజల్ని అత్తయ్య తేలిగ్గా కొట్టిపారేస్తూ
ఒక్కపూటైనా అంతాకలిసి కూర్చుని హాయిగా కబుర్లు చెప
—సినిమాలకేముంది—ఎప్పుడైనా చూడొచ్చు—" అంది

అలా అనడంద్వారా నాన్నకూ పాతిక రూపాయలై
వచ్చి ఉంటుంది. కానీ నేను మాత్రం నాన్నకంటె
సంతోషించాను. దొరికిన కాస్త అమూల్య కాలమూ సిని
గడిపి వేయాల్సి ఉంటుందేమోనని నా భయం.

నాన్న అత్తయ్యను సినిమా గురించి బలవంత
తర్వాత అంతా కబుర్లలో సడ్డాము.

" ఏమిటి—ఈసారీ మరీ అంత బిజీ అయిపోయావు
అన్నాడు నాన్న.

" ఏవో వ్యాపారం గొడవలులే........" అంది అ

వాళ్ళ విషయాల గురించి నాన్న అంతకంటె
అడగలేదు. అత్తయ్య చెప్పలేదు.

సంభాషణ బంధువర్గం గురించి నడిచింది. బం
చాలామంది అసూయాపరులనీ తాము పచ్చగా ఉండడం చూ
లేకపోతున్నారనీ అత్తయ్య వాపోయింది.



" అడ్డమైన వాళ్ళూ నాతో అన్నఅనీ, తమ్ముడనీ వరుసలు
అంటూ వచ్చి సాయం అడగడం—చేయకపోతే చాటుగా
తిట్టడమూ చేస్తున్నారు. నేను మీ ఇంటికి తప్ప మరెక్కడికి
ఏడుస్తున్నారు. నువ్వు నాకు స్వయానా అన్నగారివి.
కి రాకపోతే వాళ్ళింటికి వెడతానా?" అంది అత్తయ్య.

" ఎవరుఏడిస్తే వాళ్ళపాపం వాళ్ళనే కొడుతుందిలేవే!
మాత్రం నీకు చేతనైనంతలో నలుగురికీ సాయపడు...."
నాన్న.

" నువ్వలాగే చెపుతావు కానీ నాకు మాత్రం బంధువు పేరుతో
చేయిసాచి సాయం అడిగితే అసహ్యంవేస్తుందిరా! నా
నేను సాయం చేయడం వేరు—...." అంది అత్తయ్య.

నా మనసు చివుక్కుమంది. నేను కన్నకలలన్నీ కళ్ళ
కూలిపోయినట్లనిపించింది. ఇంకా నయం—చటుక్కున
రాను కాదు—అనుకున్నాను.

కాసేపు ఇలాంటి కబుర్లయ్యేక అత్తయ్య నెమ్మదిగా నావంక
" ఈసారి దీనితో మాట్లాడ్డం కుదిరిందేకాదు- అన్నట్లు ఇప్పు
కి సెలవులేమో — దీన్నికూడా నాతో తీసుకుపోతాను...."

హఠాత్తుగా అత్తయ్య నాగురించి ఇలా అనేసరికి సంభ్రమా
లు నన్ను ముంచేశాయి.

తప్పకుండా తీసుకెళ్ళు, ఎన్నాళ్ళుంచుకున్నా ఇబ్బంది కూడా
ఇంక నిత్య సెలవులే దానికి—అన్నాడు నాన్న.

" అదేం?" అంది అత్తయ్య అర్థంకాక.

" ఏముంది—ఇంక చదువు కట్టిపెట్టి సంబంధాలు చూడాలి
" అంది అమ్మ.

"అప్పుడే దీనిపెళ్ళికి తొందరేమొచ్చింది, ఇంకచదివించరా"
— " ఏమే — నీకు చదువుకోవాలని లేదా——

ఇప్పట్నించీ పెళ్ళిమీద ధ్యాసకలిగిందా........మా రోజుల్లో అయి
తప్పేదికాదు కానీ—నీకేం కర్మపట్టిందే——హాయిగా చదువుకో
........" అంది అత్తయ్య.

వెదుకబోయిన తీగ కాలికితగిలినట్లయింది నాపని. సంభాష
నేనుకోరిన విషయం మీదనేనడుస్తోంది. స్వరంతగ్గించి—నెమ్మది
"నాకు చదువుకోవాలనే ఉంది. కనీసం బియ్యే అనా
అనిపించుకోవాలనుందీ. కానీ ఇంట్లో ఎవరూ ఒప్పుకోవడంలేదు....
అన్నాను.

" అదేమిట్రా అన్నయ్యా—దానికి చదువుకో వాలను
చదువొస్తోంది. చదివించడానికేం ? " అంది అత్తయ్య-
ఎంతో సింపిల్ విషయాన్ని నాన్న కావాలని కాంప్లికేట్ చేసినట్లు
ముఖంపెట్టి.

" ఊడూరి చదువు ఇంటర్మీడియట్‌తో ఆఖరు. వయసొచ్చి
ఆడపిల్లను పట్నంపంపించి చదివించడం ఇష్టంలేదు........" అం
అమ్మ.

అది ఇష్టం ప్రసక్తి కాదని నాకూ తెలుసు. నాక్లాస్‌మే
అరుణ వచ్చేసంవత్సరంనుంచి పట్నంలో చదవబోతోంది. వాళ
మాకంటే ఎక్కువ డబ్బున్న వాళ్ళేంకారు. కానీ తలిదండ్రు
కదొక్కత్తేకూతురు. అది బియ్యే చదువుతానని పట్టుబడితే పట్నం
హాస్టల్లో జేర్పించాలనుకుంటున్నారు. నన్నూ అలాచేసే స్తోమ
నాన్నకులేదు. అరుణ తలిదండ్రులకు ఇద్దరేపిల్లలు. ఒక్క
ఆడపిల్ల. కానీ నాన్నకు అయిదుగురుపిల్లలు. అందులో ముగ్గు
ఆడపిల్లలు.

అత్తయ్య నాన్నవంక అదోలా చూసి—" నీ అభిప్రాయ
కూడా అదేనా ? " అంది.

" అవును........" అన్నాడు నాన్న.

చటుక్కున అత్తయ్య పైటచెంగుతో కళ్ళు తుడుచుకుంది
ఆవిడకళ్ళు చెమ్మగిల్లాయని అప్పుడే నాకు అర్థమైంది— "అం



....నన్ను మీరు పరాయిదానికిందే చూస్తున్నారన్నమాట. ఈవిషయం
నాకు కాస్త ముందుగా తెలిసి ఉంటే మీ ఇంటికి రావడానికి బదులు
ఏ హోటల్లోనో దిగి ఉండేదాన్ని. నాకేం డబ్బులేక మీ ఇంటికి
రావడం లేదు గద........" అంది అత్తయ్య.

హఠాత్తుగా అక్కడ నిశ్శబ్దం ఆవరించింది. నాకు కలిగిన
సంతోషాన్నికూడా నేను నిశ్శబ్దంగానే అనుభవిస్తున్నాను.

"నువ్వలా ఎందుకనుకుంటున్నావో నాకర్థంకావడంలేదు...."
అన్నాడు నాన్న తనకేమీ అర్థంకాని ముఖంపెట్టి.

" సుమను మా ఇంట్లో ఉంచి చదివించవచ్చునన్న ఆలోచన
నీ కెందుకు రాలేదు ? "

నాన్ననవ్వి —" దాన్ని చదివించాలని సీరియస్‌గా అనుకుని
ఉంటే తప్పక మీ ఇంట్లోనే ఉంచేవాణ్ణి. ఏదో కుర్రదాన్ని సమాధాన
పరచడానికి మేముజూపించిన సాకునాధారంగా తీసుకుని మనసు కష్ట
పెట్టుకునేటంత తెలివితక్కువదానివని నేననుకోలేను—" అన్నాడు.

నాన్న తెలివితేటలకు నేనాశ్చర్యపోయాను. నన్ను చదివించ
డానికి నాన్నకు డబ్బు ఇబ్బంది తప్ప మరొకటి లేదని నాకు
తెలుసు. అత్తయ్య ఇంట్లో నన్నుంచడానికి ఆయన అభిమానపడు
తున్నాడని నాకు తెలుసు. —" ఎంత తోడబుట్టిన చెల్లెలైనా ఓ
అయ్య చేతిలో పెట్టేక పరాయిదే అవుతుంది. దానంతటది అంటే
అప్పుడాలోచించవచ్చుగానీ సుమను వాళ్ళింట్లో ఉంచే ప్రసక్తిలేదు"
అని నాన్న ఏనాడో ఖండితంగా చెప్పేశాడు. ఇప్పుడు అత్తయ్యకు
మరోలా చెబుతున్నాడు.

అత్తయ్య ముఖంలో మెరుపు కనిపించింది. ఆ మెరుపు
చూడగానే నాన్న మంచితనాన్ని గుర్తించాను. అత్తయ్యకు నేను
భారం కాకూడదు. ఈ ఉద్దేశ్యంతో ఆయన నన్ను వాళ్ళింట్లో
ఉంచకూడదనుకున్నాడు. ఆ విషయం చెబితే అత్తయ్య బాధ
పడుతుందని ఇప్పుడబద్ధం చెప్తున్నాడు.

ఎదుటి వాళ్ళను సంతోషపెట్టడమే నాన్న ధ్యేయం.

అందమైన కళ్ళున్న నాన్నకు ఇంత మంచి ధ్యేయముండడ లో ఆశ్చర్యమేమీలేదు.

" అయితే ఇంక మా రు మాట్లాడకండి. ఇంటికి పెద్దపిల్ల చదువుకోవాలని అనుకుంటోంది. నిండా పదిహేడేళ్ళులేవుదానికి అప్పుడే పెళ్ళికి తొందరలేదు. మా ఊళ్ళో మా ఇంట్లో ఉం బియ్యే చదువుతుంది సుమ, ఇంత కాలం నాకు తీరని ఆడపిల్ల సరద ఈ మూడేళ్ళలోనూ తీర్చుకుంటాను........" అంది అత్తయ్య.

ఎగిరిగంతేయాలనిపించింది నాకు. ఎంత మంచిది అత్తయ్య నిజంగానన్నభిమానిస్తోంది అత్తయ్య. అత్తయ్యింట్లో మూడేళ్ళు టాను నేను.

అత్తయ్య ఇంటికీ మా ఇంటికీ హస్తిమశకాంతరం ఉంది.

మాది ఎత్తు అరుగుల పెంకుటిల్లు. ఇల్లు విశాలంగా ఉన్నప్పకీటి గచ్చు చాలా చోట్ల బీటలు తీసింది. ఇంటి గడపల బీటలు తీశాయి. గోడమెత్తి దానిమీద వెల్ల వేసినట్లుగా తెలుస్తు ఉంటుంది. ఇల్లునిండా నానా చెత్తా చెదారము వుంటుంది. రంగ వెలసిపోయిన కర్రసోఫాలూ, గట్టిగా కదిలితే ఊగుతూండే పట్టె మంచాలూ మా ఇంట్లోని ఫర్నిచరు.

అత్తయ్యది చిన్న బంగళా. ఇల్లు సినిమాల్లో బంగళాల ఎప్పుడూ నీటుగా ఉంటుంది. వస్తువులన్నీ అమరికగా ఉంటాయ ఇంటి చుట్టూ పూలతోట. ఇంటిగోడలు సిమెంటువి. వాటికి చక్క రంగు పెయింట్ చేయబడి ఉంటుంది. ఫర్నిచర్ ఇంటికి తగ్గట్టుగా ఉంటుంది. అలాంటి ఇంట్లో ఎలా మసలాలో తెలుసుకోవాలన్న నాకోరిక.

యువరాజు విద్యాభ్యాసం చేసేటప్పుడు మిగతా అన్నివిద్యలతో పాటు రాజరికానికి అవసరమైన ప్రత్యేక విద్యలు కూ నేర్చుకుంటాడు. ఏదో ఒకరోజున భాగ్యవంతుల ఇంట్లో అడు పెడతానని నాకు తెలుసు. ఒక్కసారి ఈ ఎత్తు అరుగుల ఇంట్లో



ఆ ఇంట్లో అడుగుపెట్టి అడివిమనిషిగా అపహాస్యంపాలు కాకుండా ఉండడానికి నాకు కొంత శిక్షణ అవసరం. ఆ శిక్షణ అత్తయ్య ఇంట్లో తప్ప నాకు మరెక్కడ లభిస్తుంది. అదీకాక నాభవిష్యత్తుకీ బియ్యే చదువుకీ లంకె పెట్టబడి ఉందన్నది నానమ్మకం.

ఎంత ప్రయత్నించినా ఏవో అనుకోని ఖర్చులెదురు రావటంవల్ల నాన్న దగ్గర డబ్బు ఆట్టే నిల్వలేదు. నా పెళ్ళి మూడేళ్ళు వాయిదాపడితే ఆయనకు కాస్త ఊపిరి పీల్చుకునే సమయం దొరుకుతుంది. అందుకని నా చదువు కొనసాగడం నాన్నకు ఇష్టమే; అయినా వెంటనే ఒప్పుకోవడం బాగుండదు కాబట్టి - "నీకెందుకే - అనవసరంగా శ్రమ !" అన్నాడు.

"శ్రమ అనుకుంటున్నావా - ఎదిగిన ఆడపిల్లని నేను జాగ్రత్తగా చూడగలనా అని అనుమానిస్తున్నావా ?" అంది అత్తయ్య.

"ఛ - ఛ - అవేం మాటలమ్మా :" అంది అమ్మ.

"నువ్వేమన్నాసరే వదినా - సుమను నేను కంటికి రెప్పలా చూసుకుంటాను. దాని మనసుకు కష్టం కలగనివ్వను. మీ చేత నేను మాట పడవలసిన పరిస్థితి ఎదురు రానివ్వను. రేపే దాని ప్రయాణం !" అంది అత్తయ్య.

"ప్రయాణం రేపే అని మాత్రం అనకు.........అన్నాడు నాన్న".

"ఏం ?" అంది అత్తయ్య అసహనంగా.

"ముందిది పరీక్ష ప్యాసు కావాలి. తర్వాత మీ ఊళ్ళో దీనికి కాలేజీలో సీటు దొరకాలి ఇంకా........" అని నాన్న ఏదో అనబోతూండగా

"సుమ ఇంతవరకూ ఏ పరీక్షా ఫెయిల్ కాలేదు. ఇప్పుడూ కాదు. ఇంక మా ఊళ్ళో కాలేజీలో సీటు దొరకడం సంగతంటావా— దీనికి సీటు దొరక్కపోతే మా ఊళ్ళో కాలేజీ ఉండదు-" అంది అత్తయ్య నవ్వుతూ.

"అది సరేలేమ్మా ఇంతవరకూ దీన్ని వదిలి ఉండలేదు. మూడేళ్ళపాటు అదేమో నీ మనిషి అయిపోతుంది. అది నా ఇంట్లో ఉంటే ఒకటీ నీ ఇంట్లో ఉంటే ఒకటీకాదు. అయినా తల్లి ప్రాణం కొట్టుకుపోతూంది. ఈ సెలవు నాలుగు రోజులూ ఇక్కడే ఉండ నిద్దూ......" అంది అమ్మ. అప్పుడే నేను వెళ్ళిపోవడం ఊహించ కున్నట్లుంది. అమ్మ కళ్ళు చెమ్మగిల్లాయి. పైట కొంగుతో కళ్ళు తుడుచుకుంది అమ్మ.

అప్రయత్నంగా నా కళ్ళూ చెమ్మగిల్లాయి. అమ్మంటే సాధారణంగా నాకు కోపం. అమ్మ ఎప్పుడూ నాకు నచ్చేలా మాట్లా డదు. నేను చేసే పనులు అమ్మకు నచ్చవు. మేమిద్దరమూ ఎక్కు వగా పోట్లాడు కుంటూనే ఉంటాము. ఇప్పుడు అమ్మ మాట్లాడు తూంటే అమ్మలోని అమ్మను చూస్తున్నాను నేను.

అత్తయ్య నవ్వి — "తల్లి ప్రేమ గురించి నాకేం తెలుస్తుం దొదినా — ఎప్పుడూ పిల్లల్నొదిలే తిరుగుతూంటాను—" అంది.

"అవసరాన్నిబట్టి ఎవరైనా పిల్లల్నొదిలి తిరుగుతారు కానీ ఇప్పుడు అనుకోని ప్రయాణం అయితే హడావుడి అయిపోతుంది. ఇక్కడ చక్కబెట్టుకోవలసిన వ్యవహారాలన్నీ అయేక కొన్నాళ్ళలో నేనే దాన్ని తీసుకువచ్చి నీ దగ్గర దిగబెడతాను-" అన్నాడు నాన్న అత్తయ్యతో.

"నీ ఇష్టం—" అంది అత్తయ్య.

# 4

తలుపు తీస్తూనే— "ఏమిటే ఇంత పొద్దున్నే వచ్చావ్—" అంది అరుణ ఆశ్చర్యంగా.

"నా సంతోషం పంచుకోడానికి నీకంటే మంచి స్నేహితు రాళ్ళెవరున్నారే ?" అన్నాను.



"ఏమిటే అంత సంతోషకరమైన వార్త ?" అంది అరుణ ఆశ్చర్యంగా.

"ఇప్పుడే మా అత్తయ్యను రైలెక్కించి వస్తున్నాను..." అన్నాను.

"ఊఁ" అంది అరుణ లోపలికి దారితీస్తూ. ఇద్దరం ఓ గదిలోకి వెళ్ళి కూర్చున్నాం.

"నేనూ నిన్ను ఫాలో అవుతున్నానే !" అన్నానుత్సాహంగా.

"అంటే ?"

"పట్నంలో నేను బియ్యే చదవడానికి ఇంట్లో అంగీకరించారు..."

"అదెలా జరిగింది ?" అంది అరుణ ఆశ్చర్యంగా.

"మా అత్తయ్య అమ్మనీ నాన్ననీ కూడా దెబ్బలాడింది. నేను వాళ్ళింట్లో ఉండి బియ్యే చదివి తీరాలని పట్టుబట్టింది. ఆఖరికి అమ్మా నాన్నా ఒప్పుకున్నారు...." అన్నాను.

"ఇదేనా నువ్వు చెప్పాలనుకున్న సంతోషకరమైన వార్త ? అంది అరుణ కాస్త నీరసంగా.

అరుణ నీరసం చూసి నా ఉత్సాహం కాస్త తగ్గింది—"ఏం నీకు సంతోషంగా లేదా ?" అన్నాను.

"ఇందులో పెద్ద సంతోషించతగ్గ విషయమేముంది ?" అంది అరుణ.

"మనం ముగ్గురం కలిసి మూడేళ్ళు మళ్ళీ చదువుకోవచ్చు. అది నీకు సంతోషంగా లేదా ?"

"నీ అంత మంచి స్నేహితురాలు మళ్ళీ నాకు దొరుకుతుందా? నువ్వు నాతో జీవితాంతం కలిసి ఉండాలన్నది నా కోరిక. అయితే నా బాధవేరు...." అంది అరుణ.

"ఏమిటో చెప్పు - విని తెలుసుకుంటాను...." అన్నాను కాస్త చిరాగ్గా.

"ఈ రోజుల్లో ఆడవాళ్ళు చదువుకున్న కొద్దీ సమస్య
పెరిగిపోతాయి. నువ్వు బియ్యే చదివావనుకో. అప్పుడు నీకోస
కనీసం ఎమ్మే చదివిన మొగుణ్ణి చూడాలి. వాడింకా ఎక్కువ కట్న
అడుగుతాడు. పెళ్ళి చాలా కష్టమైపోతుంది. పెళ్ళేకదా - ఆడద
జీవితానికి పరమావధి!" అంది అరుణ.

"మరైతే నువ్వెందుకు చదువుతున్నావు....?" అన్నాను.

"అసలు విషయం చెప్పేయనా?" అంది అరుణ.

"ఊఁ"

"నాకింక చదువుకోవాలని లేదు. కానీ మా బావ బలవంత
మీద బియ్యే చదవాల్సి వస్తోంది. నేను గ్రాడ్యుయేట్ నయ్యాక
మా పెళ్ళి జరుగుతుందిట...." అంది అరుణ. అలా అన్నప్పు
దాని కళ్ళు మెరిశాయి.

అరుణను వాళ్ళ బావకివ్వాలని చిన్నప్పట్నించీ అనుకొం
న్నారు. మాటలు ఈ మధ్య ఖరారైనట్లున్నాయి. అంటే అరు
కేవలం మొగుడికోసమే చదువుతున్నదన్న మాట!

"స్వయానా నీ మేనత్త కొడుకే నువ్వు గ్రాడ్యుయేట్ కా
లని శాసిస్తున్నాడంటే ఆడపిల్లలు బియ్యే అవసరమెంతో అ
చేసుకో—" అన్నాను దాని వాదనను దానిమీదకే తిప్పికొడుతూ.

"నువ్వేమను—ఒక ఏడాదిలో నీ పెళ్ళి జరిగిపోతే బాగుం
డనిపిస్తోంది నాకు...." అంది అరుణ.

"నా పెళ్ళి అంత సులభంగా ఎలా జరుగుతుందే? నే
ఎదురు చూసేది ఓ రాజకుమారుడి కోసం. నేను నడిచేదారిలో పూ
పరిచి, పూలులేని దారిలో నా పయనానికి కారును సిద్ధంచేసి, న
నగలతో ముంచెత్తి - అపురూపమైన నా అందానికి అపురూపపై
అనురాగాన్నందజేయుగల భాగ్యవంతుడు వచ్చే వరకూ నాకు పె
కాదుగదా...."

"అలాంటివాడు కావాలనుకుంటే ఏ ముసలాడో దొర
తాడు నీకు...." అంది అరుణ.



"ముసలాణ్ణెందుకు చేసుకుంటానే నేను! నేను వరించ బోయేది అందాల యువకుణ్ణి! అతగాడికి అందమైన కళ్ళు ముఖంలో ప్రత్యేకతగా ఉంటాయి...." అన్నాను.

అరుణ నావంక అదోలా చూస్తూ— "సుమా! మరీ అంత కలల్లో తేలిపోకే.... వాస్తవం ఒకప్పుడు చాలా భయంకరంగా ఉంటుంది—" అంది.

"నన్నలా భయపెట్టకు. ఎంత భయంకరమైన వాస్తవానికైనా నేను తట్టుకోగలను...." అని ఆగి.... "నా విషయంలో భయం కరమైన వాస్తవమంటే ఏమిటో చెప్పనా? పెళ్ళి కాకుండా కన్యగా ఉండిపోవడం...." అన్నాను.

"అంటే?" అంది అరుణ.

"నేను కలగనే యువకుడు దొరక్కపోతే కన్యగానైనా మిగిలిపోతాను తప్పితే - నా కలను మాత్రం అబద్ధం కానివ్వను...." అన్నాను.

నా మాటల్లోని పట్టుదల అరుణకు అర్థమైనట్లుంది. అది నా వంక జాలిగా చూసి— "నువ్వొత్త అమాయకురాలివి. ఆవేశమే గానీ ఆలోచన లేదు. నీకు నేనెలా సాయపడగలనో తెలియకుండా ఉంది నాకు...." అంటూ నిట్టూర్చింది.

"నా భవిష్యత్తు గురించి ఇక ముందెన్నడూ నన్ను నిరుత్సాహ పర్చకుండా ఉండడమే నువ్వు నాకు చేయగలిగిన సాయం...." అన్నాను అరుణతో. తర్వాత నేను అక్కడ ఎంతోసేపుండలేదు.

నేను ఇల్లు చేరగానే నా రెండో తమ్ముడు మధు నా దగ్గరకు వచ్చి— "అక్కా - నువ్వింక చదువుకోవద్దే—" అన్నాడు.

నేను వాడివంక కాస్త కోపంగా చూసి— "నేను చదువు కుంటే నీకేం?" అన్నాను.

"చదువుకోకపోతే ఇక్కడే ఉంటావు. చదువుకుంటే ఈ ఊరొదిలి అత్తయ్య దగ్గరకు వెళ్ళిపోతావు. నేను నిన్నొదిలి ఉండ లేనే?" అన్నాడు మధు.

అప్రయత్నంగానే నా కళ్ళు చెమ్మగిల్లాయి. చటుక్కున
దగ్గరకు తీసుకుని— "నేనిప్పుడు చదువుకోలేదనుకో. అ
నాన్న నాకు వెంటనే పెళ్ళి చేసేస్తారు. అప్పుడు నేను శాశ్వత
ఇంట్లోంచి వెళ్ళిపోతాను - ఎప్పుడో కానీ కనబడను. అలా
చదువుకుంటున్నాననుకో. కావాలనుకున్నప్పుడల్లా మనం ఒకళ్ళనొక
చూసుకోవచ్చు—" అన్నాను.

మధు ఏదో ఆలోచనలోపడి వేళ్ళుమడిచి లెక్కలు కూ
వేశాడు. తర్వాత నా వంక చూసి — "అక్కా - నా చదు
పూర్తై ఉద్యోగం చేసేదాకా నువ్వు చదువుకుంటూనే ఉండు. నా
ఉద్యోగం వచ్చేక మనిద్దరం కలసి ఒకచోటే ఉందాం. నేనైతే
పెళ్ళిచేసి పంపించనుగా!" అన్నాడు.

"చాలా గొప్పహామీ ఇచ్చావురా—" అని వాడిబుగ్గల
కొట్టాను. ఇలాంటి హామీని ఏ ఆడపిల్లా కోరుకోదని
పదకొండేళ్ళ వయసుకి స్ఫురించలేదనుకుంటాను.

మధు ఒక్కడే కాదు - ఇంట్లోని మిగతా వాళ్ళకూడా నే
వెళ్ళడం ఇష్టంలేదు. అంతా నా వంక దిగులుగా చూసి - ఇక్క
ఉండిపొమ్మనమని కోరుతున్నారు. ఇది నాకు చాలా చిత్రం
కనిపించింది.

నా స్వభావం ఇతరులనొట్టే పట్టించుకోదు. ఎంతసేపూ
అవసరాలు, నా సుఖం చూసుకునే మనిషిని నేను. నా తమ్ము
గురించి కానీ, చెల్లెళ్ళ గురించి కానీ నేను చూపిన ప్రత్యేకప
శ్రద్ధంటూ ఏమీలేదు. వాళ్ళను కసిరి తిట్టడమే ఎక్కువకూడా
అత్తయ్య దగ్గరికి వెళ్ళిపోతాననుకునేటప్పుడు కూడా నేను వా
గురించి ఆలోచించడం లేదు. వాళ్ళను వదిలిపెట్టి ఉండడంలో
కష్టం నాకు స్ఫురించడంలేదు. నా భవిష్యత్తు. నా స్వార్థం మాత్ర
గోచరిస్తున్నాయి.

వాళ్ళంతా దిగులుగా అయిపోవడంలో నాలో కొంత సం
లనం కలిగింది. రక్త సంబంధం ఎంత బలమైనదో మనకు తెలి



కుండానే కొన్ని అనుబంధాలు మనను ఎంతలా కట్టిపడేస్తాయో నాకర్థమైంది. పలుపుతాడుతో బంధించబడిన దూడ విశాల ప్రపంచంలోకి దూకాలని ప్రయత్నిస్తే ఏమవుతుంది?

కనిపించని పలుపుతాడు నన్ను బంధించి ఉన్నదని నాకు అర్థమైంది. ఆ తాడునుంచి బయట పడడానికి మిగతా అన్ని రోజులూ ప్రయత్నించాను. పలుపు తాడు నన్ను వీడిందని అనలేను గానీ అది బాగా సాగి పొడవైంది. ఎంతపొడవైనదంటే మా ఇంటి నుంచి మా అత్తయ్య ఇంటి వరకూ వెళ్ళగలిగేటంత!

ఈలోగా పరీక్ష ఫలితాలు వచ్చాయి. నేను ఇంటర్మీడియేట్ ప్యాసయ్యాను.

అత్తయ్య ఇంట్లో నన్నుదిగబెట్టడానికి నాన్న ఒక్కడే కూడా వచ్చాడు. ఆయన అత్తయ్య ఇంట్లో రెండురోజులున్నాడు.

"ఈ క్షణంనుంచీ ఇదినాకూతురు. దీనికి సంబంధించిన బాధ్యతలన్నీనావి. నువ్వు దిగులు పడకు—" అంది అత్తయ్య.

కానీ నాన్న ముఖంలోని దిగులు మాయంకాలేదు. ఆయన నన్ను చాటుగా తీసుకువెళ్ళి ఎన్నో నీతులు చెప్పాడు.

"సుమా! నువ్వు చాలా తెలివైనదానివి. నీకునేనేమీ చెప్పక్కర్లేదు. అయినా నాచాదస్తం కొద్దీ చెపుతున్నాను. నీ అత్తయ్య నాకు తోడబుట్టిన చెల్లెలే అయినా అంతస్థుల్లో ఇప్పుడు నాకూ దానికీ చాలా తేడా ఉంది. స్వయానా మేనత్త అయినప్పటికీ-నీకు నా అంతస్తేకాని దాని అంతస్థురాదు. అందువల్ల అది ఏమన్నా మనసుకష్టపెట్టుకోకు. కాస్త నోటిమురుసు ఉన్నా దానిమనసు మంచిది. నువ్వుండడానికీ వల్లమాలిన అభిమానం. అందుకే నిన్నిక్కడ ఉంచడానికి ఒప్పుకున్నాను. ఎప్పుడైనా నీమనసుకు కష్టంవస్తే మాత్రం నిస్సంకోచంగా నాకుత్తరంరాయి. అంతేగానీ మనసులో వ్యధపెట్టుకుని కుమిలిపోకు. ఏవిషయంలోనూ భయపడకు. బాగా చదువుకో. తరచుగా ఉత్తరాలురాయి—".

నాన్న చెప్పిన నీతుల సారాంశమిది.

నాన్న నిజంగా వెర్రివాడు. ఆయనకు నామనసు తెలియ
నేననుకున్నది సాధించడంకోసం ఏమైనా చేయగలనునేను. అత్తయ
గురించి ఆయనకంటె నాకేబాగాతెలుసు. అత్తయ్య ఏమన్నా నా
కోపంరాదు. ఒకవేళ వచ్చినా నేను సహించగలను.

నాకు భయంలేదని ధైర్యం చెప్పినప్పటికీ నాన్నముఖం
దిగులు తగ్గలేదు.

నాన్న ఉండగానే అత్తయ్య నాకోసం ఏర్పాటు చే
సదుపాయాలన్నీ చూపించింది.

అత్తయ్య నాకోసం ఓగదిని ప్రత్యేకంగా కేటాయించి
గదిలో మంచికంబళీ పరువబడి ఉంది. ఒక గోడవారగా అందమై
మంచం, దానిమీద మెత్తటి పరుపు, మరో పక్క ఓ స్టీలు బీరు
దానికి కాస్త పక్కగా డ్రస్సింగ్ టేబుల్. ఇంకోమూల రీడిం
టేబుల్, టేబుల్ లాంప్ ఉన్నాయి. హోటల్ గదికిలాగ దా
అటాచ్‌డ్ బాత్రూం ఉంది.

నాగది చూసి నేను థ్రిల్ అయిపోయాను.

గదిలో కాలింగ్ బెల్ ఒకటుంది. అదిమ్రోగిస్తే వెంట
నౌకరుపరుగెత్తుకువస్తాడు. అత్తయ్య ఇంట్లో వంటవాడుకాక మొత్త
నలుగురు నౌకర్లున్నారు.

నాన్న ఉండగానే అత్తయ్య వంటవాణ్ణిపిలిచి—నాకిష్టమై
వంటకాల పేర్లు నాచేతా, నాన్నచేతా చెప్పించింది. అన్నింటి పే
చెప్పడానికి నేను, నాన్నకూడా మొహమాటపడితే—" ఏమే
నీకిష్టమైనవాటిపేర్లే నువ్వు మరిచిపోతే ఇంకా బియ్యేలో సబ్జక్టు
గుర్తుంచుకుంటావ్—" అంటూ తనుకొన్ని వంటకాల పే
చెప్పింది.

అప్రయత్నంగా నేను నాన్నముఖంలోని చూశాను. అమ్మ
మాత్రమే గుర్తుండవలసిన నాకిష్టమైన వంటకాలపేర్లు అత్తయ్య
అంతబాగా గుర్తుండడం నాకాశ్చర్యాన్ని కలిగించింది.


T. D. K. Sarma, M.Sc.

ఇప్పుడు నాన్న ముఖంలో దిగులు మాయమైనట్లే ఉంది.

అత్తయ్య వంటవాడితో—" చూడు రామయ్యా ! ఈ అయిటమ్సు కనీసం వారానికి రెండు రోజులైనా మెనూలో రావాలి. గుర్తుంచుకో ! " అంది.

ప్రయాణం కాబోయేముందు నాన్న నన్ను రహస్యంగా పిలిచి—" ఈ ఇంట్లో వదుల్తూ నీకీడబ్బు ఇవ్వడానికి చిన్నతనంగానే ఉంది. కానీ నాశక్తి ఇంతేగదా— ఉంచు—" అంటూ రెండు వందలు చేతిలో పెట్టాడు. అసలాడబ్బు ఆయన అత్తయ్య చేతికిద్దామనుకున్నాడు కానీ ఆమె అంగీకరించక పోవడంతో నాకిచ్చాడు. వెళ్ళేముందు నాన్నను రకరకాల భయాలావహించాయని నేనూహించాను.

నన్ని వైభోగాలావహించడం ఆయనకు సంతోషంగానే ఉంది. కానీ ఇటువంటి వైభోగాలు తను తనబిడ్డలకు సమకూర్చలేకపోయినందుకాయనకు బాధగానూ ఉంది. వీటిమోజులోపడి నేనాయన్ను మర్చిపోతానేమోనన్న భయంకూడా ఆయనకు కలిగింది. ఎందుకంటే వచ్చేముందు ఆయన ఎన్నో పర్యాయాలు—సెలవలివ్వగానే బయల్దేరి వచ్చేయమని చెప్పాడు. కానీ వెళ్ళేముందు ఒక్కసారికూడా ఆమాట అనలేదు. ఈ భోగభాగ్యాలనుంచి తన ఇంటికివచ్చి క్షణంకూడా సుఖపడలేనని ఆయనకు అర్థమైపోయి ఉండాలి.

ఆయన భయాన్ని తొలగించడంకోసమని నేను ఆయన వెళ్ళేటప్పుడు—" నాన్నా ! సెలవులివ్వగానే నేను బయల్దేరి వచ్చేస్తాను—" అని చెప్పాను.

నాన్న కళ్ళు సంతోషంతో మెరవడం చూసేక నాకెంతో తృప్తి కలిగింది.

నాన్న వెళ్ళిపోయాక నాకు నిజంగానే దిగులుకలిగింది. నామెదలోని పలుపుతాడును ఎవరో చాలా దూరాన్నుంచి లాగుతున్నట్లు అనిపించింది. అప్పుడే నాకు అనిపించింది—

"ఈపలుపుతాడు ఇంకా ఎంత పొడుగు సాగుతుందో—ఇలానే ఎంత దూరం పోతానో ?"

ఏదిఏమైనా నామెడలోని పలుపుతాడు సాగడమే కా తెగడం సంభవించదని నాకు అనిపించింది.

## 5

చాలాతొందరగానే అత్తయ్య ఇంట్లో నేను సర్దుకున్నాను. జీవితం తొందరగా నాకు వంట బట్టింది. అయినా అలా జీవనం కోసం పుట్టినదాన్ని—నాకు వంటబట్టకపోతే ఇంకె వంటబడుతుందది ?

కాలేజిలో నా అడ్మిషన్ గురించి మామయ్యగారేవో ఏర్ చేశారు. ఆయన దగ్గర నాకు బాగా చనువు తక్కువ. అద ఆయన ఇంట్లో ఉన్నకాసేపూకూడా చాలాహడావుడిగా ఉంటారు

అత్తయ్య నాతో—" జీవితంలో ఇలాంటిమొగుణ్ణి మ కోరుకోకు. పెళ్ళాం బిడ్డల్ని పట్టించుకోని మనిషి ఎంతసంపా మాత్రం ఏం లాభం ?" అంది—ఒకసారి.

అత్తయ్య అలా అన్నప్పటికీ ఆమాటలనావిడ గర్వం అన్నదని ఆవిడకు జీవితంలో అసంతృప్తి లేదనీ నాకు అర్థమై మావయ్యగారంటే అత్తయ్యకు చెప్పలేనంత ప్రే మానాలున్నాయి. ఆయన్నావిడ కంటికిరెప్పలా చూసుకుంట క్షణం ఇంట్లో ఉండరని గొణుక్కున్నప్పటికీ—ఆయన హారాలను ఎప్పటికప్పుడు గుర్తుచేసి ఇంట్లో ఉండనివ్వ చేసేది కూడా ఆవిడే!

తనభర్త క్షణంకూడా తీరుబడిలేని మనిషి కావడం ఆవి గర్వకారణం!



మామయ్యగారు పెళ్ళాంబిడ్డల్ని పట్టించుకోరన్న విషయం కూడా అబద్ధం. ఆయన సంపాదన అంతాకూడా వీరి వైభోగాలకే వినియోగపడుతోంది.

భర్త ఇరవైనాలుగు గంటలూ తననే అంటిపెట్టుకుని ఉంటే పూరి గుడిసెలో ఉన్నా ఫరవాలేదనీ, తనను అంటిపెట్టుకుని ఉండడం కోసం సంపాదించే అవకాశాలున్నప్పటికీ వదులుకోవడమే మంచిదనీ అనుకునే ఆడవాళ్ళు కథల్లో తప్ప ఉండరేమోనని అత్తయ్యను చూసేక అనిపించింది.

నేను అత్తయ్య ఇల్లుచేరేక నెలరోజుల వరకూ కాలేజీకి వెళ్ళవలసిన అవసరం లేకపోయింది. ఈలోగా నా కారణంగా అత్తయ్య ఇంట్లో కొన్ని మార్పులు వచ్చాయి.

అత్తయ్య ఇంట్లో వంటవాడు రామయ్య కాక నలుగురు పని వాళ్ళున్నారు. నలుగురూ మగవాళ్ళు. పాతిక ముప్పై ఏళ్ళ వయసు వాళ్ళు. ఏ మాటన్నా ఎదురు చెప్పకుండా చెప్పిన పని చెప్పినట్లు చేసే మనస్తత్వం గలవాళ్ళు.

ఒక రోజు వాళ్ళలో వాళ్ళు గొడవ పడ్డట్లున్నారు. వాళ్ళలో రమణ అనేవాడొచ్చి అత్తయ్యతో — "వీర్రాజు నాతో మాట్లాడుతూ చిన్నమ్మగారు దేవకన్యలా వుంటారన్నాడండి--" అన్నాడు.

"మంచి మాటే అన్నాడు గదా!" అంది అత్తయ్య.

"అది కాదండి. మా అందరికీ అమ్మగారిలా కనిపించే చిన్నమ్మగారు వాడికి దేవకన్యలా కనిపించడమేమిటండీ —" అన్నాడు వాడు కన్య అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ.

అత్తయ్య ఉలిక్కిపడింది.

వీర్రాజుకు అత్తయ్య నా గది పనులు అప్పగించింది. దాన్ని శుభ్రంగా ఉంచడం వాడివంతు. అందువల్ల వాడు తరచుగా నా గదిలోకి వచ్చి వెడుతూంటాడు.

వెంటనే— "వాణ్ణిలాపిలు!" అంది.

క్షణాలమీద వీర్రాజు అక్కడ హాజరయ్యాడు.

"ఏరా— మా సుమను గురించి ఏదో అన్నావుట—" అంది అత్తయ్య.

"నేనేమీ అనలేదండి—" అన్నాడు వీర్రాజు.

అత్తయ్య రమణ వంక ప్రశ్నార్థకంగా చూసింది.

"నువ్వు చిన్నమ్మగారిని దేవకన్యలా ఉంటారని అనలేదు!" అన్నాడు రమణ.

"అయ్యబాబోయ్ - అందులో తప్పేముందండమ్మగారూ నేను మీగురించి కూడా ఎన్నోసార్లు దేవతలా ఉంటారని అన్నాను-" అన్నాడు వీర్రాజు.

"అత్తయ్య దేవత— నేను దేవకన్య...."

వాడి దృష్టి నాకు నవ్వు తెప్పించింది.

"ఇంకెప్పుడూ అలా అనకు...." అంది అత్తయ్య ఏమనాలో తెలియక.

"అది కాదండమ్మగారూ.... మీరే ఆలోచించండి....నేనన్న మాటల్లో తప్పేముందో....? ఈ రమణగాడికి నేనంటే అసూయ కొద్దీ మీకు అలా చెప్పాడు. ముందు ముందు ఇంకా కల్పించి చెబుతాడేమోనని నాకు భయంగా ఉంది...." అన్నాడు వీర్రాజు.

"వాడికి నువ్వంటే అసూయ ఎందుకురా?" అంది అత్తయ్య.

"చిన్నమ్మగారి గది శుభ్రం చేయడం రోజూ నేనే చేస్తున్నానని వాడికి అసూయగా ఉందండి. ఒకరోజు నేను చేస్తాను వాడు అన్నాడండి. నాకేం అభ్యంతరం లేదు కానీ అమ్మగారినడుగు అన్నానండి నేను. అడగడానికి బదులు నా మీద చాడీలు చెప్పడానికి వచ్చాడండి వాడు...."

"సరే - మీ ఇద్దరూ వెళ్ళండి—" అంది అత్తయ్య.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయాక అత్తయ్య నా వంక చూసి." "చూసేవా సుమా! ఇంతకాలం నాకీ విషయం స్ఫురించనేలేదు. వాళ్ళు మగవెధవలు. నువ్వు ఆడపిల్లవి. నీ గదిలో పని చేయడానికి



వాళ్ళు కొట్టుకు చస్తున్నారు. వాళ్ళకు నీ మీద దుర్బుద్ధి ఏమీ లేదు. ఉంటే వాడు నిన్ను దేవకన్య అన్నానని నిర్భయంగా ఒప్పుకోడు. నిన్ను చూడడంలోనే ఓ ఆకర్షణ ఉంది వాళ్ళకు. అలాంటి వాళ్లను నీకు దగ్గరగా రానివ్వకూడదు...." అంది.

అత్తయ్యకు ముగ్గురూ మగపిల్లలే కావడం వలన ఆవిడ పనివాళ్ళ నందర్నీ మగవాళ్ళనే పెట్టుకుంది. నా రాకలో ఆ నియామకంలోని ఇబ్బంది ఆమెకు కనబడింది.

వెంటనే ఆవిడ ఏదో నంబర్‌కు ఫోన్ చేసి పనికి ఓ ఆడపిల్లను పంపించమని చెప్పింది. తర్వాత నా వంక చూసి— "ఇక్కణ్ణించీ నీ గది వ్యవహారాలన్నీ అడపిల్ల చూసుకుంటుందిలే—" అని ఓ క్షణం ఆగి— "నువ్వు కాలేజీలో జాగ్రత్తగా ఉండాలి. మన కాలిక్రింద మనుషులకే నిన్ను చూస్తే ఏదో ఆకర్షణ కనబడుతోంది. దాన్ని వారు తట్టుకోలేకపోతున్నారు. మామూలు వాళ్ళయితే అదుపులో పెట్టడం చాలా కష్టం—" అంది.

అత్తయ్యలో ఇంకో విషయం నాకు నచ్చింది. ఆవిడ పనివాళ్ళ మానసిక బలహీనతను అర్థం చేసుకుని వాళ్ళను క్షమించగలిగింది. కొన్ని ఇళ్ళలో అయితే అలాంటి వాళ్ళకు క్షణాల మీద ఉద్వాసన చెప్పడం జరుగుతుంది. ఇదే విషయం నేనంటే- "వాళ్ళు చాలా సంవత్సరాలుగా మనింట్లో పని చేస్తున్నారు. ఎంతో నమ్మకమైనవాళ్ళు. ఈ రోజుల్లో నమ్మకమైన పనివాళ్ళు దొరకడం చాలా కష్టంగా ఉంటోంది. తప్పు చేశారని ఇంట్లోంచి పొమ్మనడం వల్ల కొత్తగా వచ్చేవాళ్ళు మంచివాళ్ళు వస్తారని చెప్పలేము గదా! తప్పును క్షమిస్తే వాళ్ళు సిగ్గుపడతారు. తప్పును శిక్షిస్తే వాళ్ళు పగబడతారు కూడా. అమాయక ప్రాణులు వాళ్ళు. ఎదగని మనసులు వాళ్ళవి. వాళ్ళను మచ్చిక చేసుకుని ఆడించాలి తప్పితే చెండనాడకో కూడదు...." అంటూ ఓ సామెత కూడా చెప్పింది నాకు.

రెండూ దయ్యాలే అయితే, అందులో ఒకదానితో బంధం తప్పకపోతే — తెలియని దయ్యం కంటే తెలిసిన దయ్యాన్నే

ఉంచుకోవడం మంచిదట. ఎందుకంటే తెలిసిన దయ్యం దు
ప్రవర్తన ఎలా ఉంటుందో మనకు తెలుస్తుంది కాబట్టి కనీస
జాగ్రత్తపడగలుగుతాము.

డబ్బున్న వాళ్ళగురించి ఇది వరలో నాకో దురభిప్రా
యముండేది. వాళ్ళు పనివాళ్ళపట్ల అంతులేని అసహనం కలిగి ఉంట
రనీ చిన్న తప్పుకే పనిలోంచి తీసేస్తారనీ అనుకునేదాన్ని. అత్తయ
దగ్గర నేను నిజంగా చాలా మంచి పాఠం నేర్చుకున్నాను. ఇం
ఇలాంటి పాఠాలు చాలా నేర్చుకోవాల్సి ఉంటుంది నేను.

అ సాయంత్రానికే నా గురించి ఓ పనిమనిషి చేరింది. దా
పేరు లక్ష్మి. సుమారు ముప్పైఏళ్ళుంటాయ్ దానికి. మనిషి బలం
ఆరోగ్యంగా ఉంది కానీ అందంగా మాత్రం లేదు. దానికి మొగుడు
పిల్లలూ కూడా ఉన్నారు. పొద్దున్న రెండు గంటలూ, సాయంత్ర
ఓ గంటా వచ్చి నా పనులు చూసుకుని వెడుతుంది.

"నాకోసం ప్రత్యేకంగా పనిమనిషిని పెట్టావెందుకత్తయ్యా
అన్నాను కాస్త బాధగా.

"దాన్ని నీకోసం ప్రత్యేకంగా పెట్టలేదు. నాకూ దాని అ
సరముంది...." అంది అత్తయ్య. కానీ ఆ మాటలు నిజం కా
నాకు తెలుసు.

అత్తయ్యకు నిజంగానే ఆడపిల్లల మనసుందనుకుంటాను.
అవసరాలన్నీ పరోక్షంగా చూసుకుంటూనే ఉండేది. నాకు
మాత్రం తనే వేసేది. నా అలంకరణ విషయంలో సలహాలిచ్చే
నేను కూడా తెచ్చుకున్న బట్టలు అత్తయ్యకు నచ్చలేదు.
కోసం తనే బట్టలు కొంది. వాటిముందు నిజంగానే నా అస
బట్టలు వెల వెల బోతున్నాయి.

నేనిలాగంటున్నానని ఏమీ అనుకోకూ నువ్వు తెచ్చుకు
బట్టలు ఇంట్లోకి తప్ప వాడకు అంది అత్తయ్య.

అత్తయ్య మాటల్లోని అంతరార్థం నాకర్థమైంది. నేనా
అన్న కూతురిని. ఇక్కడ ఈ ఊళ్ళో ఆవిడకో హోదా ఉ



ఆ హోదాకు తక్కువగా తన బంధువులుండడం ఆవిడ కిష్టం లేదు. ఆ విషయాన్నావిడ నిర్మొహమాటంగా నాకు చెబుతోంది. ఇందులో ఆవిడ నన్నవమానిస్తున్నట్లు నా కనుమానంలేదు. తన హోదాకు తగ్గట్లుగా నన్ను తయారు చేయడానికి కావిడకు చాలా ఖర్చు అవుతుంది. అ ఖర్చంతా తనే భరించడాని కావిడ సిద్ధంగా ఉంది. కాబట్టి నేనావిణ్ణి అపార్థం చేసుకోలేదు. అదీ కాక నేనిలాంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్నాను.

నా అదృష్టం మారిపోవడం అత్తయ్య ఇంట్లో అడుగు పెట్టడంతోనే ఆరంభమైందేమో ఎవరు చూడొచ్చారు ?

అత్తయ్య పెద్దకొడుకు రవి. రెండోవాడు రఘు. మూడో వాడు హరి. నాకు సంబంధించినంతవరకూ ముగ్గురూ ఎంతో మంచి వాళ్ళు. బయట వాళ్ళకు చాలా అల్లరివాళ్ళన్న పేరుఉంది. వాళ్ళకు అహంకారం జాస్తి అనీ పెదవాళ్ళను మనుషుల్లా చూడరనీ కూడా చెప్పుకుంటారు. ఇంట్లో పనివాళ్ళను కూడా వాళ్ళు అగౌరవంగానే మాట్లాడుతూంటారు, అయితే వాళ్ళమ్మకు భయపడో ఏమోగానీ నేనంటే మాత్రం వాళ్ళెంతో గౌరవంగా ఉంటున్నారు. ప్రేమాభిమానాలు ఒలికిస్తున్నారు. మేము నలుగురం ఒకతల్లిబిడ్డల్లా ఉండగలిగాం అక్కడ.

కాలేజీ రెండురోజుల్లో తెరుస్తారనగా అరుణ మా ఇంటికి వచ్చింది. ఒకరోజుక్రితమే హాస్టల్లో చేరిందిట అది.

అరుణ నన్నూ, నా గదినీ చూచి —— నా అదృష్టాన్ని విపరీతంగా పొగిడి—— "ఇలాంటి అదృష్టంకోసమైనా పెళ్ళి మానుకుని బియ్యే చదవొచ్చే——"అంది.

నేను అత్తయ్యను విపరీతంగా పొగిడేశాను.

"ఇలాంటి అత్తయ్య ఎవరికోగానీ లభించదు. మీఅత్తయ్యకు నీ కీడైన ఓ కొడుకుంటే ఎంతబాగుండేదో ?" అంది అరుణ.

"లేనివాటిగురించి ఆలోచించడమెందుకే—మా అత్తయ్యకు నా కీడైన కొడుకుండి — — వాడికి నాకునచ్చే అంద

మైన కళ్ళు లేకపోతే ఏంచేసేది ? అప్పుడెలాగూ వాణ్ణి నే కాదంటే మా అత్తయ్య క్కోపంవచ్చి మాతో తెగతెంపులుకూ చేసుకుంటుంది. అలాంటివేం జరుక్కుండా ఇలాగే బాగుం లెద్దూ !" అన్నాను.

అరుణ నా వంక అదోలా చూసి—— "ఏమే——ఇం డబ్బున్నాసరే అందమైన కళ్ళుంటే గానీ మగాడు నీకు నచ్చడా?" అంది.

"అందమైనకళ్ళు ——డబ్బు —— రెండూ ఉండాలి రెండిట్లో ఏది లేకపోయినా నాకు నచ్చడు—" అన్నాను.

"నువ్వు అదృష్టవంతురాలివి లేవే——....నువ్వు కోరుకున్న వన్నీ సాధ్యపడతాయని నాకు తోస్తోంది——" అంది అరుణ.

నిజంచెప్పాలంటే ఇప్పుడు నా ముందు అరుణ వెలవె బోతోంది. అసలే అందగత్తెను —— దానికి తగ్గ బట్టలు కూ ధరించాను నేను.

అరుణను అత్తయ్యకు పరిచయం చేశాను. అత్తయ్య దా వివరాలన్నీ అడిగి అభిమానంగా ఇల్లంతా చూపించి........"హాస్టల్లో ఉన్నానని మొహమాటపడవద్దు. తరచుగావచ్చి కనిపించి వె తూండు........" అంది. అత్తయ్య చేసిన మర్యాదలకు అరు చాలా సంతోషించింది.

## 6

మొదటిరోజు కాలేజీ అనుభవం నాకు వింతగానే ఉంది.

మా మయ్యగారు కార్లో దిగబెట్టారునన్ను కాలేజీదగ్గర.

అరుణ నేను ఒకటే క్లాసు. బియ్యే ఎకనామిక్స్.

క్లాస్‌రూం ఇదివకరటి వాటికంటె విశాలంగా ఉంది. సీ గ్యాలరీ మోడల్లో ఉన్నాయి.



మా క్లాసులో మొత్తం అరవైమంది ఉన్నాం. అందులో ఇరవై ఇద్దరు ఆడపిల్లలం. అందరిలోకీ నేనే అందగత్తెనని నా అభిప్రాయం. ఓరకంటితో మొదటిరోజునే నా క్లాసులోని అబ్బాయిల్ని పరీక్షించి చూసేశాను. వాళ్ళలో పది పదిహేనుమంది దాకా మరీ కుర్రాళ్ళలా ఉన్నారు. అసలైన మగాళ్ళలోకనిపించేవాళ్ళు పదిమంది కంటే ఉండరనుకుంటాను. అందులో ముగ్గురికళ్ళు చాలా బాగున్నాయి. అలా బాగున్న ముగ్గుర్లోనూ ఒక్కడు కాకీపాంటు వేసుకున్నాడు. మిగతా ఇద్దరూ కాస్త ఖరీదైన మనుషుల్లాగే ఉన్నారు.

ఉదయం, సాయంత్రం కలిసి మొత్తం అయిదు పీరియడ్సు జరిగాయి. అయిదుగురు లెక్చరర్సులో ఇద్దరు యాభైకి పైబడ్డ వారు. ఒకాయన నడివయస్కుడు. ఇద్దరు కుర్రాళ్ళలా ఉన్నారు. ఇద్దరులోనూ తెలుగుమాస్టారి కళ్ళు చాలా బాగున్నాయి.

తెలుగు మేస్టారి క్లాసులో పిల్లలు బాగా అల్లరిచేశారు. కానీ ఆయనకు ఏ మాత్రమూ కోపంవచ్చినట్లు లేదు. పిల్లలధోరణిని మళ్ళించడానికి ప్రయత్నిస్తూ ఆయన పాఠంచెప్పిన తీరు మెచ్చుకోతగ్గది.

పీరియడ్‌కూ పీరియడ్‌కు మధ్య మగపిల్లలు అల్లరి చాలా ఎక్కువగానే ఉంది. ఇతర సమయాల్లోకూడా ఇతర క్లాసులవాళ్ళు కాబోలు కొంతమంది మా క్లాసుముందే తచ్చాడారు.

మధ్యాహ్నంభోజన విరామసమయంలో నాకు ఇంటిదగ్గర్నుంచి క్యారియర్ వచ్చింది. అక్కడ అంతమంది ఆడపిల్లలం కలిశాము. కబుర్లు చెప్పుకున్నాము. అక్కడ మాట్లాడుకున్న దాన్నిబట్టి తెలిసిందేమిటంటే........ఈరోజు కోసం మగపిల్లలంతా ఆత్రుతగా ఎదురుచూస్తూంటారుట. కాలేజీలో చేరిన కొత్త అమ్మాయిలందరి గురించీ తెలుసుకుంటారుట. ఎవరెవరికి ఏయే పేర్లు పెట్టాలీ, ఎవరెవరిని ఎలా ఏడిపించాలో అన్న విషయాలు చర్చించడానికి ఓ కమిటీ కూడా ఉంటుందిట. ముందున్నదంతా ముసళ్ళపండుగేనట !

మగపిల్లలగురించి మరీ అంతలా అనుకోవడం నాకునచ్చలేదు ........"వాళ్ళకిదేపనేమిటి ? మనకుమాత్రం అబ్బాయిలగురించి కుతూహలముండదూ ? అలాగే వాళ్ళకీ మనగురించి కుతూహ ముండొచ్చు. మనం తిన్నగా ఉంటే వాళ్ళు మనజోలికిరారు, అం ఇక్కడికి చదువుకోసమే వస్తారు........" అన్నాను.

"నువ్విలా అబ్బాయిల తరఫున మాట్లాడ్డం బాగోలేదు. మ మంతా ఐకమత్యంతో ఉండాలి........" అందీ అమ్మాయి.

"మన ఐకమత్యం అబ్బాయిల్నసహ్యించుకునేందుకు కా పోతే నేనెప్పుడూ రెడీయే........" అన్నాను.

"మీరింకా పట్నవాసానికి కొత్త అనుకుంటాను. లేకపో అబ్బాయిలు అల్లరివాళ్ళు కాదని అనలేరు .... ...." అం అమ్మాయి.

"అదేంకాదు. నేను మనిషి ముఖంచూసి మనసుతెలుసుకో గలను. ఉదాహరణకు మాక్లాసులో అందరికంటే అందంగా ఉం ప్రకాశరావు....అల్లరిపిల్లాడు కాడని ఖచ్చితంగా చెప్పగలను...." అన్నాను.

మా క్లాసులో అమ్మాయిలు అక్కడ ఓ నలుగురున్నారు అందరికంటే అందగాడు ప్రకాశరావు అన్నమాట వాళ్ళలో ఏ ఒక్కరూ ఒప్పుకోలేదు. నలుగురూ నాలుగు పేర్లు చెప్పారు.

"చూశారా........ఎవరి మటుక్కు వాళ్ళు క్లాసులో అబ్బాయి లందర్నీ ఒక్కపూటలో పరీక్షగాచూశారు కాబట్టేవాళ్ళ అందచందా గురించి మాట్లాడగలిగారు. అంటే అబ్బాయిల కంటే వేగంగా మనం వాళ్ళని పరీక్షిస్తామని ఋజువయింది........" అన్నాను.

హఠాత్తుగా మా మధ్య వాదనలు ఆగిపోయాయి.

"మీకు అందాన్నిమించిన తెలివి తేటలుకూడా ఉన్నాయి....." అందో అమ్మాయి నాతో.

"మనమధ్య ఒకరునొకరు మన్నించుకోవడం జరగకూడదు. అప్పుడే ఐకమత్యం సాధ్యపడుతుంది.... ...."అన్నాను.



అంతా స్నేహపూర్వంగా ఒకరిగురించి ఒకరు తెలుసుకున్నాం.

కాలేజీ అబ్బాయిల చెడుప్రవర్తన గురించి నేను చాలా విన్నాను. మనసులో వో కాస్త భయంగానే ఉంది. కానీ వాదన వచ్చేసరికి ఎందుకో అలా మాట్లాడేశాను. బహుశా నాలోని అహంకారం నన్ను నలుగురికీ వ్యతిరేకంగా మాట్లాడేలా చేస్తుందేమో ?

కాలేజీ అయిపోయాక మామయ్యగారు వచ్చి నన్నుకారులో తీసుకుని వెళ్ళారు. ఇంటిదగ్గర అత్తయ్య వివరాలన్నీ అడిగింది.

"నువ్వు చాలా జాగ్రత్తగా ఉండాలి. కాలేజీల్లో చాలామంది పోకిరీ వెధవలుంటారు. నువ్వు బుద్ధిగావెళ్ళి బుద్ధిగా వచ్చేస్తూండు ...మీ అమ్మానాన్నలచేత నేనుమాటపడకూడదు. అంతా నీ మీదనే భారం........" అంది అత్తయ్య.

మర్నాటి నుంచి నాకు కారు అవసరంలేదనీ బస్సులో వెళ్ళి రాగలననీ చెప్పాను అత్తయ్యతో. ఈ కారు వల్ల నాకు చాలా ఇబ్బందులున్నాయి. టైము ప్రకారం వెళ్ళి టైము ప్రకారం తిరిగి రావాలి. ఆలశ్యానికి సంజాయిషీ ఇచ్చుకోవాలి. కాలేజీలో జరిగే ఏ ఫంక్షన్స్‌కూ అటెండ్ కావడానికి వీలుండదు. మామయ్యగారు మొదటి రోజు కాబట్టి నా గురించి ప్రత్యేకంగా వీలు చేసుకున్నారు కానీ ప్రతిరోజూ ఇది సాధ్యపడేది కాదు. డ్రైవరును నియోగించాలన్నా - వాళ్ళకున్నది ఒక్కటే కారు. అత్తయ్య పిల్లలు ముగ్గురూ బస్సులోనే స్కూలుకు వెళ్ళి వస్తూంటారు.

అత్తయ్య నా సూచనకు వెంటనే ఒప్పుకుని— "నువ్వు మాత్రం వేళ తప్పకుండా రావాలి. అనుకోని పరిస్థితి ఏర్పడితే ఫోన్ చేసి నాకు ముందుగా తెలియజేయాలి, లేకపోతే నీకోసం ఊరంతా అట్టుడికి పోతుంది. తెలిసిందా ?"— అంది.

"అలాగే !" అన్నాను.

ఆ రాత్రి నాకు రకరకాల కలలు వచ్చాయి. కలలో ఎందరో అబ్బాయిలు కనిపించారు. వాళ్ళలో తెలుగు మేష్టరు కూడా ఉన్నాడు.

అందరూ డబ్బుతో తులతూగిపోతున్నారు. ఆశగా నా వంక
న్నారు. నా చేతిలో వరమాల ఉంది. నేనెటూ నిర్ణయించు
పోతున్నాను. ఏ నిర్ణయమూ జరగకుండానే కలలోంచి ఇ
వచ్చేక నా మనసు నన్నిలా అడిగింది— "నువ్వు కాలేజీకి
తున్నది చదువుకునేందుకా, స్వయం పరానికా?"

ఈ ప్రశ్న నాకు మరో విధంగా అయితే నవ్వు తెప్పిం
ఆడపిల్లలు కానీ, మగపిల్లలు కానీ — అసలు ఎంతమ
చదువుకోసమని కాలేజీకి వెడుతున్నారు?

ఎకనామిక్స్‌లో ఏవో కొత్త విషయాలు తెలుసుకుం
నేను చదువుకోవడంలేదు. బియ్యే ప్యాసుకాగానే నేను ఎకన
మరచి పోయినా ఆశ్చర్యంలేదు. నాకు కావలసింది సౌభాగ్య
మైన జీవితం.

ఒక నెలరోజుల్లో కాలేజీజీవితానికి బాగా అలవాటు
నేను. కాని ఈ జీవితం నేననుకున్నంత సుతారంగా లేదు.

కాలేజీలో నా అందానికి మంచి ప్రచారమే లభించింది.
అందంగా ఉన్నానని అబ్బాయిలంతా చెప్పుకుంటున్నట్లు తెలిసిం

నేను అందంగా ఉన్నప్పటికీ, ఖరీదైన బట్టలలో
అందాన్ని అలంకరించ లేదు. అందుకు కారణం కూడా అత్త

సహజమైన నీ సౌందర్యానికి - పౌడర్లు, స్నోలూ
పెట్టలేవు. మంచి బట్టలు నీ హోదాను తెలియజేయడానికే
అందాన్ని పెంచడానికి కాదు. ప్రత్యేకమైన అలంకరణ
లోనూ నిన్ను మరీ కొట్టవచ్చేటట్లు కనబడేలా చేస్తుంది. అలా
కరించుకున్న అమ్మాయిలే కాలేజీల్లో అల్లరిపాలవుతారు.
కెప్పుడూ గౌరవమే లభిస్తుంది. నీ ప్రవర్తనే నిన్ను సలుగురి
లోనూ పదేలా చేస్తుంది —" అంది అత్తయ్య.

అత్తయ్య చెప్పిన విధంగానే నేనుశుభ్రమైన బట్టల
కుని నీటుగా తల దువ్వుకుని కాలేజీకి వెళ్ళేదాన్ని. కాలేజీలో
చాలామంది చూసేవారు కానీ నా వెంటబడడమూ అల్లరి



మాట్లాడడమూ అట్టే జరిగేది కాదు. అలా జరిగేది కొందరి విష యంలోనే. వాళ్ళలో మాధవి, శారద, రేణుక ఉన్నారు. వాళ్ళు ముగ్గురూ ఎక్కడ కనిపించినా సరే కుర్రాళ్ళు వెర్రిగా కేకలు వేసే వారు. బూతులు కూడా ఉపయోగించేవారు.

వాళ్ళు ముగ్గుర్లోనూ రేణుక అట్టేబాగుండదు. మాధవి, శారద బాగానే ఉంటారు కానీ మరీ దేవకన్యలు కాదు. ఎటొచ్చీ వాళ్ళ అలంకరణ మగపిల్లలను రెచ్చగొట్టేలాగే ఉంటుంది. వాళ్ళు వేసుకునే జాకెట్లు మగాళ్ళ దృష్టిని ఆడదాని గుండెల మీంచి మళ్ళించుకోలేని విధంగా కుట్టబడ్డాయి. ఆ జాకెట్‌ను కప్పే పమిట అతి పల్చటిది. వాళ్ళ ముఖాలు అప్పుడే సినిమా షూటింగుకు సిద్ధపడ్డ నటీమణులవి లాఉంటాయి. కనుకొలకుల్లోంచీ వాళ్ళు చూసే చూపులు మగవాళ్ళను పిలుస్తున్నట్టే ఉంటాయి.

మాధవి, రేణుక డబ్బున్న వాళ్ళ పిల్లలు. శారద మధ్య తరగతి అమ్మాయి. వీళ్ళలో మాధవికి అంతా తనవెంటబడడం ఇష్టమే! మగపిల్లల అల్లరి ఆమెకు ఆమోదమే! శారదకు ఈ అల్లరి ఏ మాత్రమూ ఇష్టంలేదంటుంది. అలంకరణలో మార్పు తీసుకొస్తే ఏ బాధా ఉండదని చెబితే........ఈ స్వతంత్ర భారతదేశంలో నా కిష్టమైన విధంగా డ్రస్ చేసుకోడానికి వీల్లేదా అంటుంది. అబ్బాయిలు తనవెంటబడడం శారదకూ ఇష్టమేననీ, కానీ ఇంట్లో వాళ్ళు తిడతారని భయపడి అయిష్టాన్ని నటిస్తోందనీ నా అనుమానం. ఇంక రేణుక అయితే అస్తమానూ మగపిల్లల్ని తిడుతూనే ఉంటుంది. వాళ్ళపేరు చెపితే మండిపడుతుంది. కానీ అంతరాంతరాల్లోని ఆమె అహం మగపిల్లలకారణంగానే తృప్తి చెందుతోందని నేననుకుంటున్నాను.

ఈ ముగ్గురూ ఒకగ్రూపుగా తిరగరు. ముగ్గురివీ మూడు గ్రూపులు. వారివారి మనస్తత్వాల్ని బట్టి మిగతాపిల్లలు ఆయా గ్రూపుల్లో చేరుతున్నారు. ఏ గ్రూపుకూ చెందని ఆడపిల్లల్లో నేనున్నాను. నన్ను ఆకర్షించడానికి మాధవి, శారదకూడా

ప్రయత్నిస్తూంటారు, నేను అందరితోనూ సఖ్యంగా ఉండ
ప్రయత్నిస్తున్నాను.

మా తెలుగు లెక్చరర్‌గారి కళ్ళు బాగుండడంవల్ల
ఆయన క్లాసులో ఎక్కువగా ఆయన్ని చూస్తూండేదాన్ని. త్వర
ఆయన ఆ విషయం గమనించాడనుకుంటాను. నెమ్మదిగా క్లాసు
నా వైపు చూసి పాఠం చెప్పడం మొదలుపెట్టాడు. ఆయన నా
చూస్తూంటే నాకు ఏదోలా ఉండేది. ఆ అనుభవం నాకు నచ్చే
అందువల్ల తెలుగుక్లాసు మాత్రం ఎప్పుడూ వదులుకునేదాన్ని కా

ఎవరికీ తెలియకుండా జాగ్రత్తగా తెలుగు లెక్చరర్ గురిం
వివరాలు సేకరించాను. ఆ వివరాలు నా కంత ప్రోత్సాహకరంగా లే
అయినా నా వెర్రికానీ బాగా డబ్బున్న వాడైతే కాలేజీలో లెక్చ
పోస్టుకెందు కొస్తాడు ?

ఒకరోజు అత్తయ్య ఇంటికి ఓ దూరపు బంధువు వచ్చా
ఆయనకు జ్యోతిషంలో ప్రవేశమున్నదట. ఆ రోజు ఆయన అం
జ్యోతిషం చెప్పాడు.

ఆయన నా జన్మదినం వివరాలు తెలుసుకున్నాడు. చే
చూశాడు. చాలాసేపు ఏవేవో లెక్కలు వేసి__ "నీది చాలా గొ
జాతకం__" అన్నాడు.

"అన్నీ వివరంగా చెప్పండి__" అంది అత్తయ్య.

అందరు జ్యోతిష్కుల లాగే ఆయన నా గురించి చా
గొప్పగా చెప్పాడు. అన్నీ చెబుతూ ఆఖరున__ "నీ కున్న ము
మైన కోరికలలో ఒకటి మాత్రం ఎప్పటికీ తీరకుండా ఉ
పోతుంది__" అన్నాడు.

"అదేమిటో చెప్పగలరా ?" అనడిగింది అత్తయ్య.

"చెప్పలేను__" అన్నాడాయన.

కానీ నేను భయపడ్డాను. నాకున్నవి రెండే రెండు కోరి
అందమైన కళ్ళు. డబ్బు. ఈ రెండూ ఉన్న భర్త కా



నాక్కాబోయే భర్తకు ఈ రెండింట్లో ఒకటి ఉండదా ? ఉండని పక్షంలో అది ఏమై ఉంటుంది ?

అందమైన కళ్ళు ముష్టివాళ్ళకుకూడా ఉంటాయి. అందువల్ల అవి లభించడం అంతకష్టం కాదు.

అయితే నేను జీవితంతో రాజీ పడాలా ?

అరుణతో నేనన్న మాటలు గుర్తుకు వచ్చాయి-నా విషయంలో భయంకరమైన వాస్తవం అంటే పెళ్ళి చేసుకోకుండా కన్యగా మిగిలి పోవడం__ అని దానితో చెప్పాను. చివరికి అంతే జరుగుతుందా ?

అప్పుడే నాకు తెలుగు లెక్చరర్ గుర్తుకు వచ్చాడు. అందమైన ఆయన కళ్ళు మనసులో మెదలగానే నాకు అదోరకమైన పులకరింత కలిగింది. ఆయన్ను పెళ్ళి చేసుకుంటే ?

అప్పుడీ చుట్టం చెప్పిన జ్యోతిషం నిజమవుతుంది.

ఆ జోస్యాన్ని నిజం చేయడమెందుకు? .... అసలు జోస్యాన్ని నమ్మమని ఎవరన్నారు ?

జ్యోతిష్కుడు వెళ్ళిపోయాడు. అత్తయ్య నీవిషయమే అడిగాను.

"ఏమో.......ఆయన ఇదివరలో కూడా నాకు చాలా జోస్యాలు చెప్పాడు. ఇంచుమించు అన్నీ నిజమయ్యాయి. జ్యోతిషం నిజమైనా కాకపోయినా నమ్మడంలో ఏదో ఆనందముంది. ఎందు కంటే సాధారణంగా జ్యోతిష్యులు జరగబోయే మంచిగురించే చెబుతారు. దానికోసం ఎదురుచూడడంలో ఆనందముంటుంది గదా...." అని ఆగి.... ... "అసలు జీవితంగురించి నీ ముఖ్యమైన కోరికలు చెప్పు.... ....వాటిలో ఏది జరక్కుండా ఉంటుందో చెబుతాను......" అంది అత్తయ్య.

"ఏమో అత్తయ్య.........నా కేదీ తెలియదు...." అన్నాను మొహమాటంగా.

అత్తయ్య నా వంక అదోలా చూసి తమాషాగా నవ్వింది....
"నీ వయసులోని పిల్లల కోరికలన్నీ రాబోయే మొగుడిచుట్టూనేగా

ఉంటాయి. అవెలాగూ నాకు చెప్పవు... ...అయినా జ్యోతిష్కు
చెప్పింది నిజమైతే తప్పించుకోవడానికి ఓ ఉపాయం చెబుతాను...
అంటూ అత్తయ్య చిన్నకథ చెప్పింది.

పూర్వం విక్రమార్కుడికి కాళికాదేవి వెయ్యేళ్ళు రాజ్యపా
చేయమని వరమిచ్చిందట. తర్వాత, ఆ కాళికా దేవే విక్రమార్కు
మంత్రి భట్టిని రెండువేల సంవత్సరాలు జీవించమని వరమిచ్చింద
విక్రమార్కుడు, భట్టి ఒకరిని విడిచి ఒకరుండలేరు. అందు
వాళ్ళోఉపాయం పన్నారు. విక్రమార్కుడు సంవత్సరానికి ఆ
నెలలు మాత్రమే రాజ్యపాలనచేసి మిగతా ఆరునెలలూ
సంచారం చేస్తాడు. ఆ విధంగా ఆయన వెయ్యేళ్ళ రాజ్యపాల
రెండువేల సంవత్సరాలు జీవించాల్సిఉంటుంది,

"అలాగే అన్నింటికీ ఉపాయాలుంటాయి. నీకు అద్దే
దలలేని ఓ చిన్న విషయాన్నికూడా ఇప్పట్నించీ నీ ముఖ్య
కోరికల జాబితాలో చేర్చడానికి ప్రయత్నించు ఆఖరికి
జరక్కుండా పోతుంది...." అంది అత్తయ్య.

"నాక్కాబోయే మొగుడికళ్ళు అందంగా ఉండకూడదు...
అనుకున్నాను మనసులో. కానీ దీన్ని నిజంగా నా కోరికగా
కుంటే మాత్రం జ్యోతిష్కుడు చెప్పిన జరగనికోరిక ఇది
మరొకటి అవదని నమ్మకమేమిటి?

జ్యోతిషం గురించిన నా అజ్ఞానానికి నాకేనవ్వొచ్చింది అ
నా విషయాన్ని మరచిపోయి మర్నాడు కాలేజీలో అరు
చెప్పాను.

అరుణనవ్వి ఇలాఅంది... ... "జ్యోతిషాన్ని నమ్మిన
మాత్రాన నువ్వు అజ్ఞానివి అయిపోవు. అది నీ బలహీన
మాత్రం తెలియజేస్తుంది. ఎవడికైనా బ్రహ్మాండమైన జబ్బు
ఏ వైద్యానికీ లొంగడంలేదనుకో. వాడు పరమనాస్తికుడైనాసరే
ఆరోగ్యభారాన్ని భగవంతుడిమీద పెట్టేస్తాడు. అది మనిషిబలహీన
నీలో ఓ బలమైన కోరికఉంది. అది తీరదేమోనన్న వ్యథ



నీ కోరికకున్న బలం, నీ మనసును బలహీనం చేసి జ్యోతిషాన్ని కూడా నమ్మేస్థితికి దిగజార్చింది... ..."

"నువ్వు చెప్పిన సలహాపాటించాలంటే నాకు మన తెలుగు లెక్చరరే నచ్చాడు. ఆయన్నే పెళ్ళిచేసేసుకుని నా కోరికలకు ఈ క్షణంలోనే చరమగీతం పాడేయొచ్చు. కానీ నేను నా కోరికల నలా నీళ్ళుపోసి పెంచాలనే అనుకుంటున్నాను... ..." అన్నాను.

అరుణ ఉలిక్కిపడి తెలుగులెక్చరర్ వివరాలడిగి తెలుసుకుని... ... "నువ్వు చాలా ఘటికురాలివేనే... ...నీ మనోబలం సంగతి తెలియకపోయినా ఇప్పటికి నీ కోరిక బలం తెలిసింది...." అంది.

# 7

సెలవు లివ్వగానే నేను ఇంటికి వెళ్ళాను. ఇంటికివెళ్ళగానే ఇంటిల్లపాదీ నన్ను చుట్టుముట్టేశారు. అంతా మామూలు కావడానికి గంటన్నరకు పైగా పట్టింది.

అత్తయ్య ఇంట్లో నన్నెలాచూస్తున్నదీ, అక్కడవాళ్ళు నాకేమేం ఏర్పాట్లు చేసిందీ, కాలేజీలో నా చదువు ఎలాకొనసాగుతున్నది వగైరాలన్నీ నేను చిలవలూ పలవలూ అల్లిచెబుతుంటే అందరూ నోరు తెరుచుకువిన్నారు.

"తొందరలో నేనూ ఇంటర్మీడియేట్ ప్యాసైపోయి... ... అత్తయ్యింటికి వెళ్ళి బియ్యేచదవాలి... ..." అన్నాడు పెద్ద తమ్ముడు.

"బియ్యే అత్తయ్యింట్లో చదవరు. కాలేజీలో చదువుతారు...." అన్నాను నేను.

అంతా నవ్వారు. పెద్ద తమ్ముడికి ఉక్రోషం కూడా వచ్చింది.

అమ్మమాత్రం నాగోడంతావిని—... "ఇప్పుడంతా బాగానే ఉంది. దీనికి పెళ్ళెప్పుడవుతుందో... ...ఎలాంటి ఇంట్లో పడుతుందో కానీ... ..." అంటూ నిట్టూర్చింది.

నాన్నకు నన్ను చూసిన ఉత్సాహం నా కబుర్లువింటే కల
లేదు. నా చిన్నతనమంతా నన్ను ముద్దులాడిన నాన్న ఎదిగి
కూతురిగా ఇప్పుడునన్ను చూసి భయపడుతున్నాడు. నాలో
కోర్కెలు పురివిప్పి ఆడేలా చేసిన నాన్న తన వాస్తవ జీవిత
తలచుకుని బాధపడుతున్నాడు.

నాన్న సమస్య నాకు తెలుసు. నాకు పెళ్ళిచేయాలి.

నేను కోరే సంబంధాలు నాన్న తేలేడు. ఆ విషయం నా
చెప్పలేడు. కానీ చెప్పేరోజు వస్తుంది. అప్పుడు మేమిద్దరమూ
ఒకరినొకరు ఎలా ఎదుర్కొంటామో చూడాలి.

నాన్నకు సమస్య కాకూడదన్నది నా అభిమతం. కా
నేనిప్పుడు నాన్నకు సమస్యనే! ఎదిగిన కూతుర్నింట్లో పెట్టుక
పెళ్ళి ప్రయత్నాలు చేయడంలేదని చాలామంది నాన్నను మాటలం
న్నారు. ఆ మాటల గురించి నాన్నకు బెంగలేదు. నా కెలాం
సంబంధం తీసుకురాగలనన్నదే ఆయన బెంగ?

"ఏమమ్మా— నువ్వు బియ్యే మూడేళ్ళు చదువుతావా?
అనడిగాడు నాన్న.

ఆయనడిగిన ప్రశ్నలోని అంతరార్థంనాకు తెలుసు. అయి
ప్పటికీ— "మూడేళ్ళు చదివితే నా బియ్యేడిగ్రీ చేతికొస్తుంది క
నాన్నా—" అన్నాను.

నాన్న ఇంకేమీ మాట్లాడలేదు!

నాకు సెలవులు మొత్తం ఇరవై రోజులు.

అత్తయ్య ఇంటికీ మా ఇంటికీ చాలా తేడాఉంది. అన్ని
సదుపాయాలూ ఉన్న అత్తయ్య ఇంట్లోకంటె ఏ సదుపాయాలూలే
మా ఇంట్లోనే నాకెంతో సుఖంగా, చనువుగా ఉంది. ఇదినా
సంతోషం కంటె విచారాన్నే ఎక్కువ కలిగించింది.

చందమామలో ఓచిన్నకథ చదివాను. చేపలమ్ముకునే
మనిషి ఒకతె ఒకరోజు అనుకోకుండా పుల్లెపూలున్న గదిలో
పడుకోవాల్సివచ్చి నిద్రపట్టక నానాఅవస్థపడి— ఆఖరుకు చేపలగం

తెచ్చి పక్కన పెట్టుకుని హాయిగా నిద్రపోతుంది. అలాగే నేను కూడా పేదవాతావరణంలో పుట్టి ధనికవాతావరణానికి అడ్జస్టుకాలేక పోతున్నానా? ఆ వాతావరణానికి నేను తగనా?

నా మనసు మాత్రం బాగానే సద్ది చెప్పింది. అత్తయ్య ఇల్లు నా స్వంతంకాదు. అక్కడి నామకాం శాశ్వతంకాదు. అందుకే నేను అక్కడ ఫ్రీగా మసలలేకపోతున్నాను. ఇక్కడైతే అంతా నా స్వంతం!

ఏది ఏమైనా నాకోరిక చాలా బలమైనది. అందుకే ప్రతి చిన్న విషయాన్నీ దానికిముడిపెట్టి సీరియస్‌గా ఆలోచించడం జరుగుతోంది.

నేను ఇంటికి వచ్చిన అయిదోరోజున ఓ విచిత్రం జరిగింది.

ఓ పెళ్ళిళ్ళపేరయ్య మా ఇంటికి వచ్చి నాన్నకు ఓ సంబంధం చెప్పాడు. నాన్న చాలా సంతోషపడి నన్ను వేరేగదిలోకి పిలిచి-

"ఇదిచాలా మంచి సంబంధమమ్మా—" అన్నాడు.

"చెప్పు" అన్నాను కాస్త సిగ్గుపడుతూ.

నాన్న చెప్పిన వివరాలు విని నేనాశ్చర్య పడ్డాను.

వరుడిపేరు కోటేశ్వరరావు. నన్ను చూసి ఇష్టపడ్డాడు. కట్నకానుకల ప్రసక్తిలేదు. వివాహం సింపుల్‌గా జరిపించవచ్చు. ఉద్యోగంకూడా మంచిది.

ఉద్యోగం మంచిదేమిటి— నాకు తెలిసినదే ....కాలేజిలో లెక్చరర్. వరుడూ నాకు తెలిసినవాడే— అందమైనకళ్ళున్న తెలుగులెక్చరర్! నాకు తెలియనిదల్లా ఆతడు మాకులస్థుడేననీ, మా ఇంటికిలా పెళ్ళిపిలుపు పంపుతాడనీ!

కోటేశ్వరరావును నేనెప్పుడో మనసులోంచి తుడిచేశాను. అతని అందం, సంస్కారం, ఉద్యోగం— అన్నీ గొప్పవే! కానీ నేనుకోరేటంతటి సంపదలతనికి లేవు.

"నువ్వు అతన్ని చూసే ఉంటావు. ఈసంబంధం నీకిష్టమేకదమ్మా......" అన్నాడునాన్న. ఆయన కళ్ళు నావంక ఆశగా చూస్తున్నాయి.

నేను తలవంచుకుని-" ఇంటికి రాగానే నన్నేమని అడిగా నేనేమని చెప్పానో గుర్తుందానాన్నా !" అన్నాను నెమ్మదిగా.

నాన్న గుర్తుచేసుకోడానికి ప్రయత్నించి —" లేదు !" అన్నాడు.

" బియ్యే మూడేళ్ళు !" అన్నాను. అంతకుమించి ఇంకే అనలేదు.

ఆరాత్రి అమ్మ నన్ను మళ్ళీ తిట్టిపోసింది. నేను ఒక్కమా కూనా అనలేను.

తప్పు నాలో ఉందనినాకు తెలుసు. సమస్యగాపరిణమించిన నాపె నాన్నకులభించిన చక్కని పరిష్కారాన్ని నేను కాదన్నాను. వా ఇబ్బందులు వాళ్ళవి. అందుకోసం నాకోర్కెల్ని చంపుకోలే

నేనేమీ మాట్లాడక పోవడంతో అమ్మకోపం నాన్నమీ మళ్ళింది —" అయినా మీరేదానికి అలుసిచ్చారు. బొడ్డూడని దానికేం తెలుస్తుంది ? ఇలాంటి సంబంధం రమ్మంటేమ మళ్ళీవస్తుందా ? మీలాంటి తెలివితక్కువ తండ్రి ఉంటే పిల్లలకూ భవిష్యత్తనేది ఉండదు........"

" అమ్మా—నాన్నను ఏమీ అనవద్దు. తప్పంటూ ఉం అదినాదే !" అన్నాను.

" నాతప్పు లేకపోలేదమ్మా....నాలోని లోపాలు సరిది లేకపోతున్నాను...." అన్నాడు నాన్న.

" అంటే నన్నువదుల్చుకోవాలని చూస్తున్నారన్నమాట !" అన్నాను నేను కోపంగా.

ఆమాట ఆ ఇద్దరి మీదా బాంబులా పనిచేసింది. అప్పు మా ఇంట్లో నిశ్శబ్దం ఆవహించింది.

మర్నాడు అరుణ మా ఇంటికి వచ్చినపుడు అమ్మ నాగురిం చెప్పి అరుణ దగ్గర వాపోయింది. వివరాలన్నీవిని ...." ఇంకోసా బాగా ఆలోచించుకోవే....ఇలాంటి సంబంధం నీకు ఈజన్మ దొరక్కపోవచ్చు. అందానికి అందం....మంచి ఉద్యోగం.... అంది అరుణ నాతో.



"ఆలోచించుకోవలసింది మీరేనే....నా ఆలోచనెప్పుడో అయిపోయింది........" అన్నాను.

అరుణ నావంక ఆశ్చర్యంగాచూసి.... "ఎంతపట్టుదలే నీకు....నువ్వే ఏ స్పోర్ట్సుగర్ల్‌వో అయితే ఇండియాకు తప్పక ఒలింపిక్ గోల్డ్ మెడల్ సంపాదించి పెట్టేదానివి...." అంది.

"నా సామర్థ్యంమీద అంత నమ్మకమున్నప్పుడు మీరంతా నా కెందుకీ అనవసరపు సలహాలిస్తారు?" అన్నాను కాస్త విసుగ్గా.

"అజ్ఞానమే తల్లీ !" అంది అరుణ అదోలానవ్వుతూ.

ఆతర్వాత ఓ వారంరోజులపాటు అమ్మ నన్ను సాధిస్తూనే ఉంది. నాన్నకూడా నిరుత్సాహంగా, ముభావంగా ఉన్నాడు. ఇంట్లో నాకు బోరనే అనిపించి ఒకరోజున—— "ఆపేక్షగా రమ్మన్నారుగదా అని సెలవుల కింటికివస్తే నాకు జరిగిన మన్నన ఇది. ఈ రోజే ప్రయాణమై వెళ్ళిపోతాను. ఇకమీదట సెలవుల్లోకూడా అక్కడే ఉంటాను......."అన్నాను.

నా మాటలకు అమ్మకాస్త నొచ్చుకుని——. "నీ మీద మాకేమన్నా పగా? మూర్ఖంగా ప్రవర్తిస్తున్నావని బాధొచ్చి నీ బాగు కోసమే నాలుగు మాటలు చెబుతున్నాము, అయినా ఎవరికర్మకు ఎవరుకర్తలు !" అంది. ఆ తర్వాత ఇంట్లో మళ్ళీ సుహృద్వాతావరణం వెలిసింది.

నేను బయల్దేరేరోజున మళ్ళీ అమ్మ కన్నీళ్ళు, నాన్నదిగులు, పిల్లల ఏడుపు ముఖాలు....- అన్నీ కలిసి నా మెదలోని పలుపు తాడును గట్టిగా గుంజాయి.

ఈ పర్యాయం నాకూడా ఎవ్వరూ రాలేదు. నేను, అరుణ కలిసి ప్రయాణమయ్యాం.

# 8

నువ్వు లేకపోతే ఇల్లు చిన్నబోయిందే సుమా ! ఈ సారి సెలవులకి మీ వాళ్ళనే ఇక్కడికి రమ్మంటాను. నిన్నుమాత్రం

వెళ్ళనివ్వను....—" అంది అత్తయ్య కళ్ళలోంచి ఆప్యాయ
కురిపిస్తూ.

అత్తయ్య అలా అనగానే నా కళ్ళలో నీళ్ళు తిరిగా
అప్రయత్నంగా అత్తయ్యను సమీపించి ఆవిడ భుజంమీద త
ఏడ్చేశాను.

అత్తయ్య ఆశ్చర్యపోయి....—"ఏం జరిగిందే?"
ఓదార్పుగా తల నిమురుతూ.

నేను వెంటనే ఏమీ చెప్పలేదు. తర్వాత కాసేపటికి
సంబంధం గురించిచెప్పాను.

అత్తయ్య అంతావిని గంభీరంగా అయిపోయింది.
పరీక్షగాచూసింది. తర్వాత నెమ్మదిగా—— "సుమా! ఆ
ధాన్ని నువ్వెందుకు కాదన్నావు........?" అంది.

"బియ్యే అయ్యేదాకా పెళ్ళి చేసుకోవడం నాకిష్టం లేదు
అన్నాను.

"అంతేనా——ఇంకేమైనా కారణం ఉందా?——"
గింది అత్తయ్య నా కళ్ళలోకి చూస్తూ. "నన్నునమ్ము. ఇంకే
——" అన్నాను.

"అయితే నువ్వు చేసింది చాలా పెద్దపొరపాటు—
అంది అత్తయ్య.

ఆవిడలా అనేసరికి నాకు కాస్త భయం వేసింది. అ
నాదే పొరపాటని అంటున్నారు. నిజంగా నేను చాలాపెద్ద
చేస్తున్నానా?

"ఇప్పట్లో పెళ్ళినాకిష్టంలేదు, అందులో తప్పేముం
అన్నాను.

"ఇప్పటి సంగతిసరే——బియ్యే అయ్యాకైనా
చేసుకుంటావా?"

"ఏమో —— ఆవిషయం అప్పుడు లోచిస్తాను —
అన్నాను.



"అసలు పెళ్ళంటూ చేసుకుంటావా?" అంది అత్తయ్య.

దానికి సమాధానం చేసుకుంటాననే కదా! అది చెప్పడానికి
సిగ్గుపడి నీళ్ళు నమిలాను.

అత్తయ్యకు అర్థమైంది. నవ్వుతూ........ "ఆడపిల్ల
ఎప్పటికైనా పెళ్ళి చేసుకోక తప్పదు. కానీ ఇప్పుడొచ్చిన లాంటి
మంచిసంబంధం మళ్ళీ వస్తుందని గ్యారంటీలేదు........"అంది.

"నా అదృష్టం ఎలాఉంటే అలా జరుగుతుంది——"
అన్నాను.

అత్తయ్య నా వంక అదోలాచూసి........ "మా అన్నయ్య
లాంటి నాన్న దొరకడం నిజంగా నీ అదృష్టం. కానీ అదే నీ దుర
దృష్టం కాకూడదని నేను కోరుకుంటున్నాను........" అంది.

అప్పుడే నాకు అత్తయ్య మీద చిన్న అనుమానం కలిగింది.
నా రాకవల్ల వాళ్ళింట్లో ఖర్చుపెరిగింది. మొదట్లో సరదాపడ్డప్పటికీ
రానురాను నేను ఆవిడకు భారంగా తయారయ్యానేమో! నా పెళ్ళి
కుదిరితే తనకు ఏమాటా రాకుండానే నేను వెళ్ళిపోతానుగదా అని
ఆశపడుతోందేమో........అత్తయ్య........!

నా ఆలోచనలు చదివినట్లుగా అంది అత్తయ్య........
"వరుడు తనకు తానై కబురుపంపాడు కాబట్టి అతను నువ్వంటే
చాలా ఇష్టపడుతున్నాడనే అనుకోవచ్చు. అలాంటప్పుడు మనకింకా
సమయం మించిపోలేదు. పెళ్ళి జరిగిపోయినా నువ్వు మా ఇంట్లోనే
ఉండి బియ్యే కొనసాగిద్దువుగాని. బియ్యే అయ్యాకనే కాపురానికి
వెడుదువుగాని........"

నేను కాస్త గిల్టీగా ఫీలయ్యాను........ "అసలు బియ్యే
అయ్యేదాకా పెళ్ళిచేసుకోను........"అన్నాను.

"పోనీ........అతనంత కాలం ఆగుతాడేమో కనుక్కుందాం.
నిజంగా నిన్ను ప్రేమించినవాడైతే అంతకాలం ఆగి తీరతాడు...."
అంది అత్తయ్య!

నా అసలు సమస్య అత్తయ్య కెలాచెప్పేది ? మూ తర్వాత కోటేశ్వరరావు కోట్లకుపడగెత్తే అవకాశం నామమాత్ర నైనా ఉన్నదా ?

"అతని సంగతి మరిచిపో అత్తయ్యా !'' అన్నాను.

"ఎందుకు మరిచిపోవాలి — అతను నీకు నచ్చలేద అంది అత్తయ్య.

"లేదు........" అన్నాను.

"పోనీ.... నీకు నచ్చినవారింకెవరైనా ఉన్నారా ?''

ఉన్నారు. ఆ నీ ఆ వ్యక్తికి రూపంలేదు. అందమైన ఓ కళ్ళు వెండి బంగారాల్లో, నోట్ల కట్టల్లో మునిగి తేల్తున్నాయి. దృశ్యానికి ఇంతకంటె స్పష్టమైన రూపాన్నిచ్చే రోజుకోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను. కానీ ఈ విషయం అత్త చెప్పుకోలేనుగదా ! అందుకే లేరు అన్నట్లు అడ్డంగా తలూపా

అత్తయ్య నిట్టూర్చి ఊరుకుంది.

మర్నాడు కాలేజీకి వెళ్ళినపుడు తెలుగు లెక్చరర్ క్లా నేనాయన కళ్ళలోకి చూడలేకపోయాను. ఆయన నాకేసి చూ ప్రయత్నించాడేమో తెలియదు.

అరుణ ఆయన చాలా దిగులుగా కనపడ్డాడనీ, పాఠం వి హంగా చెప్పాడనీ అంది.

ఎందుకో నాకు నామీదే కోపమూ, లెక్చరర్ పట్ల కలిగాయి.

అయితే ఇందులో నేను చేసిన తప్పేమిటి ! అంతా నన్నే వేలెత్తి చూపడంవల్ల నేను నన్నే కోపగించుకునే స్థితికి శాను. నిజానికి నా తప్పేమీలేదు.

సాయంత్రం ఇంటికి వెళ్ళిన అరగంటకు ఇంటికి నా ఫోన్ వచ్చింది. ఫోన్ తీసుకున్నది అత్తయ్య. ఫోన్ చే కోటేశ్వరరావు.

"అతను నీ గురించి ఫోన్ చేశాడు. నేను ఇంటికి న్నాను........" అంది అత్తయ్య.



"ఎందుకు రమ్మన్నావు ? నాకతనితో మాట్లాడ్డం ఇష్టంలేదని చెప్పలేకపోయావా ?'' అన్నాను.

"అలా చెప్పడం మర్యాదగా ఉండదు, అతన్ని ఇంటికిరానీ. ఓ పదినిముషాలు ఇద్దరూ మాట్లాడుకోండి. అతను నీకు ఇబ్బంది కలిగించేలా మాట్లాడితే నన్ను పిలు. ఈ వ్యవహారానికి శాశ్వత పరిష్కారం సూచిస్తాను...." అంది అత్తయ్య.

ఇరవై నిముషాల్లో కోటేశ్వరరావు మా ఇంటికి వచ్చాడు. అతన్ని నేను నాగదికి తీసుకుని వెళ్ళాను. అతను కుర్చీలో కూర్చోగానే నేనతని పాదాలకు అభివందనం చేసి — "మీరు నాకు గురువులు. మీ పట్ల నేనేదైనా తప్పుగా ప్రవర్తించి ఉంటే నన్ను మన్నించండి—" అన్నాను.

కోటేశ్వరరావు తడబడి —"అదేం మాట - తప్పంటూ ఉంటే నాదే !'' అన్నాడు.

ఆయనలా అనగానే నాకు ధైర్యం వచ్చింది. నేను కూడా కూర్చున్నాను.

"నీతో మాట్లాడాలని వచ్చాను-'' అన్నాడు కోటేశ్వరరావు.

"ఊఁ" అన్నాను తల ఎత్తకుండా.

"నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను...."

"ఊఁ"

"ఇంతే నేను చెప్పాల్సింది...." అన్నాడు కోటేశ్వరరావు.

ఏం మాట్లాడాలన్నా నా నోరు పెగలలేదు. మాట్లాడడానికి నాకు సిగ్గుగా కూడాఉంది. చటుక్కున లేచి— "కూర్చోండి మాస్టారూ !" అని గదిలోంచి బయటికి వచ్చేశాను.

"ఆయనతో నువ్వే మాట్లాడి ఎలాగో అలా పంపేయ్ అత్తయ్యా !" అన్నాను అత్తయ్యతో.

అత్తయ్య కోటేశ్వరరావుతో ఓ పావుగంట మాట్లాడేక నన్ను రమ్మనమని పిలిచింది. వెళ్ళాను.

"నువ్వు పెళ్ళికి అంగీకరిస్తే నీ బియ్యే అయ్యేదాకా ఆగుతానంటున్నాడితడు—" అంది అత్తయ్య.

"ఊఁ" అన్నాను నేను వంచిన తల ఎత్తకుండా.

"ఊఁ కాదు - ఆగమంటావా, వద్దంటావా ?" అ అత్తయ్య.

వద్దన్నట్లు తలాడించాను.

"ఎందుకు వద్దు ?" అంది అత్తయ్య.

నేను నోరు విప్పాను—"పెళ్ళి గురించి ఇప్పుడే ఆలోచించదల్చుకోలేదు నేను. అందువల్లనే ఎవరికీ ఏమీ చెప్పలే మూడేళ్ళ తర్వాత నా ఆలోచనలెలాగుంటాయో ఇప్పుడేం చె గలను ?" అంటూ గదిలోంచి వెళ్ళిపోయాను. తర్వాత అత్త ఏం మాట్లాడిందో నాకు తెలియదు కానీ ఓ అయిదు నిముష తర్వాత ఆవిడ నా దగ్గరకు వచ్చి-- "అతను వెళ్ళిపోయాడు... అని చెప్పింది.

"ఊఁ" అన్నాను.

"చాలా మంచి సంబంధం -" అని నిట్టూర్చింది అత్తయ

నేనేమీ మాట్లాడలేదు. కోటేశ్వరరావు కథ అంతటి ముగిసిందనే అనుకున్నాను కానీ అలా జరగలేదు. అతను నన్ను కలుసుకుందుకూ, మాట్లాడడానికీ ప్రయత్నిస్తూనే ఉన్నాడు. నేనతని కలాంటి అవకాశం దొరక్కుండా జాగ్రత్త పడుతున్నా కలిస్తే అతనితో ఏం మాట్లాడాలో నాకు తెలియదు. నన్ను ప్రేమిస్తు యువకుడతను. నేనతన్ని ప్రేమించడం లేదు. అలాగని అతని నాకు ద్వేషభావమూ లేదు.

కోటేశ్వరరావు మా ఇంటికి వచ్చి వెళ్ళిన పదిరోజుల నా కతని దగ్గర్నుంచి ఓ ఉత్తరంకూడా వచ్చింది. తన ప్రేమ నేనెందుకు నిరాకరిస్తున్నానో అర్థంకాలేదని బాధపడుతూ ఉత్త రాశాడతను.

ఉత్తరానికి జవాబివ్వలేదు. జీవితంలో తొలిసారిగా అం కున్న ఆ ప్రేమలేఖను నిర్దాక్షిణ్యంగా చింపి ముక్కలు చే బాత్రూంలో ఫ్లష్‌లో వేసి కొట్టేశాను.



జవాబుకోసం కోటేశ్వరరావు పదిరోజుల వరకూ ఎదురు చూసి ఇంక ఆగలేక ఒకరోజు కాలేజీలో నన్ను పలకరించి........ "ఉత్తరం అందిందా ?" అనడిగాడు.

"ఊఁ" అన్నాను.

"జవాబు రాలేదు........" అన్నాడు.

"రాదు........" అన్నాను.

"ఎందువల్ల ?"

"ఏమో." అని అక్కడ ఆగకుండా వెళ్ళిపోయాను.

కోటేశ్వరరావు నావల్ల బాగా ఆకర్షించబడ్డట్లే కనబడు తోంది. వాలకంచూస్తే అతను నన్నొదిలిపెట్టేలా కూడా లేదు. కానీ నేనేం చేయగలను ? అతన్నెలా తప్పించుకోగలను ?

ఈ సందర్భంలోనే నేను శేషగిరిని ఆశ్రయించాలనుకున్నాను.

# 9

ఒక రోజు అరుణ, నేను మ్యాట్నీకని వెళ్ళాం. హాలుదగ్గర హౌస్ ఫుల్ బోర్డ్ కనబడింది.

"ఏంచేస్తాం ? వెనక్కుపోదాం -" అంది అరుణ.

సరిగ్గా అదే సమయంలో ఓ యువకుడు నా ముందు ప్రత్యక్షమయ్యాడు - "నా దగ్గర సరిగ్గా మూడు టికెట్లున్నాయి...." అన్నాడు.

"మాకు రెండు చాలు. ఎంతకిస్తావ్ ?" అనడిగాను.

"నన్ను సూటిగా చూడండి మేడమ్. నేను బ్లాకులో టికె ట్లమ్ముకునే వాడిలా ఉన్నానా ?" అన్నాడతను దీనంగా.

నాకు నవ్వొచ్చింది. అప్రయత్నంగా అతన్ని పరీక్షగా చూసి ఆశ్చర్యపడ్డాను.

వేసుకున్న బట్టలు మరీ అంత ఘనంగా లేకపోయినా అతను చూడ్డానికి అపరమన్మథుడిలా ఉన్నాడు. అతడి కళ్ళు ... అబ్బ ఆ సౌందర్యం వర్ణన కందదు.

అనుకోకుండానే అతన్ని పరీక్షగా చూస్తూ ఉండిపోయా

"నా ప్రశ్నకు జవాబివ్వలేదు మేడమ్!" అన్నాడతను.

"సూటిగా చూడమన్నారుగా - చూస్తున్నాను" అని న

"మీరు నన్ను చూశారా" అని ఏదో అనబోయి పోయాడతను.

"మీ ప్రశ్నకు జవాబు కావాలన్నారు గదా. అయామ్ సా అన్నాను.

"ఊరికే సారీ చెప్పేస్తే కుదరదు. ఈ టికెట్స్ మీరు కోవాలి" అన్నాడతను.

టికెట్స్ తీసుకోవాలని నాకుంది కానీ అతను డబ్బు కోసనడం వల్ల తటపటాయించాను. ఆఖరికి అరుణ కూడా దనడంతో ముగ్గురం కలిసి సినిమాకు వెళ్ళాం. హాల్లో అ పక్కన కూర్చున్నాడు. అది నాకు ఇబ్బంది అనిపించింది. న్యూస్ రీలు నడుస్తూండగానే అతను నా పక్కనుంచి లేచిపో ఎలా సాధించాడో తెలియదు కానీ అతను ఖాళీ చేసిన స్థలం ఆడపిల్లవచ్చి కూర్చుంది. నేను కాస్త మనసులో నొ సినిమా హాయిగా చూడ గలిగాను. సినిమా అయిపోయాక హాలు బయట మమ్మల్ని పలకరించి. "హౌడూయూ లైక్ ది పి అన్నాడు.

"చాలా బాగుంది. మీకు చాలా థాంక్స్, కానీ మీరు హాలు బయటకు వెళ్ళిపోయినట్లున్నారు" అన్నాను.

"అదేంలేదు. సీటు అడ్జస్ట్‌మెంట్ చేశాను. అన్నాడతను.

మేము వెళ్ళిపోతూంటే "జస్ట్ కూల్ డ్రింక్స్ తీసుకుని పోదురు గాని" అన్నాడతను. అతనలాగనడం నాకు న కానీ అతను మా కారకే టికెట్స్ ఇచ్చాడు. కనీసం డ్రింక్స్ బిల్లు చెల్లిద్దామనిపించి ఒప్పుకున్నాను. అయితే అక్కడ కూడా బిల్లు యిచ్చాడు.



"ఇదేం బాగాలేదు" అన్నాను చిరుకోపంతో.

"మీరున్నచోట మిగతావేమీ బాగా ఉండవు. అది సహజం" అని "ఇటీజ్ జస్టె కాంప్లిమెంట్ టు యువర్ బ్యూటీ! ప్లీజ్ డోంట్ మైండ్" అన్నాడతను. అతనీ మాటలు ఎంత చక్కగా అన్నాడంటే అతని మాటలకు నా కెక్కడా కోపం రాలేదు.

తేలికగా నవ్వేస్తూ "థాంక్యూ! కానీ మిమ్మల్ని చూస్తూంటే అందం ఆడవాళ్ళ సొత్తు మాత్రమే కాదని తెలుస్తోంది" అన్నాను. అతను గుండెల మీద చేయి వేసుకుని "దిసీజ్ టూమచ్ ఫర్ ఏ రిటర్న్ కాంప్లిమెంట్. అందులోనూ మీవంటి వారి నోటి వెంట విని తట్టుకోగలడం కష్టం" అన్నాడు.

"రైలు ప్రయాణాల్లో స్నేహాల్లా కొన్ని స్నేహాలు తక్కువ వ్యవధి అయితేనే బాగుంటాయ్, మీ బిల్లు తిరిగి పేచేయడం కోసం కూడా మనం మళ్ళీ కలుసుకుంటామని అనుకోకండి" అని అక్కణ్ణించి కదిలాను.

అతన్ని తప్పించుకున్నాక 'హౌడిడి యూఫీల్ హిజ్ కంపెనీ' అని అరుణను అడిగాను.

"ఐ హేట్ హిమ్!" అంది అరుణ.

"ఏం?" అన్నాను ఆశ్చర్యంగా.

"అదే వాడి చూపులన్నీ నీ మీదే ఉన్నాయి. నీ పక్కన ఇంకో ఆడమనిషున్నదన్న దృష్టేలేదు వాడికి" అంది అరుణ కోపాన్నభినయిస్తూ.

నాలో రవంత గర్వం కలిగింది. భగవంతుడా! ఇంత అందాన్నిచ్చిన నాకు సంపదను మాత్రం ఎందు కివ్వవు? అనుకున్నాను. పైకి మాత్రం "అయిందేదో అయింది. అతడిసంగతి మర్చిపోదాం" అన్నాను. అలా అన్న వారం రోజులకు మళ్ళీ అతను నాకు తటస్థపడ్డాడు. ఒక సెలవురోజు సాయంత్రం ఇద్దరం పార్కులో కూర్చుని కబుర్లు చెప్పుకుంటుండగా "వుడ్ యూ మైండ్ ఇఫ్ ఐ డిస్టర్బ్ యూ" అన్న కంఠం వినిపించింది.

వెనక్కి తిరగ్గానే అతడి ముఖం కనిపించింది. చటుక్కు
"ఎస్. స్ట్రేంజర్!" అన్నాను.

"అయితే నేనింకా గుర్తున్నానన్న మాట!" అన్నాడతను
ఆనందంగా. "మీవంటివారి ఆలోచనల నంటిన నా వ్యక్తిత్వం
పావనమైంది."

"మిస్టర్ ఏమిటీ మాటలు?" అన్నాను కాస్త తీవ్రంగా.

"మామూలుగా అయితే ఇలా మాట్లాడాలన్నా మాట్లాడలేను
కానీ మిమ్మల్నిచూడగానే వద్దనుకున్నా ఇలాంటి మాటలే వస్తున్నాయి"
అన్నాడతను.

నేను చిరాగ్గా ముఖం పెట్టి "చూడ్డానికి పెద్దమనిషిలా
ఉన్నారు. రోడ్డుసైడు రోమియోలా మాట్లాడి మీ విలువ పోగొట్టు
కోకండి" అన్నాను.

అతను వెంటనే "మీరెలా చెబితే అలాచేస్తాను. వాట్
ఐ వాంట్ ఈజ్ యువర్ ఫ్రెండ్‌షిప్" అన్నాడు.

"అయాం వెరీ సారీ" అన్నాను కోపంగా.

"అలా మాత్రం అనకండి" అన్నాడతను బాధగా.

"పద అరుణా పోదాం. లేనిపోని న్యూసెన్సు" అంటూ
లేచాను నేను.

తర్వాత మరో రోజు సాయంత్రం నేను, అరుణ ఊళ్ళో
జరుగుతున్న ఎగ్జిబిషన్‌కు వెళ్ళాం. అక్కడ ఓ బిచ్చగాడు
వెంట పడ్డాడు. అప్పటికీ వాడికి చెరో పదిపైసలూ ఇచ్చాం.
అయినా వాడు మమ్మల్ని వదల్లేదు. ఎగ్జిబిషనంతా మా వెనకే తిరుగు
తున్నాడు.

"బాయ్ ఫ్రెండ్సంటే ఇలాంటి వాళ్ళని తరమడానికి
కొస్తారు" అంది అరుణ.

"మన సినిమా ఫ్రెండు కనబడ్డా బాగుండును. వీణ్ణి తరిమి
పెట్టమని ఉండేవాళ్ళం" అన్నాను.



ఎగ్జిబిషన్లో సినిమా ఫ్రెండు కనబడలేదు కానీ కోటేశ్వరరావు
కనబడ్డాడు. అతన్ని తప్పించుకు తిరగడం కోసం బిచ్చగాణ్ణి భరిం
చాను నేను.

ఆ తర్వాత ఇంకో వారంరోజులకు నేను, అరుణ పార్కులో
మాట్లాడుకుంటున్నపుడు ఆ ఎగ్జిబిషన్ బిచ్చగాడు వచ్చి మా సమీ
పంలోనే కూర్చున్నాడు.

"వీడెవడే? మన ప్రాణాలకి యముడిలా సిద్ధమయ్యాడు!"
అన్నాను.

"నన్ను తిట్టుకోకండి. ఎవరూ అనుమానించని విధంగా
మీ దగ్గర కూర్చుని మీ మాటలు వినే అదృష్టం నాకు ఇంకో
విధంగా లభించదుగదా" అన్నాడువాడు. ఉలిక్కి పడ్డాను. ఆ
మాట ఎక్కడో విన్నదనిపించింది.

"అరే - ఇతను మన సినిమా ఫ్రెండు -" అంది అరుణ.

అరుణ మాటలకు ఆశ్చర్య పడ్డాను. అతన్ని గుర్తుపట్టి
"మిస్టర్, ఇదేం వేషం?" అన్నాను.

"నీకూడా తిరగడం కోసం ఈ వేషం వేశాను" అన్నా
డతను.

"అందువల్ల సాధించిందేమిటి?"

"నీ సుందరరూపాన్ని తనివి తీరా చూడగలుగుతున్నాను,
నీ తీయని కంఠస్వరాన్ని వీనులారా వినగలుగుతున్నాను. నీకు
సమీపంలో ఉండగలగడమన్నదే ఒక విచిత్రమైన అనుభూతి నాకు."

ఆశ్చర్యంగా అతడివంక చూశాను. ఎవరితను? బిచ్చగాడి
వేషం కూడా అతడి నయన సౌందర్యాన్ని దాచలేక పోతోంది.

నాకోసం ఇతను అతిహేయమైన బిచ్చగాడి వేషం ధరిం
చాడు.

"అందు కోసం బిచ్చగాడి వేషం వేస్తారా? మీరు నాకు
సమీపంలో కూర్చోగలిగినా ఈ వేషంలో ఉన్న మీ సమీపానికి

రావాలని ఎవ్వరూ అనుకోరు. చాలామంది మిమ్మల్నసహ్య
కుంటారు కూడా!"

"ఒకరి అసహ్యంతో నాకు నిమిత్తం లేదు. మీరు
మనసులోకి వస్తే ఏమైనా చేయగలను. అయినా నేను బిచ్చగా
ప్రేమభిక్ష పెట్టి ఆదరించగలరా?" అన్నాడతను.

వ్యవహారం శృతిమించుతోందని గ్రహించాను. "బి
గాళ్ళకు నేను భిక్ష వేయను. నా దగ్గర భిక్ష అందుకునే అ
ఈ మీ వేషానికి లేదు" అన్నాను.

"మరే వేషానికి ఉంది?"

"నలగని బట్టలతో, చెరగని క్రాపుతో, స్వంతకా
జారగిలబడి అయిస్క్రీం తింటూ భిక్ష అడిగి చూడండి. అప్పు
పెట్టుకోండి" అన్నాను.

"అయితే రేపు సాయంత్రం ఆరుగంటలకు మీరు ప్రే
తీసుకురండి. మీరు కోరిన విధంగా వచ్చి నేను భిక్ష అ
తాను" అన్నాడతను.

నే నులిక్కి పడ్డా తమాయించుకుని "ప్రేమను ఎవ్వ
ఇంటి దగ్గర దాచుకుని రారు. అదెప్పుడూ నాకూడానే ఉంటు
అన్నాను.

"మీ కోసం ఈ వేషంలో వచ్చిన నన్నుచూసి కూడా
పడి ప్రేమభిక్ష వేయలేకపోతే — ప్రేమను ఇంటిదగ్గర వదిలే
వచ్చారేమోననుకున్నాను" అని అతను ఇంక ఒక్కక్షణం
ఆగకుండా వెళ్ళిపోయాడు.

"సుమా! ఈ వ్యవహారం నాకు నచ్చలేదు" అంది అరు

"నాకూ నచ్చలేదు" అన్నాను.

"నువ్వు ఎంజాయ్ చేస్తున్నావనే నాకు అనిపిస్తోంది" అ
అరుణ.

"అలా ఎందుకనుకుంటున్నావ్?" అన్నాను.

"లేకపోతే అతన్ని మళ్ళీ ఎందుకు రమ్మన్నావ్?"



"అతన్ని నేను రమ్మనలేదు. అతనే వస్తానన్నాడు."

"అతన్ని మళ్ళీ కలుసుకోవడం నాకిష్టం లేదు" అంది అరుణ.

"నాకూ ఇష్టంలేదు. అందుకే రేపట్నుంచి ఈ పార్కుకు రావడం మానేస్తాను" అన్నాను.

అరుణ ముఖంలో జాలి కనబడింది. "పాపం అతన్నంతలా ఏడిపించకే! రేపతను నిజంగానే నువ్వు కోరిన విధంగా వస్తాడేమో!"

"నేను కోరిన విధంగా రాగల శక్తి ఉందంటావా?" అన్నాను అపనమ్మకంగా.

"ఏమో వెళ్ళేటప్పుడు అతడి కళ్ళు చూశాను. వాటిలో దృఢ నిశ్చయాన్ని చూశాను. నా నమ్మకం అతడు భాగ్యవంతుల బిడ్డ అని" అంది అరుణ.

"ఏమోనే నాకు నమ్మకం లేదు" అన్నాను.

"భాగ్యవంతుల బిడ్డ కాని పక్షంలో అద్దెకు కారైనా తీసుకు వస్తాడు తప్పితే రేపు రావడం మాత్రం మానడు. ఈ విషయం నాకు నమ్మకమే!" అంది అరుణ.

"స్వంతంగా కారుంటేనే తీసుకు వస్తాడు. అద్దెకు తీసుకు వచ్చినా ఆ విషయం ఒప్పేసుకుంటాడు తప్పితే అబద్ధం చెప్పడానికి ప్రయత్నించడు" అన్నాను.

"ఏమిటా నమ్మకం?"

"అతని కళ్ళు అందమైనవి. ఆ కళ్ళలో మోసం దాగదు" అన్నాను నమ్మకంగా.

"అయితే ఏ విషయమూ రేపు తెలుస్తుందన్నమాట!" అంది అరుణ.

"లేదు అరుణా! నేనింక ఈ పార్కుకు రాబోవడం లేదు."

"మరి అతని గతి?"

"ఇందులో నేను చేయగలిగిందేమీ లేదు." అ పక్కున నవ్వి "అమ్మదొంగా నాతో అబద్ధం చెప్పి నువ్వొక్క ఒంటరిగా రేపు పార్కుకు రావాలనుకుంటున్నావా?" అంది.

నేను సీరియస్‌గా అరుణవంక చూసి "నా కళ్ళలోకి చూ నేనబద్ధమాడుతున్నానేమో అప్పుడు చెప్పు" అన్నాను.

"నేను జోక్ చేయడం వల్ల నువ్వు సీరియస్ అవడం గదా!" అంది అరుణ అనుమసంగా.

"నేను వెళ్ళాలనుకుంటే నీ కారణంగా మాత్రం ఆగ తెలుసుకో!" అన్నాను.

మర్నాడు సాయంత్రం నేను పార్కుకు వెళ్ళలేదు.

ఏడుగంటల ప్రాంతంలో నాకు టెలిఫోన్ వచ్చింది. చే అరుణ!

"ఎందువల్లో కానీ నువ్వీరోజు తప్పక పార్కు దగ్గ వెడతావని నమ్మకం కలిగిందే. అందుకే నేను రహస్య పార్కుకు వచ్చాను. అతను నిజంగానే అక్కడ నీ గు ఎదురు చూస్తున్నాడు. చూడ్డానికి చాలా గొప్ప వాళ్ళబ్బాయి ఉన్నాడు. వేషంలో సినిమా హీరోలుకూడా అతనికి సరి రనుకో. అతని కారు ఎర్ర రంగులో ఉంది. చూడ్డానికి చాలా బాగుంది. అతనినక్కడ అలా చూస్తూంటే ఈ రోజు ను పార్కుకు రాకపోవడం ద్వారా పొరపాటు చేశావేమో ననిపించి అతనింకా ఎంతసేపు ఎదురు చూస్తాడో తెలియదు కానీ వెంట నీకీ విషయం తెలియజేయాలనిపించింది."

"చాలామంచి పని చేశావుగానీ నేనిప్పుడు పార్కుకు రా వడం లేదు" అని వెంటనే ఫోన్ పెట్టేశాను. ఈ విషయ సంభాషణ పొడిగించడం నా కిష్టం లేదు.

కానీ ఆ విషయం నేను ఆలోచించకుండా ఉండలే పోయాను. అతను నా కళ్ళముందే మెదుల్తున్నాడు. హుం ఎర్రకారుకు జారగిలబడి ఐస్‌క్రీం తింటున్న అతని పక్కన నే



కూడా నిలబడి ఉన్నాను. నా చేతిలోకూడా ఐస్‌క్రీం ఉంది. మా జంటవంక అంతా అసూయగా చూస్తున్నారు. అలా చూస్తున్న వారిలో కోటేశ్వరరావుకూడా ఉన్నాడు.

నా ఊహలోకి కోటేశ్వరరావు రాగానే నా ఆలోచనలు పరిపరి విధాల పోయాయి. ఇప్పుడు నా వెంటబడ్డ వారిద్దరున్నారు. ఒకడు కోటేశ్వరరావు. ఇంకొకడు సినిమా ఫ్రెండు. వీరిద్దరూ నాకు కలగజేసే తలనొప్పితో నా చదువు కొనసాగుతుందా?

మర్నాడు కాలేజీకి వెళ్ళినప్పుడు అరుణ నాకు కాస్త దూరంగానే మసలింది. బహుశా నేను దాన్ని ఆత్రుతగా సమీపించి అతని గురించిన వివరాలడుగుతాననుకుని ఉంటుంది. కానీ నేను కూడా దాన్ని తప్పించుకుని తిరిగాను. ఇంక లాభం లేదనుకుందో ఏమో మధ్యాహ్నం ఇంటర్వెల్‌లో అది నా దగ్గరకు వచ్చి "నీ వరసేం బాగోలేదే. ఈ రోజు పార్కుకు వెళ్ళు" అంది.

"ఎందుకు వెళ్ళాలిట?"

"అతను ఈరోజు కూడా నీకోసం పార్కుకు వస్తాడు."

"తను వచ్చేది ప్రేమభిక్ష కోసమని అతను చెప్పాడు. క్ష వేయడానికి నేను సిద్ధంగా లేను."

"అలాంటప్పుడు రమ్మనమని ఎందుకు చెప్పావ్?"

"నేను రమ్మని అనలేదు. అర్హతలు చెప్పాను. అతను చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు" అన్నాను.

"మీ ఇంట్లో నీ మాట కాదని ఏమీ జరగదుగదా, మీ వాళ్ళొప్పుకున్నా నీకు నచ్చకపోతే ఏ ప్రయోజనము లేదుగదా. అందువల్ల ముందు నువ్వతని మనసు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు. నీకు నచ్చితే అప్పుడు మీ వాళ్ళను అడగమని అతనికే నువ్వు చెప్పొచ్చు" అంది అరుణ.

"ఎందుకో నాకు అతనిపట్ల ఆసక్తి కలగడం లేదు. యుంచి ఈ విషయంలో నాకు సలహా ఇవ్వొద్దు" అని చెప్పేశాను అరుణకు.

ఆరోజు రాత్రి ఏడున్నరకు మళ్ళీ అరుణ దగ్గర్నుంచి ఫో వచ్చింది. అతను ఈరోజుకూడా పార్కుకు వచ్చాట్ట. ఈరో అతను వచ్చిన కారు నీలంగా ఉన్నదట.

"అద్దెకు తెస్తున్నాడేమో, రోజూ ఒకే రంగుది దొరక లేదనుకుంటాను'' అన్నాను.

"ఆ విషయం నువ్వు అతని కళ్ళలోకి చూసి తెలుసు వచ్చు. అందమైన అతడి కళ్ళలో మోసం దాగదు కదా" అ అరుణ.

"ఇంకా ఉన్నాడా అతనక్కడ?'' అన్నాను.

"ఉన్నాడు'' అంది అరుణ.

"ఒకపని చేయ్. రేపట్నుంచి నువ్వు కూడా పార్ వెళ్ళడం మానేసేయ్'' అని ఫోన్ పెట్టేశాను.

మర్నాడు కాలేజీలో అరుణ నాతో మాట్లాడలేదు. మాట్లాడకపోతుందా అని అశ్రద్ధచేస్తే అది ఆ రోజంతా నా మాట్లాడనేలేదు. రాత్రి నాకు ఫోన్‌కూడా రాలేదు. ఎనిమిది గం ప్రాంతంలో దాని హాస్టల్‌కు ఫోన్ చేశాను. అది హాస్టల్లో లే తెలిసింది. ఆ మర్నాడు కాలేజీలో దానిగురించి ఆత్రుతగా ఎ చూశాను. అది క్లాసుకు కాస్త ఆలశ్యంగా వచ్చింది. నా కేసి స్నేహపూర్వకంగా నవ్వింది. పీరియడ్‌కూ పీరియడ్‌కూ మధ్య దగ్గరకు చేరి ఉత్సాహంగా ఏవేవో కబుర్లు చెప్పింది. మధ్యాహ లంచ్ ఇంటర్వల్లో నన్నది ఒక్క క్షణంకూడా వదల్లేదు. అ అదిచెప్పే కబుర్లలో అతనికి సంబంధించిన విషయం ఒక్కటీ లేదు. నాకు చాలా నిరుత్సాహంగా ఉంది. అతను నిన్న పార్కుకు వచ్చాడా? ఈసారి అతని కారుకున్న రంగు ఏమి అతనక్కడ ఎంతసేపు ఎదురు చూశాడు? వగైరా ఎన్నో ప్రశ్న నా నాలిక చివరివరకూ వచ్చి ఆగిపోతున్నాయి. అరుణ నా స్తూంటే అతనిగురించి ఏ మాత్రమూ చెప్పేలా లేదు. లనే అలా చేస్తోందని నేను గ్రహించాను. అయినా ఉండ

"నిన్న నువ్వు పార్కుకు వెళ్ళావే?" అనడిగాను.



అరుణ ఫక్కున నవ్వి, "నువ్వు వద్దన్నావని మానేశాను" అంది. దాని నవ్వులో చాలా వెటకారం ఉంది. అయినా అది భరించి "పాపం నిన్నకూడా అతను పార్కుకు వెళ్ళాడేమోనే'' అన్నాను.

"ఎందుకొచ్చిన గొడవలెద్దూ! సరదాగా ఇంకేమైనా విషయాలు మాట్లాడుకుందాం." అంది అరుణ అనాసక్తతను నటిస్తూ.

ఇందుకు అరుణను తప్పుపట్టి లాభంలేదు. అసలు తప్పు నాదే! అది నిజంగా ఆసక్తి చూపినపుడు నేను బెట్టు చేశాను. ఇప్పుడు నా మనసు నిజంగానే అతని గురించి ఆలోచిస్తోంది. అలా గని నేనతన్ని ప్రేమించడంలేదు. అతనంటే విపరీతమైన జాలి కలుగుతోంది నాకు.

ఆ రోజే క్లాసులో ఇంగ్లీషు పాఠంలో చెప్పారు మాకు. ముందు జాలిపుట్టి తర్వాత ప్రేమగా మారుతుందిట. ఏది ఏమైనా అతని విషయంలో ఏదో ఒకటి తేల్చేయాలి.

ఈ విషయమై నేనింకా ఏదో ఆలోచిస్తూండగానే ఆరోజు సాయంత్రం కాలేజీ వదిలిపెట్టేక బస్సుకోసం నేనెదురు చూస్తుంటే కోటేశ్వరరావు బస్‌స్టాపుకి వచ్చాడు. నా పక్కగా నిలబడి "ఒక్కసారి పార్కుకు వస్తే నీతో చాలా మాట్లాడాలి!" అన్నాడు.

మా సినిమా ఫ్రెండు కూడా నా కోసం పార్కులో ఎదురు చూస్తుంటాడు. కోటేశ్వరరావు పార్కుకు రమ్మంటున్నాడు.

నా పెళ్ళి నాన్నకనుకుంటే నాకే సమస్యగా పరిణమించింది.

"ఈ రోజు రాలేను. రేపు చెబుతాను" అన్నాను.

హఠాత్తుగా నా మనసు సినిమా ఫ్రెండు వైపు మళ్ళింది. అతన్నీరోజే వెళ్ళి కలుసుకోవాలనుకున్నాను. కోటేశ్వరరావు, సినిమా ఫ్రెండు ఈ ఇద్దరిలో ముందు ఒకరిని వదుల్చుకోవాలి. తర్వాత రెండో మనిషి సంగతి చూసుకోవచ్చు. ఇల్లు చేరగానే పుస్తకాలు నా గదిలో పారేశాను. అత్తయ్య ఇంట్లోలేదు. త్వరగా బట్టలు మార్చుకుని 'ఏడున్నర కాకుండా ఇంటికొచ్చేస్తానని' చెప్పుఅని వంటబ్రాహ్మణుకు చెప్పి బయట పడ్డాను. నేను బస్సులో పార్కు చేరేసరికి

"సరే ఈ రాత్రికి నన్నాలోచించుకో నివ్వండి" అన్నా

"ఒకరాత్రి కాదు ఎన్ని రాత్రులైనా ఆలోచించండి. నక పోయినా ఫరవాలేదు మీరు కలకాలం మీ ఆలోచనల్లో ని తుంటే" అన్నాడతను.

"అది సరే ఇంతకీ మీ పేరు నాకు తెలియనే తెలియ అన్నాను.

"నా పేరు శేషగిరి" అన్నాడతను.

"నా పేరు సుమలత!" అన్నాను.

"ఈ అందానికి ఏ పేరు పెడితే న్యాయం చేకూరుతు అనుకున్నాను. మీకు చెందడం వల్లనో ఏమో ఆ పేరుకు అందం వచ్చేసిందిప్పుడు" అన్నాడతను.

"పరాయి ఆడదానిమీద కవిత్వం చెప్పడం మర్యాద అక్షణం కాదు. నేను అనుమతించేవరకూ మీరు నామీద కవి చెప్పకూడదు'' అన్నాను.

"నా పిచ్చిమాటలు మీకు కవిత్వంలా వినపడుతున్నా సందేహంలేదు. మీరు నన్ను ప్రేమిస్తున్నారు" అన్నాడతను హంగా.

నేనతనివంక తీవ్రంగా చూసి "ప్లీజ్ ప్రేమ గు మాట్లాడకండిప్పుడు. నేను మీతో మాట్లాడుతాను. అంతవరకూ ఊహలను కాస్త అదుపులో ఉంచండి'' అన్నాను.

తర్వాత నేనక్కణ్ణించి బయల్దేరి ఇల్లు చేరాను. ఊ నదుపులో ఉంచమని అతన్ని దెబ్బలాడాను కానీ నా ఊహ అదుపులో లేవు. శేషగిరి ఇప్పుడింకా చాలా చనువుగా ప్ర స్తున్నాడు. నన్ను సమీపించి నాచేయి పట్టుకున్నాడు. నా చుట్టూ చేయివేసి దగ్గరగా లాక్కుంటున్నాడు. నేనతన్ని వా లేకపోతున్నాను. అతను నన్ను తాకుతుంటే ఆ అనుభూతి ఊహే కావచ్చు అయినా బావుంది.



"బియ్యే అయ్యేదాకా నువ్వు పెళ్ళి చేసుకోవు కదూ?" నాన్న న్నడుగుతున్నాడు.

"మూడేళ్ళపాటు నీకోసం ఆగగలను నేను" అంటున్నాడు కోటేశ్వరరావు.

"ప్రేమభిక్ష కావాలి!" అంటున్నాడు శేషగిరి.

ఇల్లు చేరగానే ఊహల్లోంచి వాస్తవంలోకి వచ్చాన్నేను.

శేషగిరి నా హృదయంలో స్థిరస్థానం సంపాదించ మన్నాడన ంలో సందేహం లేదు. ఆ విషయం ఎలా ఉన్నా అతన్నుపయో ించి ముందు కోటేశ్వరరావు బెడద వదిలించుకోవాలి.

కోటేశ్వరరావు కోసమైనా సరే శేషగిరినాశ్రయించాలను న్నాను నేను.

# 10

నమస్కారం మేష్టారూ!" అన్నాను.

కోటేశ్వరరావు ముఖంలో మధ్యాహ్న సూర్యుడు కని ంచాడు. నేను నమస్కరించగానే ఆయన ముఖంలోకి మరీ అంత తేజస్సు వస్తుందనుకోలేదు. చూడలేక కళ్ళు మూసుకున్నాను.

"నమస్కారం" అన్నాడాయన ప్రసన్నంగా.

"మీరు నాతో ఏదో మాట్లాడాలన్నారుగా. సాయంత్రం ఆరు గంటలకు పార్కుకు వస్తాను" అన్నాను. ఇప్పుడు తేజస్సు గదంతా వ్యాపించిపోయింది. గదిలో ఎండ తీక్షణంగా కాస్తోంది. ఒక్క ఉదుటున అక్కణ్ణించి బయట పడ్డాను.

అరుణను క్లాసులో పలకరించడం కుదరలేదు. అది నాకు రెండు బెంచీల ముందు కూర్చుంది. పీరియడ్ పీరియడ్‌కు మధ్య ఒక్క నిముషం కూడా వ్యవధి దొరకలేదీరోజు. మొదటి పీరియడ్ అయ్యేసరికి రెండో పీరియడ్ లెక్చరర్ గుమ్మం దగ్గర ఎదురు చూస్తూ తిరిగేస్తున్నాడు.

ఇంటర్వెల్‌లో మేమిద్దరం కలుసుకున్నాం. కానీ అ విషయం దానికి చెప్పాలా. చెప్పకూడదా అన్న మీమాంస నాకి తేలలేదు.

నా సమస్యను అరుణ క్షణాలమీద తేల్చేస్తూ "అ నేనింక మరోస్నేహితురాలిని వెతుక్కోవాలన్న మాట" అంది.

"అదేమే ?" అన్నాను కంగారుగా.

"ఇంక మీరిద్దరూ ఏకాంతంగా కలుసుకోవడం మొద నట్లున్నారు!" అంది అరుణ.

"నిన్న నువ్వు చూశావా ?" అన్నాను ఆశ్చర్యంగా.

"చూడకూడదనేగా నువ్వు కోరుకున్నది" అంది అ వేళాకోళంగా నవ్వుతూ.

"అదేంకాదు అక్కడికి నేను వెళ్ళిన కారణం వేరు"

"ఏమిటది !"

కోటేశ్వరరావు గురించిన నా డైలమాచెప్పి అందుకు శే నెలా ప్రయోగించాలనుకుంటున్నానో చెప్పాను.

అంతా విని "నువ్వేం చేసినా ఫరవాలేదు. కాని నిండు తాలతో ఆటలు మాత్రం ఆడకు" అంది అరుణ సీరియస్‌గా.

అదలాగనడం నాకు నచ్చలేదు. నేనెంతో మంచిదా నాకు తెలుసు. అన్యాయంగా నేనెవరినీ నొప్పించను. నిజ కోటేశ్వరరావు విషయంలో గానీ, శేషగిరి విషయంలో గానీ నే చేసిన తప్పేమిటో అరుణ నన్నెందుకు దోషిని చేసి మాట్లాడుతో నా కర్థంకాదు.

నేను ఆడపిల్లను. వయసులో ఉన్నాను. అపురూప సౌందర్యం ఉంది. నా వెంట ఇద్దరు యువకులు పడ్డారు. వాళ్ళ నేను తృణీకరిస్తున్నాను. అందులో తప్పేముంది ? నా కోరి నాకుంటాయి. నా పద్ధతులు నాకుంటాయి. నా జోలికి వచ్చా కాబట్టి ఆ యువకులు అనుభవించాల్సిందే !



సాయంత్రం ఆరు గంటలకు నేను పార్కుకు వెళ్ళేసరికి శేషగిరి అక్కడకు వచ్చి సిద్ధంగా ఉన్నాడు. ఈరోజు తను కారు తీసుకురాలేదు. కానీ సీటుగా డ్రస్సయి వచ్చాడు.

అతనితో నేను మాటలు మొదలెట్టకుండానే అక్కడికి కోటేశ్వరరావు కూడా వచ్చాడు.

నేను ఇద్దర్నీ పరస్పరం పరిచయం చేశాను.

నేనక్కడ ఉండగా ఆ ఇద్దరికీ ఒకరి పొడ ఒకరికి గిట్టడం లేదు. నేనా విషయం గ్రహించగలిగాను.

"మిస్టర్ కోటేశ్వరరావుగారూ ! ఇతను నా స్నేహితుడు. కాబట్టి మీరేమీ సంకోచించ నవసరం లేదు. నాతో ఏం మాట్లాడ దల్చుకున్నారో చెప్పవచ్చు" అన్నాను.

కోటేశ్వరరావు నీళ్ళు నమిలాడు. "ఏకాంతంగా మాట్లాడా లన్నది నా ఉద్దేశ్యం"

"ఇది ఏకాంతంలాంటిదే శేషగిరి నాకు బాగా కావలసినవాడు" అన్నాను. నా మాటలకు శేషగిరి సంతోషించి ఉంటాడని ఊహించాను కానీ అతనివంక చూడలేదు.

"ఏకాంతం కోసం నేను కాసేపు ఆగగలను" అన్నాడు.

నేను క్షణం తటపటాయించి "మేష్టారూ ! నేను శేషగిరిని ప్రేమిస్తున్నాను. ఇంతకాలం మిమ్మల్ని తప్పించుకు తిరగడానికి అదే కారణ మనుకుంటాను. ఈ విషయం మీకు ఎలా చెప్పాలో తెలియక ఇక్కడికి రమ్మన్నాను. చూడగానే పరిస్థితి అర్థం చేసు కుంటారనుకున్నాను" అన్నాను.

కోటేశ్వరరావు ముఖం వివర్ణమై పోయింది. అతని ముఖంలో కోపం కూడా నెమ్మది నెమ్మదిగా చోటు చేసుకుంటోం దని గ్రహించగలిగాను. అతనింకా ఏదో మాట్లాడేలోగా నేను "మేష్టారు! అందంలో, చదువులో, సంస్కారంలో నేను మీకు సరిపోలతానని అనుకోను. అన్నీ ఉండికూడా మీరు నావంటి మూర్ఖురాలి గురించి తాపత్రయపడడం మీ స్వచ్ఛంద హృదయాన్నీ,

నిష్కళంక ప్రేమనూ తెలియజేస్తుంది. మీవంటి వారిని అర్థం చేసుకునే అదృష్టం నాకు లేదు. ఒకమంచి గురువుగా మీరు కలకాలం నాకు గుర్తుండిపోతారు. ఇక నన్ను మీరు మరిచిపొండి" అన్నాను.

మామూలు పరిస్థితుల్లో అయితే నేనింత నిర్భయంగా నిస్సంకోచంగా మాట్లాడగలిగి ఉండేదాన్నికాదు. పరిస్థితి నానాటికీ ముదిరిపోతోందన్న తపన ఒకటీ, అంతరాంతరాల్లో ఇది ప్రహసనమన్న భావం ఒకటీ నాకీ ధైర్యాన్ని ప్రసాదించి నా సహజంగా ఉండే సిగ్గును పోగొట్టాయనుకుంటాను. అయినప్పటికీ కూడా అలా మాట్లాడ గలిగినందుకు నాకు చాలా ఆశ్చర్యం కలిగింది.

"ఇవే మాటలు నాకు ఏకాంతంగా చెప్పి ఉంటే నేను … పడి ఉండేవాణ్ణి కాదు'' అన్నాడు కోటేశ్వరరావు.

"నేనేం చేసేది మేష్టారూ; నా నిర్ణయం తెలిసినా కూడా మీరు నన్ను వదిలిపెట్ట లేకపోవడంలో నేను చాలా ఇబ్బంది పడ్డాను. అసలు విషయం మీకెలా చెప్పాలో తెలియదు. ఏకాంతంలో అయితే మీతో మాట్లాడగలిగి ఉండేదాన్ని కాదేమో! అది కాక నా నిర్ణయం చెప్పినా మీరు మీ ప్రయత్నాలు మానలేదు. అంటే నామీద మీకు నమ్మకం లేదు. నేను శేషగిరి పేరు చెప్పినా మాత్రం మీకు నమ్మకం కలుగుతుందని ఏముంది? మిమ్మల్ని వదుల్చుకోడానికి అబద్ధం చెబుతున్నాననుకోవచ్చుగదా! అందుకే ఏకంగా అతన్ని చూపించడం కూడా అయిపోతుందని ఇలా చేశాను. అంతేకాదు. నాకు సహృదయులైన మీ ఆశీర్వాదం కూడా కావాలి" అన్నాను.

కోటేశ్వరరావు ఏమీ మాట్లాడలేక అసహాయంగా కాసేపు నన్నూ, శేషగిరినీ మార్చి మార్చి చూశాడు. తర్వాత నెమ్మదిగా "మీ ఎన్నిక చాలా బాగుందని మాత్రం చెప్పగలను. ఐ విష్ యు ఆల్ ది బెస్ట్" అన్నాడు.



"థాంక్స్ మేస్టారూ!" అన్నాను.

"మీకు నా కంగ్రాట్యులేషన్స్ మిస్టర్ శేషగిరీ! అని ఆతని జవాబుకోసం కూడా ఎదురు చూడకుండా వెళ్ళిపోయాడు కోటేశ్వరరావు. అతను వెళ్ళిపోతూంటే నా మనసులో అతనిపట్ల సానుభూతి కలిగింది,

"సుమలతగారూ! ఇంత కాలానికి అసలు విషయాన్ని బయటపెట్టారు. ధన్యుణ్ణి!" అన్నాడు శేషగిరి కోటేశ్వరరావు వెళ్ళిపోగానే.

"మిస్టర్ శేషగిరీ! మీరేమనుకుంటున్నారో నాకు తెలియదు. మీరింకా మాట్లాడబోయే ముందు నేనో విషయాన్ని చెప్పాలి. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నట్లు కోటేశ్వరరావుకు చెప్పిన విషయం నిజం కాదు. అతన్ని శాశ్వతంగా వదుల్చుకోవడం కోసం ఆ అబద్ధం చెప్పక తప్పలేదు."

"ప్లీజ్ డోంట్ జోక్!" అన్నాడు శేషగిరి.

"అయామ్ నాట్ జోకింగ్!'' అన్నాను. "కోటేశ్వరరావు ఎప్పటికీ వదలక పోవడంతో మిమ్మల్ని ఎన్నుకొన్నాను. మీరుకూడా నన్ను వదలకపోతే మళ్ళీ ఇంకో సుబ్బారావును వెతుక్కోవలసి ఉంటుంది."

"ఇలా ఎంతకాలం చేస్తారు?''

"బియ్యే చదువుకుందామని వచ్చిన నన్ను చదువుకోనకుండా ప్రేమ, పెళ్ళి అనే పదాలతో వేధించేవాళ్ళను నేనేం చేయాలో మీరే చెప్పండి" అన్నాను చిరాగ్గా.

"ఓస్ ఇంతేగదా'' అని అతను తేలిగ్గా నిట్టూర్చాడు. "బియ్యే అయ్యే వరకూ మీ కళ్ళబడవద్దని శాసించండి. శిరసావహిస్తాను. అంతేకానీ నన్ను ప్రేమించానన్న మాట అబద్ధమనిమాత్రం అనకండి భరించలేను."

"మిమ్మల్ని ప్రేమించానన్న ఊహను మనసులో ఉంచుకు నేను మాత్రం బియ్యే ఎలాచదివేది! అందుకే నేనసలు ప్రేమ గురించిన ఆలోచనలు ఇప్పట్లో మనసులోకి రానివ్వదల్చుకోలేదు."

"సుమలతగారూ! మీరెలాగంటె అలాగే. నేను మిమ్మల్ని ఎంతలా ప్రేమిస్తున్నానో మాటల్లో చెప్పలేను. ఇప్పట్లో ప్రేమ అన్నపదం మీకు వెగటుగా ఉంటే. నేను మీ దరిదాపులకు రావడం కూడా ఇష్టం లేకపోతే నేను మీకు దూరంగానే ఉంటాను తప్పితే కోటేశ్వరరావులా వేధించను, నన్ను వదుల్చుకోవాలన్న ప్రయత్నం చేసే అవసరం కూడా మీకు రానివ్వను" అన్నాడు శేషగిరి.

అతని మాటలు వింటూంటే నా నరనరాలూ చలించి పోతు న్నాయి. అతనిపట్ల నేనింత కఠినంగా ఎందుకుంటున్నానో, ఎంది కుండ గలుగుతున్నానో కూడా నా కర్థం కావడంలేదు. అప్రయ త్నంగా నేనతని వంక ప్రసన్నంగా చూశాను. "మిస్టర్ శేషగిరీ! ప్రేమ అనే పదానికి కథల్లోనే గానీ నిజ జీవితంలో స్థానం లేదని నా నమ్మకం. మీరు నా పైన ప్రేమ అనుకుంటున్నది భ్రమ అని నా అనుమానం. ఇంక మరెన్నడూ నా గురించి ఆలోచించకండి. నా ఉనికి గురించి మరిచిపోండి. వెంటనే వివాహం చేసుకోండి. కొంతకాలానికే ప్రేమ అని మీరనుకుంటున్నది ఎంత హాస్యాస్పద మైన విషయమో మీరే గ్రహిస్తారు" అన్నాను. ఒక వాస్తవిక దృక్పథం గల రచయిత ప్రేమను గురించి వ్రాసిన విషయాలను గుర్తు చేసుకుని.

"మీ మాటలు నేను విన్నాను. నా మాటలుకూడా మీరు వినాలి!" అన్నాడు శేషగిరి.

క్రికెట్ ఈ రోజుల్లో ప్రమాదకరమైన ఆటగా పరిణమిం చింది. ఆ ఆట ఆడే వాళ్ళలో చాలామంది డబ్బుకోసం కాక ఆటమీద ప్రేమతో ఆడుతున్నారు.

ఎంతో ప్రమాదకరమైనప్పటికీ కేవలం సాహస కృత్యాల మీది ప్రేమతో ఎంతోమంది ఎవరెస్ట్ శిఖరాన్నధి రోహించడానికి



యత్నిస్తున్నారు. అలా యత్నిస్తున్న వారిలో చాలామందికి ఏ విధమైన ఆర్థిక సమస్యలూ లేవు.

బాక్సింగ్‌లో మహమ్మదాలీని ఎదుర్కొనే ప్రతివాడి దృష్టి గెలిగితే వచ్చే డబ్బు పైనకాక ఆ ఆటలో ఉన్నత శిఖరాలనందు కోవాలన్న దానిపైనే ఉంటుంది.

ఇంకా రాజకీయాలు, సైన్సు వగైరా ఎన్నో రంగాల్లో నులు కేవలం ఆయా విషయాల్లో ప్రేమతో పని చేస్తున్నారు.

"ఇన్ని తెలిసుండీ ప్రేమను భ్రమ అని ఎలా అనగలం? ను ప్రేమించే విషయంలో ఉన్నత శిఖరాలందుకోవాలని అందరికీ ంటుంది. మీ ప్రేమను పొందగలిగితే సౌందర్యారాధనలో న్నత శిఖరాల నందుకున్నట్లే అవుతుంది. నా ప్రేమ భ్రమకాదు. మీ గురించి ఆలోచించకుండా ఉండలేను. మీ ఉనికిని మరిచి పోవడం నాకు సాధ్యం కాదు. నేను జీవించి ఉన్నంతకాలమూ మీకోసం ఎదురుచూస్తాను తప్పితే వేరే వివాహం చేసుకోలేను. నా రీరంలోని అణువణువూ మీ అనురాగం కోసం తపించిపోతోంది."

మాట్లాడుతున్నప్పుడు అతనివంకే చూస్తున్నాను. అతని పెదవులు చిత్రంగా అదురుతున్నాయి. ముఖ కళవళికల్లో చిరు ఆవేశం కనబడుతోంది. కళ్ళు అమాయకంగా కదుల్తున్నాయి. హఠా త్తుగా అతనిలో ప్రేమను చూస్తున్నానేమోనన్న అనుమానం నాకు కలిగింది. ఒకవేళ అతను ప్రేమకు మారు రూపమేమో!

శేషగిరికి నేనుకోరిన డబ్బుంది. నేను కోరినదాని కంటే ఎక్కువ అందం ఉంది. మా జంట విధాత సృష్టి కొత్త అందాల స్తుంది. శేషగిరి నన్ను మోసం చేస్తున్న పక్షంలో అతనిమోసానికి గురిబడడంలోనే నా అదృష్టముంటుంది.

"మీ అభిప్రాయాలు మీవి. నాఅభిప్రాయాలునావి. నాకీ ప్రేమమీద నమ్మకంలేదు. మూడేళ్ళవరకు అలాంటివిషయాలు ఆలోచించ దల్చుకోలేను. ఇంకమీదట మీరు మళ్ళీ నన్ను కలుసు

కోవడానికి ప్రయత్నించ వద్దు. నేను ఈ పార్కుకిరావడం ఈ అఖరుసారి అవుతుంది........" అన్నాను.

"అలా అనవద్దు. రేపొక్కసారి ఇక్కడికి రండి. తర్వాతనుంచి రావద్దు...." అన్నాడు శేషగిరి.

"ఏమిటి—రేపటిలోని ఆ విశేషం ?" అన్నాను నవ్వుత

"రేపు నాపుట్టినరోజు. నాపుట్టినరోజున నాకెంతో ప్రి మైన మిమ్మల్ని కలుసుకుని మాట్లాడగలగడం నా అదృష్ట కుంటాను. ఆ తర్వాత మళ్ళీ పుట్టినరోజు వరకూ మిమ్మ బాధించను" అన్నాడు శేషగిరి. అతడి అందమైన కళ్ళు నా జాలిగా చూస్తూ అర్థిస్తున్నాయి.

"వీలునుబట్టి చూస్తాను. నేనురాకపోతే నిరుత్సా పడవద్దు" అన్నాను.

"రాకపోతే నిరుత్సాహపడవద్దన్న మీశాసనం పాటించ నావల్లకాదు. రేపు ఒక్కరోజుకీ మీరు తప్పకరావాలి" అన్నాడత నేను నవ్వి లేచాను.

నా సౌందర్యం నాకు కొన్ని అధికారాలనిచ్చింది. అవి లేకుంటే నాకీ అధికారాలొచ్చి ఉండేవికావని నాకు తెలుసు. ఆ అధికారాన్ని నేను సద్వినియోగం చేసుకుంటున్నాను. ఈ అధికార కారణంగానే నా అహం ఎదుటివాళ్ళ అహాన్ని దెబ్బతీయ గలు తోంది.

ఒకోసారి నాకు చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. నాతప్పు నేను గుర్తించగల్గుతున్నాను. నాలోపాల్ని నేను తెలుసుకోగ తున్నాను. కానీ వాటిని సవరించుకోవడానికి ప్రయత్నించడంలే నాఅహంకారం నాకా అవసరం లేదని వారిస్తోంది. ప్రతిఒక్క విషయంలోనూ ఇలాగే జరుగుతుందా ? అందుకే మనిషి తెలి కూడా తప్పులు చేస్తున్నాడా ? ప్రపంచంలో అవినీతి, అన్యాయ దుర్మార్గం కొనసాగుతూనే ఉండడంలోని మర్మమిదేనా ?



నేను ఇల్లు చేరేసరికి అత్తయ్య నాగురించే ఎదురు చూస్తోంది. ముఖంలో ఎప్పుడూ ఉండే ప్రసన్నత కనబడలేదు. చూపులు తీక్షణంగా ఉన్నాయేమోనని భయంవేసింది.

అత్తయ్య నాతోపాటు నాగదిలోకి వచ్చి- "శేషగిరి ఎవరు ?" అడిగింది.

ఒక్కనిముషం ఆలోచించి- "అరుణ స్నేహితుడు-" అన్నాను.

"నీకేమీ కాడా ?" అంది అత్తయ్య సూటిగ.

"కాడు-" అన్నాను.

"నిజమే చెబుతున్నావా ?"

"ఈరోజు ఎందుకిలా అడుగుతున్నావు ?" అనడిగాను.

"కోటేశ్వరరావు నాకు ఫోన్‌చేసి నీసంగతి చెప్పాడు-"

"అతనికి నామీదకోపం. అబద్ధాలేమైనా కల్పించి చెప్పి ఉండొచ్చు" అన్నాను.

అత్తయ్య నాకు దగ్గరగావచ్చి పిచ్చిపిల్లా ! కోటేశ్వరరావుకు నీమీద ఆశేకానీ కోపం లేదమ్మా. అతను ఫోన్‌లో నాకు నీమీద పుకారేలేమీ చెప్పలేదు. నువ్వు శేషగిరి అనేఅబ్బాయిని ప్రేమిస్తున్నావనీ అందుకే తన్ను నిరాకరించావనీ చెప్పి నీకూ, శేషగిరికీ పెళ్ళిజరిపించమని మాత్రం చెప్పాడు. నాకు తెలియని కొత్తపేరు వినబడేసరికి నేనుకలవరపడ్డాను. నామీద నమ్మకంతో మీఅమ్మానాన్నా నిన్ను నాదగ్గర విడిచిపెట్టారు. నువ్వు నాకుచెప్ప కుండా ఇలా స్నేహితులవెంట తిరగడం ఏమైనా బాగుందా ?" అంది.

"అత్తయ్యా, నీకు చెప్పకుండా నేనే చెడ్డపనులూ చేయను. ఈశేషగిరికథ వేరు. అతను అరుణకు స్నేహితుడు. అస్తమానూ కోటేశ్వరరావు నావెంట బడుతూంటే అరుణకు చెప్పాను. అరుణ అతన్ని పురమాయించి కోటేశ్వరరావుకు కొన్ని అబద్ధాలు చెప్పించింది. అవి నిజమని కోటేశ్వరరావు నమ్మి నీకు ఫోన్

చేసిఉంటాడు. నేనిక్కడికి చదువుకుందుకు వచ్చాను గానీ శేషగిరి
వెంట తిరగడానికి రాలేదు గదా ! " అన్నాను.

" ఆ అబ్బాయి అరుణ కేమౌతాడు ?" అంది అత్తయ్య

"శేషగిరి అరుణకు కజిన్ బ్రదర్" అన్నాను. అత్తయ్య
శేషగిరినీ, అరుణనూ కలిపి ఇంకో విధంగా అనుకోవడం నా
నచ్చలేదు. మిగతా ఆడపిల్లలకు అతను అన్నయ్య మాత్రమే
కావాలని నా మనసులో ఏమూలనో ఉంది ఉండాలి.

"ఊఁ" అని నిట్టూర్చింది అత్తయ్య. "మగపిల్లలతో
ఆడపిల్లలతో మాత్రం నువ్వాట్టే స్నేహం చేయకు. అరుణ మం
పిల్లేలే!" అత్తయ్య హెచ్చరికకు నేను కాస్త భయపడ్డాను. మ
పిల్లలతో తిరిగే ఆడపిల్లలతో కూడా తిరగ వద్దంటోంది అత్తయ్య
మరి మగపిల్లలతో తిరిగితే ఏమంటుంది? రేపు శేషగిరి నన్ను
రమ్మనమని మరీ మరీ చెప్పాడు.

## 11

ఇంట్లో ఎవ్వరూలేరు. ఒక్కర్తినీ వరండాలో కూర్చుని ఉన్నాను
ఆహ్లాదకరమైన వెన్నెల బయట వెండిలా మెరిసిపోతోంది
బంగారం ముద్దలా ఆకాశంలో మెరుస్తున్న చంద్రుడుకూడా వరం
లోని నాకు కనబడుతున్నాడు.

వికసించిన మేలుజాతి పుష్పాలు. నా కళ్ళకు తోట కో
కళ్ళు చేసుకుని నన్నూ, ప్రకృతినీ తిలకిస్తున్నదన్న భావాన్ని కలిగి
చాయి.

నేను కోరేవన్నీ నింపుకున్న ప్రకృతి అద్భుత సౌందర్యంలో
వెలిగిపోతూ నా మనసును సంతోషంతో నింపివేస్తోంది. ఇంక నా
కున్న లోటేమిటి? ఇంకా నాకు కావలసిందేమిటి? ఆలోచిస్తునం
లోనే వరండాలో ఓ అందాల యువకుడు ప్రత్యక్షమయ్యాడు.



అతను ఎవరోకాదు. శేషగిరి! అతడి చేతిలో వెండి మెరుపుల
వస్త్రాలున్నాయి.

"సుమా! ఈ వస్త్రాలు నీకోసమని వెన్నెలలో తడిపి
తెచ్చాను. నాకోసం ఇవి ధరించవూ?" అన్నాడతను. అతను
నన్ను సుమా అని పిలుస్తూంటే ఎంత బాగుంది? సామాన్యమైనదా
అతడి అందం! ఈ అందగాణ్ణి, ఈ నా ఆరాధకుణ్ణి నేనెందుకు
నిర్లక్ష్యం చేస్తున్నాను?

ఆ వస్త్రాలనందుకుని లోపలికి వెడుతూ తలుపులు మూశాను.
బయటనుంచి అతని మాటలు వినబడుతున్నాయి. "సుమా! ఇంత
కాలం నేనెంత పొరబడ్డాను. ఈ తోటలో వెన్నెలలు కురిపిస్తున్నది
నీవు. అందువల్లనే కాబోలు, నువ్వు లోపలకి వెళ్ళి తలుపులు
మూయగానే వెన్నెల మాయమై ఈ ప్రాంతమంతా కటిక చీకటి
ఆవరించింది." నేను నావంటిమీద బట్టలు తీసేసి గర్వంగా నా
శరీరం వంక చూసుకున్నాను. ఓరగా తలుపులు తీసి, విప్పిన
బట్టలను వరండాలోకి విసిరేశాను.

ఓరగా తీసిన తలుపు సందులనుండి కాంతికిరణాలు ప్రసరిం
చాయని శేషగిరి కవిత్వం చెబుతూంటే ఆనందంగా వింటూ నేను
అతను తెచ్చిన బట్టలు ధరించాను. రవిక నాకు అతికినట్లుగా సరిపో
యింది. నా రూపాన్ని పూర్తిగా తనలో నింపుకున్న శేషగిరి తెచ్చిన
రవిక నాకు అతికినట్లుగా సరిపోవడంలో ఆశ్చర్యమేముంది? తలుపు
తీసుకుని మళ్ళీ వరండాలోకి వచ్చిన నన్ను శేషగిరి గమనించలేదు.
అతను అబ్బురంగా నేను విడిచిన బట్టల్ని చూస్తున్నాడు.

"ఏమిటి చూస్తున్నావ్?" అన్నాను.

అతనులిక్కిపడి నన్ను చూసి "సుమా! నీకోసం ప్రత్యే
కంగా వెన్నెలలో తడిపిన బట్టలు తీసుకొచ్చాను. కానీ నేనెంత
తెలివితక్కువ వాడినో నాకిప్పుడర్థమైంది" అన్నాడు.

"ఏం?"

"ఈ పున్నమిరాత్రి నీచేత ధరింప జేయాలని గత కొ
దినాలుగా ఈ బట్టలను వెన్నెలలో తడిపి దాస్తూ వచ్చాను. కా
నువ్వు కట్టి విడిచిన బట్టలు అప్పుడే వెన్నెల నదిలో మునిగి తడిసి
వాటిలా ఉన్నాయి. వెన్నెలలు ప్రసరించే నీ శరీరానికి వెన్నెల
తడిసిన బట్టలివ్వాలనుకున్న నా తెలివితక్కువ ఇప్పుడీ బట్టల
చూసేవరకూ తెలియనేలేదు" అన్నాడతను బాధగా.

"ఏమిటీ నీ ధోరణి శేషగిరీ! నేను లేకపోతే కటిక చీకట
పోయి ఏమీ కనబడ్డం లేదన్నావు? ఆ కటిక చీకట్లో నేను విడి
బట్టల సొబగు ఎలా చూడగలిగావు?" అన్నాను చిరాకును అభి
యిస్తూ. అయితే నాలో చిరాకు ఏ మాత్రమూ లేదు. అత
పొగడ్తలు నాకు చాలా అహ్లాదకరంగా ఉన్నాయి.

"నిన్ను చూస్తే నాకు మతిపోతోంది సుమా! లోకా
వెన్నెలిస్తోంది నువ్వనుకుని పొరబడ్డాను ముందు. కానీ నీ
చంద్రుడికి మించిన దివ్యతేజస్సు. వెన్నెలలోంచి వచ్చి నిన్ను
చూశాను. నువ్వు మాయం కాగానే కాసేపు కళ్ళు చీకట్లు
కమ్మాయి. కానీ కాసేపటికి నా కన్నులు వెన్నెలను చూడగ
గాయి" అన్నాడు శేషగిరి.

"నాపట్ల నీకు ఎంత ఆరాధన శేషగిరీ!" అన్నాను.

"నా ఆరాధ్య దైవంగా నిన్నెన్నుకోగలగడం పూర్వజ
సుకృతం అనుకుంటాను."

"నన్ను దైవాన్ని చేయకు. ఎప్పటికీ నీకు అందను."

"నువ్వు దేవతవే. నేను నీ భక్తుణ్ణి. భక్తికి లొంగని దే
తలుండరు" అన్నాడు శేషగిరి.

"అయితే నీ భక్తిని ప్రదర్శించు" అన్నాను.

అతడు నా పాదాలకు వందనం చేశాడు. అతని చేతి స్ప
నాకు గిలిగింతలు పెట్టింది.

"లే! నీ భక్తికి మెచ్చాను. నీ వశమయ్యాను" అన్నాను.



శేషగిరి లేచి నిలబడ్డాడు. నా కతను చాలా దగ్గరగాఉన్నాడు. అతని చేతులు ముందుకు సాగి నా నడుమును తాకాయి. అప్రయత్నంగా అతనికి హత్తుకుని పోయాను.

శేషగిరి కళ్ళు ఇప్పుడు కొత్తరకంగా చూస్తున్నాయి. ఆ చూపుల తాకిడికి నేను తట్టుకోలేకపోతున్నాను. నేనో అందాల రాణిననీ, అతన్ని శాసించగలననీ మరిచిపోయాను. అతనేంచేసినా పొట్లాడకూడదనీ, అతను చెప్పినట్లు వినాలనీ అనిపించింది. ఇంకా చెప్పాలంటే అతనికి దానిసనై పోవాలనిపించింది.

కొద్ది క్షణాల క్రితం వరకూ అతన్ని శాసించగలను. నాలో అప్పుడే ఎంత మార్పు!

శేషగిరి చేతులు నన్ను బిగుసుకుంటున్నాయి. ఆ బిగి కౌగిలి నాకెంతో హాయిగా ఉంది. అతని ముఖం నాకు బాగా దగ్గరైంది. వెచ్చని అతడి ఊపిరి నా చెక్కిలికి గిలిగింతలు పెడుతోంది.

"శేషగిరీ నేను నీ దానిసను!" అన్నాను అప్రయత్నంగా.

శేషగిరి నన్ను చటుక్కున ముద్దు పెట్టుకున్నాడు.

* * *

"ఈ రోజింకా లేవలేదామ్మ" అంది లక్ష్మి.

ఉలిక్కిపడి లేచాను. అంతా కల!

అయినా నమ్మకం కలగలేదు "నేనెక్కడున్నానే!" అనడిగాను లక్ష్మిని.

"అదేంటమ్మ అలా అడుగుతున్నారు?" అంది లక్ష్మి ఆశ్చర్యంగా.

చుట్టూ చూశాను. ఎక్కడా వెన్నెల లేదు, పూలులేవు, చంద్రుడు లేడు.

వీళ్ళెవరూ లేకపోయినా ఫరవాలేదు. శేషగిరి కూడా లేడు.

అప్రయత్నంగా నా మనసు, తనువు కూడా శేషగిరిని కాంక్షిస్తున్నాయి.

ఉన్నట్లుండి లక్ష్మి శేషగిరిగా మారిపోతే ఎంత బాగుండును!

లక్ష్మిని పరీక్షగా చూశాను. అది శేషగిరిగా మారే లక్షణం కనబడలేదు. కానీ దాని చేతిలో చీపురు కనబడింది. ఉన్నపళంగా అది శేషగిరిగా మారితే నాకు లభించేది వెన్నెల్లో తడిసిన వస్త్రం కాదు చీపురు కట్ట!

"చేతిలోని చీపురుకింద పారేయవే!" అన్నాను.

"ఆదేంటమ్మా మీరీరోజు చిత్రంగా మాట్లాడుతున్నారు" అంది లక్ష్మి.

చటుక్కున మంచం దిగాను. నా మత్తు పూర్తిగా వదిలిపోయింది. చేతిలోని చీపురు పారేస్తే మాత్రం లక్ష్మి శేషగిరిగా మారుతుందా? ముఖం కడుక్కునే సమయానికి నేను పూర్తిగా కలల ప్రపంచంలోంచి బయటికివచ్చాను.

అయితే జరిగినదంతా వట్టి కల! కానీ ఎంత బాగుండును ఆ కలే నిజమైతే? అది నిజమయేలా చేయగల శక్తి నాకే ఉంది. అంటే ఈరోజు సాయంత్రం అతన్ని పార్కులో కలుసుకోవాలి.

అంటే. నేను శేషగిరిని ప్రేమిస్తున్నానా? ఈ ఆలోచన కలగ్గానే నన్ను భయమావహించి శరీరమంతా వణుకుపుట్టింది. వెంటనే వేణ్ణీళ్ళస్నానం చేశాను.

కాలేజీకి వెళ్ళేవరకూ ఇంట్లో అన్యమనస్కంగానే ఉన్నాను. అవునుమరి నాజీవితానికి సంబంధించిన ఓ పెద్ద నిర్ణయం ఈరోజే తీసుకోబోతున్నాను. ఇప్పుడు శేషగిరి గురించి తీవ్రంగా ఆలోచించసాగాను. శేషగిరి భాగ్యవంతుల బిడ్డ. అతనికి రెండు కార్లున్నాయి. నాకోసం సమయమంతా ఖర్చు పెట్టగలిగినంత ప్రేమ ఉంది. నాకోసం అతను అహోన్నికూడా చంపుకుని బిచ్చగాడు కూడా అయ్యాడు. అతను గొప్ప అందంగా ఉన్న విషయం ఏ ఆడపిల్లైనా నిరాపేక్షణీయంగా ఒప్పుకుంటుంది.

కాలేజీలో అరుణతో ఈ విషయం మాట్లాడాను.



"ఈ రోజు నాకు చాలా సంతోషంగా ఉందే!" అంది అరుణ.

"ఏం?"

"లైలామజ్నూల కథ విన్నప్పుడు అలాంటి ప్రేమికులుంటారా అని ఆశ్చర్యపడ్డాను కానీ శేషగిరి తన ప్రేమలో మజ్నూను మించి పోయాడని నా అనుమానం. నీకు లైలా అందమైతే వచ్చింది కానీ ఆ ప్రేమ స్వభావం రాలేదని నాకు బాధగా ఉండేది. నువ్వు శేషగిరి ప్రేమను అర్థం చేసుకుని ఆదరించగలిగితే నీ వంటి స్నేహితురాలున్నందుకు నాకెంతో సంతోషంగా, గర్వంగా ఉంటుంది" అంది అరుణ.

"అయితే నేను శేషగిరిని ప్రేమించడం ఉత్తమమైన పనంటావ్!" అన్నాను.

"ముమ్మాటికీ!" అంది అరుణ.

నా మనసిప్పుడు బలహీనంగా ఉంది. అది శేషగిరికి లొంగిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిలో మానసిక బలానికి సహాయం చేయూత కావాలి. అందుకే నేను అరుణను ఆశ్రయించాను. అరుణ ఈ విషయంలో నాకెలాంటి సలహా యిస్తుందో నేనూహించగలను. నాకు నచ్చే సలహా యిస్తుందని తెలిసే దాన్ని సలహా అడిగాను. అది కాదంటే వింటానని చెప్పలేనుకానీ ఔనంటే దాని మాట మీదే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నన్ను నేను మభ్యపెట్టుకోగలను.

"ఇద్దరం ఒక వయసు వాళ్ళమే అయినప్పటికీ నీ తెలివితేటలమీద నాకు బాగా నమ్మకముంది. నువ్వు చెప్పినట్లే ఈరోజు శేషగిరిని కలుసుకుంటాను" అన్నాను అరుణతో.

"అయితే మీరిద్దరూ ప్రేమికులైనట్లే! ఇంక నేను సాయంసమయాల్లో ఆ పార్కు ఛాయలకు రాను" అంది అరుణ.

# 12

"వచ్చేరా?" అన్నాడతను. అతని కళ్ళలో మెరిసిన ఆశ నన్ను కదిలించింది.

"నాకంటే పెద్దవారు. నన్ను మన్నించకూడదు. సుమ అని పిలవండి" అన్నాను. అంత త్వరగా అలా మాట్లాడదామ నేననుకోలేదు. కానీ రాత్రి వచ్చిన కల అప్రయత్నంగా నాచేత మాటలనిపించింది. అతను సుమా అని పిలిస్తే వినాలని మనసు తహతహలాడి పోతోంది.

"నేను మన్నిస్తున్నది మీ వయసును కాదు. మీ సౌం ర్యాన్ని" అన్నాడతను.

"అందంలో కూడా నేను మీకంటే చిన్నదాన్నే!" అన్నా

"నా అందం మీకు గొప్పది. మీ అందం నాకు గొప్ప అందుకే పరస్పరం మన్నించుకుంటున్నాం బహువచన ప్రయో గంలో" అన్నాడు శేషగిరి.

"అలాంటప్పుడు ఈ పార్కులో కలుసుకోవడమెందుకు ఫోన్‌లోనే మాట్లాడుకోవచ్చుగా!" అన్నాను నేను.

"అంటే?"

"అందానికి మన్నన చేరువకావడం, చనువు తీసుకోవడం చనువు ఏకవచన ప్రయోగంలోనే పెరుగుతుంది."

"ఈ రోజు మీరు చాలా చిత్రంగా మాట్లాడుతున్నారు" అన్నాడతను ఆశ్చర్యంగా.

అతని ఆశ్చర్యం సబబైనదే! నేను నిన్న అతనితో మాట్లా డిన తీరువేరు. ఒక్కరాత్రి కలలో మేమిద్దరమూ ఎంతో దగ్గ నట్లు నేను భావించి వాస్తవం మరిచిపోయాను.

అతనుకూడా నాగురించి ఎన్నో కలలుకంటూ ఉండవచ్చు కానీ అతను వాస్తవంలోనే ఉండగలుగు తున్నాడు. అందుకు కారణం నేను అధికారి, అతను సేవకుడు కావడమే అయుండవచ్చు



అధికారులు తమ ప్రవర్తన విషయంలో జాగ్రత్తగా ఉండనవసరం లేదు. తమ మూడ్స్‌కు అనుగుణంగా వారు ప్రవర్తించినా ఇబ్బందిలేదు. సేవకుల్లో మాత్రం అలా కుదరదుగదా!

"అవును. నిజమే! ఈరోజు మీ పుట్టినరోజు గదా అని వచ్చాను ఇదే మన ఆఖరి కలయిక. మీకు గుడ్ బై చెప్పాలనే వచ్చాను." అన్నాను. ఈసారి నా మాటల్లో చిలిపితనమేకానీ రోషం లేదు.

అతనికి అర్థమైనట్లుంది. "మీ అభిమానానికి ధన్యుణ్ణి. నా పుట్టినరోజయితే ఎప్పుడు పిలిచినా తప్పక వస్తారుగా!"

"ఆ!"

"అయితే ఇది మన ఆఖరు కలయికకాదు. నా పుట్టిన రోజు రేపు" అన్నాడతను.

నేను విస్మయంగా "ఈరోజు మీ పుట్టిన రోజని నిన్న చెప్పారు" అన్నాను.

"నిన్నకూడా నా పుట్టినరోజు ఈ రోజని చెప్పలేదు. రేపు అనే చెప్పాను."

ఫక్కున నవ్వి "అయితే అసలు మీకు పుట్టినరోజంటూ ఉండకుండా పోతుంది" అన్నాను.

"మీ పరిచయం లభించాక నాకు చావు పుట్టుకలతో నిమిత్త మేముంది?" అన్నాడతను. నేను దేవతనన్న భావాన్ని స్ఫురింప జేస్తూ.

"రేపటి పుట్టినరోజుకు ఈరోజు సమయం వృథా చేయడం నాకు నచ్చదు. మీ పుట్టిన రోజెప్పుడో చెప్పండి. అరోజే వస్తాను" అంటూ లేవబోయాను.

"మీరు నా పక్కనలేని క్షణంలో నేను చచ్చిపోతాను. మళ్ళీ మీరు మీ అమృత దృష్టి నాపై ప్రసరించినపుడే నేను బ్రతుకుతాను. అందువల్ల మీరెప్పుడు నా దగ్గరకు వస్తే అప్పుడే పుట్టినరోజన్నమాట. అందువల్ల మీరిప్పుడు నా పుట్టినరోజుకే వచ్చారు, కాబట్టి వెళ్ళిపోనవసరం లేదు."

"చాలా చమత్కారంగా మాట్లాడుతున్నారు" అన్నాను.

"నాలో చాలా కళలున్నాయి, కానీ మీరు పక్కన లేకపోతే ఏవీ రాణించవు."

"అయితే ఇకమీదట నన్ను సుమా అనే పిలువు శేషగిరీ" అన్నాను ఇంక నేనే ఆ పిలుపుకు ప్రారంభోత్సవం చేస్తూ.

" సుమా !" అన్నాడతను అప్రయత్నంగా.

ఒక్కక్షణం ప్రకృతిస్థంభించి పోయినట్లుగా అనిపించింది నాకు.

" నేను నిన్ను ప్రేమిస్తున్నాను శేషగిరీ ! " అన్నాను నెమ్మదిగా. ఎంతనెమ్మదిగా అన్నప్పటికీ ఆ మాటలు అతనికి వినబడ్డాయని అతని ముఖంచెప్పింది.

" నిజమా ? "

" నా మాటలు ఎంతస్పష్టంగా ఉన్నాయో, అంత మనస్ఫూర్తిగా చెపుతున్నాను " అన్నాను.

శేషగిరి ఒక పర్యాయం చుట్టూచూసి " ఏమిటీ విచిత్రం" అన్నాడు.

" ఏమైందీ ?" అన్నాను.

" ఇప్పుడు నా చుట్టూ ఒక్కరుకాదు, ఎందరోసుమలున్నారు. ఎవర్ని చూసినా నీలాగేకనబడుతున్నారు. ఒక్కసారిగా ప్రపంచమంతా నీమయమై పోయినట్లుంది" అన్నాడు శేషగిరి.

అది నిజమో, అతని భావుకతో తెలుసుకుందామని నేనూ చుట్టూచూసి ఆశ్చర్యపడ్డాను. ఎక్కడ చూసినా శేషగిరులే ! ప్రపంచమంతా అతడి మయమై పోయినట్లుంది.

* * *

" నీపుట్టినరోజు రేపు కాక ఈనాడు అయితే ఎంత బాగుండును ?" అన్నాను.

" ఏం ?" అన్నాడు శేషగిరి.

" ఈనాడు అయితే అనుభవయోగ్యం. రేపు అయితే ఎదురుచూడాలి. ఎదురుచూడడం నాకిష్టముండదు." అన్నాను.



" రేపు అన్నపదం చాలాగొప్పది సుమా ! అదంటే నాకు ఎంతో ఇష్టం. మనిషిలో ఎన్నో ఆశలురేపేది, ఆశలకు నిత్య నూతనత్వాన్ని ప్రసాదించేదే రేపు. రేపు అన్నదిలేక ఈనాడు అన్నదొక్కటే ఉంటే నేను ఎప్పుడో నీప్రేమకు దూరం అయిపోయాను. రేపుమీద ఆశతో బ్రతకడంవల్లనే ఈనాటికి నీ ప్రేమ భాగ్యం పొందగలిగాను " అన్నాడు శేషగిరి.

" ఎదురు చూడడంలో నీకంత ఆనందమున్న పక్షంలో నాప్రేమ అప్పుడే అందిందనుకోకు. నేనుకూడా నిన్ను రేపట్నించే ప్రేమించడం ప్రారంభిస్తాను. "

" ప్రేమ ఈనాడు, పుట్టుక రేపు అదేకదా జీవితసత్యం. "

శేషగిరి చాలా బాగా మాట్లాడుతాడు. మాటల్లో నేనతనికి చాలను. అతను ఎక్కువగా నన్ను పొగుడుతూండడం వల్ల అతని మాటలు వినడం పట్ల నా ఆకర్షణ నానాటికీ పెరిగిపోతోంది.

ఒకసారి అతనికి చెప్పాను " నాకు బాగా పొగడ్తను అలవాటు చేసేస్తున్నావు శేషగిరీ ! అందువల్ల నీకూనాకూ కూడా ఇబ్బందే. "

" నేనునిన్ను పొగడడంలేదు. ఉన్నమాటలే అంటున్నాను. కొంతకాలానికి ఉన్న మాటలు అయిపోతాయని భయపడనవసరం లేదు. నీ అందం నిత్యనూతనం " అన్నాడు శేషగిరి.

"ఇలాంటి భావాలన్నీ పెట్టి సినిమాపాటలు రాయకూడదూ?" అన్నాను.

" రాస్తాను. కానీ ఈనాడు కాదు. రేపు ! " అన్నాడతను.

## 13

శేషగిరి పట్ల నాకు గల ఆకర్షణ నానాటికీ పెరిగిపోతోంది. మా ఇద్దరిప్రేమ దినదిన ప్రవర్ధమాన మవుతోంది.

మేమిద్దరంకలిసి పార్కుల్లోతిరిగాం. సినిమాలు చూశాం.

శేషగిరికోసం నేను ఎన్నోక్లాసులు ఎగవేశాను కూడా. ఏంచేసినా అత్తయ్య దృష్టిలో పడకూడదన్నది నా ఆశయం. ఈ విషయంలో అత్తయ్యకు సమాధాన మిచ్చుకోగల శక్తి నాకులేదు.

అయితే నేను తప్పు చేస్తున్నానన్న భావంనాకులేదు.

శేషగిరి సంస్కారంలో ఉత్తముడు. ఎన్నిసార్లు కలిసితిరిగినా అతడు హద్దు మీరలేదు. నన్ను తాకడానికి కూడా ప్రయత్నించే వాడు కాదు.

"మన ఈ పరిచయం కేవలం ఒకరినొకరు అర్థం చేసు కోవడానికి. మనం బాగా ఒకరినొకరు అర్థంచేసుకున్నాక పెద్దల అనుమతి తీసుకుని వివాహబంధంతో ఒకటికావచ్చు, అప్పుడు మనకు హద్దులుండవు. మనం ఉంచము" అనేవాడు శేషగిరి.

అతని ఈసంస్కారం నన్ను ముగ్ధురాల్ని చేసింది. అతని అందానికీ మెరుగులు దిద్దింది. అతన్ని చూసినకొద్దీ ఇంకా చూడాలనీ, అతనిమాటలు విన్నకొద్దీ ఇంకావినాలనీ నాకు అని పిస్తూండేది. అతనిసమక్షం నాకోవ్యసనంగా పరిణమించింది.

శేషగిరి చొరవచేస్తే బాగుండునని నాకు అనిపించిన సందర్భాలు కూడా కొన్ని ఉన్నాయి. అతను చొరవచేస్తే నేను వారించాలన్న కోరిక నాకింకా తీరనేలేదు.

ప్రతిరోజూ శేషగిరిని కలుసుకోవాలనిపించేది. కలుసు కున్నప్పుడల్లా అతనిచేత ఏవేవో వాగించి ఆనందించేదాన్ని.

మొదట్లో శేషగిరి నాకు చాలాచిన్నవాడులా కనిపించాడు. అతన్ని నేను శాసించేదాన్ని, ఏడిపించేదాన్ని. నా ఆజ్ఞలకోసం ఎదురు చూసేలా చేసేదాన్ని.

కానీ ఇప్పుడలాకాదు. శేషగిరి అన్నివిధాలా నాకంటె గొప్పవాడిలా అగుపిస్తున్నాడు. అతని అనుభవం, విజ్ఞానం, లోక జ్ఞానం, చమత్కారం ముందు నేనెంత అనిపించేది. నాకు తెలియ కుండానే నేనతన్ని ఆరాధిస్తూ అతను చెప్పినట్లల్లావిని ఆచరించడం నేర్చుకున్నాను.



నాబట్టల ఎన్నికలో, నాఅలంకరణలో, మాట్లాడే పద్ధతిలో, అభిరుచులలో ఇలా ఎన్నింట్లోనో శేషగిరి కారణంగా మార్పులు వచ్చాయి. అతనేం చెప్పినా దానివెనుక బోలెడు తర్కం, వేదాంతం ఉంటాయి. మొదట్లో మూర్ఖంగా వాదించేదాన్ని కానీ క్రమంగా అతను ఏంచెప్పితే అది నిజమైతీరాలన్న నిర్ణయానికి వచ్చాను.

శేషగిరి దగ్గర ఉన్నప్పుడు కూల్‌డ్రింక్ తప్పతాగేదాన్ని కాదు, ఐస్‌క్రీమ్ తప్ప తినేదాన్నికాదు. ఒకటి రెండుసార్లు అతను స్వంతకారు తీసుకువచ్చాడు కానీ తర్వాత నేనే వద్దన్నాను. టాక్సీ అయితేనే క్షేమం అనిపించింది. అతనూ నా సూచనకు వెంటనే అంగీకరించాడు.

నా గురించి అతనికి ప్రతిరోజూ చాలా ఖర్చయేది. అతని ముఖంలో ఆవగింజంత అసంతృప్తి అయినా ఉండేదికాదు. నా సంతోషమే తన ధ్యేయమన్నట్లు మసలేవాడు.

ఒకరోజున నేను........"నా మూలంగా నీకు చాలా ఖర్చవు తోంది........" అన్నాను.

"ఈ ఖర్చొక లెక్కా ? వివాహమయ్యేక నిన్ను విమానాల్లో ఎగిరించాలి. నగలదుకాణాల్లో నడిపించాలి........"అని నవ్వాడు శేషగిరి.

ఆ మాటలకు నా శరీరం పులకరించిపోయింది. ఎంత అదృష్టవంతురాలిని నేను ? కోరిన అన్నిలక్షణాలూ ఉన్న మగవాడు నాకు భర్త కాబోతున్నాడు.

"నా కిప్పుడే విమానాల్లో ఎగరాలనీ, నగల దుకాణాల్లో నడవాలనీ ఉంది........" అన్నాను.

అతని కళ్ళలో కలవరం కనిపించింది........ "అప్పుడే వివాహమా ?" అన్నాడు.

"ఏం ?"

"నువ్వింకా బియ్యే పూర్తి చేయాలిగదా !"

"ఇలా తిరుగుతూంటే బియ్యే అయ్యేదెప్పుడు ? ఇంక పెళ్ళి చేసుకోవడమే శ్రేయస్కర మనిపిస్తోంది........" అన్నాను. శేషగిరి

ముఖంలో దిగులు స్పష్టంగా కనబడగా నాకుకలిగిన ఆశ్చర్యం ఇంతా అంతాకాదు........ "అదేమిటి శేషగిరీ........అలాగై పోయావ్? నన్ను పెళ్ళి చేసుకోవడం నీ కిష్టంలేదా ?"

"ఇష్టంలేకపోతే ఈ ప్రయత్నాలన్నీ ఎందుకు చేస్తాను!" అన్నాడతను.

"అయితే మరి పెళ్ళిమాట వింటూనే అలాగై పోయావేమిటి ?''

"నా బాధ నీ కెలా చెప్పుకోవాలో అర్థంకాక......" అన్నాడు శేషగిరి.

"ఎలాచెప్పినా ఫరవాలేదనుకు నేంత బాగా మనమింకా ఒకర్నొకరు అర్థంచేసుకోలేదని నువ్వభిప్రాయ పడుతున్నావా!" అన్నాను తీవ్రంగా.

శేషగిరి కళ్ళలో మళ్ళీ మెరుపు కనబడింది........ "పెళ్ళి విషయంలో నాకోచిన్న సమస్య ఉంది సుమా !........ మా అమ్మా నాన్నలకు పెళ్ళివిషయంలో కొన్నిపట్టింపులున్నాయి. కనీసం లక్ష రూపాయలైనా కట్నంలేనిదే నాపెళ్ళి జరుగనివ్వరు వాళ్ళు......" అని ఆగాడతను.

నా గుండెల్లో రాయిపడింది...."లక్షరూపాయలు కట్నమా!" అన్నాను నీరసంగా.

అవును. శేషగిరి అంతస్థు అటువంటిదిమరి. కానీ శేషగిరి ఏ ఉద్దేశ్యంతో నాతో ఈ వ్యవహారం ప్రారంభించాడు. నా కీర్తి చూసి నేను డబ్బున్న వాళ్ళమ్మాయినని అనుకున్నాడా? ఇప్పుడు నేనేం చేయాలి? నా అసలు పరిస్థితిని బయట పెట్టాలా ?

"అవును. లక్షరూపాయలు కట్నం. అంత కట్నమిచ్చే వాళ్ళు పెళ్ళికి మరో లక్షయినా ఖర్చుచేయాలిగదా........ అంటే నీ పెళ్ళికి మీ నాన్న రెండులక్షలు ఖర్చుచేయాలి........" అన్నాడు శేషగిరి.

"లెక్క చాలా బాగుంది........" అన్నాను.



"అలా కోపంగా చూడకు సుమా!" అన్నాడతను.

"కోపం లేకపోతే నీ మాటలకు సంతోషం కలుగుతుందా? అందాన్ని గౌరవించే పద్ధతి ఇదేనా? డబ్బుసంగతి వచ్చేసరికి ...త్వం మాయమయిందా? కట్నమిచ్చి పెళ్ళి చేసుకున్నానంటే ...గురిలో నా కెంత అవమానమో గ్రహించలేదా?" అన్నాను ...కపోతు గాంభీర్యంలో. కానీ నా దగ్గర డబ్బుంటే రెండేమిటి.... ...లక్షలైనా పారేసి శేషగిరిని కొనుక్కుని ఉండేదాన్ని!

"నా మాటలు పూర్తిగా వినవేం? ఇస్తానన్నా నీ దగ్గర ...సా కట్నం పుచ్చుకోను. నేను చెప్పేదల్లా కట్నంలేని పెళ్ళికి ... నాన్న ఒప్పుకోడని, అందుకని ఒక ఉపాయమాలోచించాను. ... మధ్యనే నేను వ్యాపారంలో ఆసక్తి చూపుతున్నాను. అందుకు ...న్నకూడా సంతోషించాడు. నా స్వంత వ్యాపారం ప్రారంభించా...టే వెధవది రెండులక్షలు సంపాదించటానికి ఆరునెల్లు చాలు. ... డబ్బు నీకు సమర్పించుకుంటాను. నీ పెళ్ళికి నీ డబ్బు పైసా ...చ్చయినా అది నీ అందానికి అవమానంగా నేను భావిస్తాను. ...దుకే వ్యాపారంలో వేలుపెడుతున్నాను. స్థిరపడ్డానికి రెండు ...మూడేళ్ళుపడుతుంది. అంతవరకూ మనం ఆగకతప్పదు........"

"రెండు మూడేళ్ళే?" అన్నాను బాధగా. నా బంగారుకలలు ...ంకావడానికి అదె చాలా పెద్ద వ్యవధిగా నాకు తోచింది.

"అవును సుమా! అంతకాలం ఆగడం కష్టమని నాకూ ...పిస్తూంటుంది. ఒకోసారి ఏమనిపిస్తూంటుందో తెలుసా సుమా! ... తలిదండ్రులెన్నెదిరించి వెంటనే నిన్ను వివాహం చేసుకోవాలని ...స్తుంది. అయితే అప్పుడు నేను ఇల్లు, ఆస్తి అన్నీవదులుకుని ...త జీవితం ప్రారంభించాల్సి ఉంటుంది. నా సామర్థ్యంతో నేనేదో ...ద్యోగం ........ నెలకు ఏడెనిమిది వందలు దొరికేది సంపాదించు...గలను. కానీ అలా నీ కిష్టముంటుందా ?" అన్నాడు శేషగిరి.

"వద్దు శేషగిరీ! నాకోసం నువ్వింత పెద్ద త్యాగం చే
వద్దు" అన్నాను కంగారుగా.

"ఇందులో త్యాగమేమీ లేదు సుమా! సంపదల మీద నా
కెన్నడూ మోజులేదు. నీ సమక్షంలో నాకు సంపదలెందుకు
తుచ్ఛమైన భౌతిక భాగ్యాలమీద నీకు మోజుంటుందని అనుకో
నీచేయూత లభిస్తుందన్న హామీ ఉంటే నేనీ క్షణంలోనే వివాహ
సిద్ధం. ఇప్పుడూ నాకు కట్నం అవసరం లేదు. నీ తలిదండ్రు
ఆశీర్వాదం లభిస్తే చాలు" అన్నాడు శేషగిరి ఆవేశంగా.

"కంగారుపడకు శేషగిరీ! ఇన్నేళ్ళు నిన్ను పెంచిన
తలిదండ్రుల మనసు నొప్పించడం వల్ల నాకు వాళ్ళ ఉసు
తగుల్తుంది. నాకు డిగ్రీ వచ్చేవరకూ చదవాలని ఎలాగూ ఉ
ఈలోగా నీ ప్రయత్నాలు నువ్వు చేయి" అన్నాను నేను కం
రుగా. నేను కోరుకునే భాగ్యవంతుడైన శేషగిరి నా గురి
సామాన్య ఉద్యోగిగా మారిపోతే కోటేశ్వరరావుకీ ఇతనికీ తే
ఏముంటుంది? నేను కోటేశ్వరరావు నెందుకు వదులుకున్నా
కానీ ఈ విషయం నిర్మొహమాటంగా శేషగిరికి చెప్పలేనుగా
అతను నాగురించి నిజంగానే తలిదండ్రులతో తెగతెంపులు చే
కుంటాడేమోనన్న భయం నాకు కలిగింది.

"నా తలిదండ్రుల గురించి నువ్వు బెంగపడకు. ఏ
ఒకరోజున మనసుమారి వాళ్ళు నన్ను చేరదీయపోరు" అన్నా
శేషగిరి.

"అలాగనుకోకు. ఒకోసారి పూర్తిగా మనసు విరిగిపో
మీరు శాశ్వతంగా విడిపోవచ్చు."

"అయితే అవనీ. అప్పుడు వాళ్ళు తలిదండ్రులే అనిపి
కోరు."

"అప్పటి వాళ్ళ సంగతెలాగున్నా నువ్విప్పుడే కొడుకు
అనిపించుకోవు" అన్నాను.



"నే నిప్పుడు తరుణప్రాయంలో ఉన్నాను. ఈ వయసులో
నాకు కావలసింది తలిదండ్రులుకాదు. నాతో జీవితం పంచుకునే
ఆడపిల్ల. ఆ విషయం గుర్తించనప్పుడు వాళ్ళు తలిదండ్రులెలా
అవుతారు?"

వ్యవహారం చేయిదాటి పోతున్నదని నేను గ్రహించి భయ
పడ్డాను. కానీ జీవితంలో తలిదండ్రుల ప్రాముఖ్యత గురించి
శేషగిరికి పెద్ద ఉపన్యాసం ఇచ్చాను. ఈరోజు నా గురించి
తలిదండ్రులను వదిలి పెట్టాడనుకుంటే మరో రోజున మరొ
దానికోసం నన్నే వదిలిపెట్టగలడన్నాను. మనసు బలహీనంగా ఉండ
కూడదన్నాను.

నేను నా తలిదండ్రుల నెంతలా గౌరవిస్తానో చెప్పలేనుగానీ
ఆరోజు నేను శేషగిరికి తలిదండ్రుల గొప్పతనాన్ని వివరిస్తూ
చెప్పిన ఉపన్యాసం వింటే శేషగిరి తలిదండ్రులు వెంటనే పైసా
కట్నంలేకుండా ఉభయ ఖర్చులూ భరించి మరీ మా వివాహం
జరిపించి నన్ను తమకోడలిగా చేసుకుని ఉండేవారు.

"నావాదనలో బలంలేదనుకుంటాను. అందుకే నీముందు
నిలవలేకపోయాను" అన్నాడు శేషగిరి నీరసంగా. "అయితే
సుమా! నాఈపరాజయం సామాన్యమైనదికాదు. మన వివాహం
మరి కొద్ది సంవత్సరాలు వాయిదా పడడానికి కారణమైంది.
హఠాత్తుగా నీలో అంతటిశక్తి ఎలావచ్చింది?"

ఎలా వచ్చిందో నాకు తెలుసు. నాలోనిబిడీకృతమై ఉన్న
ఆకాంక్ష. దానిముందు ఏ మహత్తరశక్తీ నిలువలేదు. నిజం
చెప్పాలంటే నేను ప్రేమిస్తున్నది శేషగిరినికాదు. అతడినావహించి
ఉన్న సిరిసంపదలను. వాటినను భవించాలన్న బలమైనకోర్కె
నా స్వార్థపరత్వానికి వశంచేస్తోంది.

పైకి మాత్రం ఏమీ సమాధాన మివ్వకుండా చిరునవ్వు
నవ్వాను.

" ఈ పరిస్థితిలో నువ్వేలానవ్వగలుగుతున్నావు సుమ
అన్నాడు శేషగిరి బాధగా.

నేనాశ్చర్యంగా శేషగిరి వంక చూశాను. అతను ఏదో
తిన్నవాడిలా ఉన్నాడు. ముఖం పాలిపోయి ఉంది. కళ్ళలో
మాత్రమూ ఉత్సాహం గోచరించడంలేదు.

" నాసంగతి సరేగానీ నువ్వలాగై పోయావేమిటి
అన్నాను.

" నీగురించి సంవత్సరాలతరబడి ఎదురుచూసేశక్తి నా
లేదేమోనని భయంగా ఉంది. ఏదో ఒకరోజున నా తలిదండ్రు
ఛేటీరావచ్చునని అనుకుంటున్నాను. అయితే అప్పట్లో నా
బెంగలేదు. కానీ ఈరోజు నీ అభిప్రాయం విన్నాక నాకు బెంగ
ఉంది. నాతలిదండ్రులు పూర్తిగా డబ్బు మనుషులు. వాళ్ళ
గొడవ పడకుండా నిన్ను వివాహం చేసుకోవడం సాధ్యపడు
అని అనుమానంగా ఉంది. నువ్వు నాకు ఒకే ఒక్కహామీ ఇవ్వా
సుమా ! మనప్రేమ సత్యమైనది. అనుకోని పరిస్థితుల్లో
వేశపడి తప్పుచేసినా నాకు నీ ఆశ్రయం లభించాలి. ఆశ్రయమం
డబ్బుకాదు. ఒక చల్లనిమాట, కరుణను చిందించే చూపు, మనసు
ప్రేమ, ఈ మూడూనీనుంచి ఎప్పుడైనా నాకు లభిస్తాయని తెలి
నేను కాస్త ధైర్యంగా ఉండగలుగుతాను, లేకపోతే నేను బెంద
పడిపోతాను సుమా ! " అన్నాడు శేషగిరి. అతనిగొంతుకా
తడిగా ఉన్నదిప్పుడు.

" నీసంస్కారమే నీకు ఆవేశంఎక్కువని తెలియజేస్తుం
శేషగిరీ ! నువ్వు పొరపాటు చేయవనినాకు నమ్మకముం
అయితే ఏపరిస్థితుల్లోనూ నువ్వు నీతలిదండ్రులతో దెందనా
కూడదు. నిరుపేదగా నడివీధిలో నిలబడకూడదు. అలా జరి
సంఘంలో నాకు చెడ్డపేరువస్తుంది. అంతానన్ను తిట్టుకుంటా
నువ్వు ఏమనైనా అనుకో ! నీసిరిసంపదలు నీస్వంత
ఉన్నప్పుడే నిన్ను నేను అభిమానించగలుగుతాను. లేని పక్షంలో



..మ, ఆదరణ, అభిమానం, అనురాగం ఏమీకూడా నీకు లభిం
.. ఇది నా తిరుగులేని అభిప్రాయం. నేను నిన్నుకాక నీ
..బ్బను ప్రేమిస్తున్నానని నువ్వనుకున్నా నాకు బాధలేదు. కానీ
..బ్బలేని నిన్ను అంగీకరించను" అన్నాను తీవ్రంగా.

అతను నిట్టూర్చి "నా సమస్యకు పరిష్కారం ఎప్పటికి
..స్తుందో?" అని గొణుక్కున్నాడు. అతని సమస్యకు పరి
..రం త్వరగా లభించాలని నేనూ కోరుకుంటున్నాను.

# 14

..మా ! ఈరోజు కాలేజీ వదలగానే వెంటనే ఇంటి కొచ్చేసేయ్"
అంది అత్తయ్య.

"కుదరదేమో అత్తయ్యా, ఈరోజు అరుణావాళ్ళ హాస్టల్‌కు
..తానని ప్రామిస్ చేశాను. నేను వెళ్ళకపోతే వాళ్ళు తప్పుగా
..ం చేసుకుంటారు" అన్నాను.

"నేను వాళ్ళకు ఫోన్ చేసి చెప్పనా?"

"వద్దులే అత్తయ్యా" అన్నాను కంగారుగా. "ఇంతకీ
..మిటి?" మామయ్యగారి ఫ్రెండ్సింటికి కుటుంబ సమేతంగా
..మ్మనమని ఆహ్వానం వచ్చిందట. నేనుకూడా వస్తున్నట్లు
..త్తయ్య ఫోన్‌చేసి చెప్పిందట.

"నాకు తెలియని వాళ్ళింటికి రావడానికి నాకు మొహ
..టంగా ఉంటుందత్తయ్యా."

"నిన్నొక్కర్తినీ వదిలేసి నేను వాళ్ళింటికి వెడితే నిన్ను మా
..టుంబంలో లెక్క వేయనట్లుగానే అవుతుంది. అది నాకెంత
..వమానం? స్వయానా అన్నకూతురివి. నిన్ను పరాయి మనిషిగా
..లా చెప్పుకోగలను? నువ్వు రాకపోతే వాళ్ళింటికి వెళ్ళడమైనా
..వేస్తానుగానీ" అని అత్తయ్య ఏదో అనబోగా, నేను చటు
..క్కున అందుకుని "అదేం కాదులేగానీ అత్తయ్యా, వాళ్ళింటి

అడ్రస్ చెప్పు. ఎన్నింటికి అక్కడికి రావాలో చెప్పు. నేను సరిగ్గా ఆ సమయానికి అక్కణ్ణుంచి వస్తాను" అన్నాను.

"కాలేజీనుంచి వచ్చేవంటే జిడ్డుముఖం ఓడుతూ ఉంటుంది. ఆ తర్వాత బస్సు ప్రయాణంలో బట్టలు నలిగిపోతాయి. ఎవరింటికైనా వెళ్ళేటప్పుడు ఫ్రెష్‌గా వెళ్ళాలి."

"అదికాదత్తయ్యా, హాస్టల్లో ఒకమ్మాయి పుట్టినరోజు. ఆ అమ్మాయి చాలా బీదది. స్కాలర్‌షిప్ మీద చదువుకుంటోంది. తన పుట్టినరోజుకి నేను వెళ్ళకపోతే కారణం ఏమైనా ఆ అమ్మాయి చిన్నబుచ్చుకుంటుంది. అందులో నేను రోజూ హాస్టల్లో కాసేపు గడిపి వస్తూనే ఉంటాను. ఈ ఒక్కరోజూ వెళ్ళకపోతే తన పుట్టినరోజుకు హాజరు కావడం ఇష్టంలేక వెళ్ళలేదనుకుంటుంది" అన్నాను.

"అంత బీదదైతే పుట్టినరోజు వేడుక జరుపుకోవడమెందుకు? ఆ డబ్బుతో ఇంకేమైనా కొనుక్కోవచ్చుగా?" అంది అత్తయ్య చిరాగ్గా.

అవును. ఈ విషయం నాకు స్ఫురించనేలేదు. "ఆ అమ్మాయికి పుట్టినరోజు వేడుక జరుపుకోవడం ఇష్టంలేదత్తయ్యా. రూమ్‌లో వాళ్ళు మొత్తం నలుగురు. మిగతా ముగ్గురూ పుట్టినరోజు జరుపుకున్నారు. ఇప్పుడీ అమ్మాయి వాళ్ళ బలవంతం మీదనే ఈ వేడుక జరుపుకుంటోంది". అన్నాను.

"అయితే ఈ రోజుకి కాలేజీ మానేయ్. అప్పుడే ఇబ్బందీ ఉండవుగదా!" అంది అత్తయ్య.

"అమ్మబాబోయ్, కాలేజీ మానేయడమే! ఈరోజు చాలా ముఖ్యమైన క్లాసులున్నాయి."

"అత్తయ్య చిరాగ్గా చూసి మరైతే నన్నేం చేయమంటావ్ చెప్పు" అంది.

"నేను వచ్చేది హాస్టల్‌నించే గదా ట్రిమ్‌గా తయారై వస్తాను" అన్నాను.



ఏ కళనుందో అత్తయ్య సరేనంది.

అత్తయ్యతో ఇంతలా పోట్లాడవలసిన అవసరముండేది కాదు, కానీ ముందుగానే శేషగిరితో మ్యాట్నీ సినిమా ప్రోగ్రాం పెట్టుకోవడం వల్ల ఈ వాదన తప్పని సరి అయింది.

శేషగిరితో కార్యక్రమం కాన్సిలైతే నా మనసు తట్టుకోలేదు. అందుకే అత్తయ్యకు నోటికి వచ్చిన అబద్ధాలన్నీ చెప్పాను. అయితే అబద్ధాలు చెప్పడం నాకు కొత్తకాదు. శేషగిరితో పరిచయం అయినప్పట్నించీ అబద్ధాలు చెప్పడం నాకు అభ్యాసమయింది. అబద్ధాలు చెప్పడంలో నా అనుభవం పెరిగినకొద్దీ, మా ఇద్దరి కార్యక్రమాలూ నిరాటంకంగా కొనసాగి పోసాగాయి.

మా ఇద్దరి పరిచయం గురించి అరుణకు తప్ప ఇంకెవ్వరికీ తెలియదు. అది యెవ్వరికీ చెప్పదని నాకు తెలుసు. శేషగిరిని నేనెంత రహస్యంగా కలుసుకుంటున్నాను. మేమిద్దరం పరిచయస్థులెవ్వరూ ఎదురుపడని ప్రదేశాల్లోనే తిరుగుతున్నాము.

ఒకే ఒక్క బాధ ఉండేది నాకు. శేషగిరితో పరిచయం లేనప్పుడు ఈ ఊరు ఎంతో విశాలంగా కనబడేది. ఇప్పుడీ ఊరు నాకు చాలా చిన్నదిగా కనబడుతోంది. ఊరంతా పరిచయస్థులే! తెలిసిన వారి కళ్ళబడకుండా తిరగడానికి చాలా కష్టంగా ఉంటోంది.

ఈ బాధకు ఇంకో భయంకూడా తోడయింది నాకు. శేషగిరి పక్కన ఉన్నప్పుడు పరవశం లాంటిది కలుగుతుంది నాకు. నన్ను నేనే మరచిపోతూంటాను. ఆ మైమరపులో అజాగ్రత్తగా ఉండి తెలిసిన వాళ్ళెవరికైనా దొరికి పోతానేమోనన్న భయం నాకుంది. అలా దొరికితే అత్తయ్య నెసుర్కోవాలి. అది నాకు చేతకాదు. మనసులో భయం ఎలా ఉన్నప్పటికీ నేను శేషగిరితో తిరగడం మానలేను. ప్రస్తుతానికి అది నా బలహీనతగా ఉంటోంది. శేషగిరి పరిచయంలో నేను ఇటు చదువునూ, అటు పరువునూకూడా లక్ష్యం చేయడం లేదు. నాకూ, శేషగిరికీ గల పరిచయం ఇంకా మా కాలేజీలో ఎవరూ పడకపోవడం నా అదృష్టం.

కానీ ఇలా ఎంతకాలం సాగుతుంది? ఏదో ఒకరోజున నేను దోషిగా అత్తయ్యముందు నిలబడకతప్పదు. అప్పుడేం జరుగుతుంది? ఇది తెలుసుకోవడానికీ ఎంతోకాలం పట్టలేదు.

# 15

పిల్లి కళ్ళుమూసుకుని పాలు త్రాగినంతమాత్రాన ఇతరులకు కనబడకుండా పోదు. మా పరిచయాన్ని రహస్యంగా ఉంచడానికి నేను, శేషగిరి చేసిన ప్రయత్నాల విలువ అంతమాత్రమే అయింది.

ఒకరోజు అత్తయ్య కాలేజీనుంచి అప్పుడే ఇంటికి వచ్చిన నన్ను ప్రేమగా గదిలోకి పిలిచి........ "ఈ రోజు పెందరాళే ఇంటికి వచ్చావేమ్మ........ శేషగిరితో ప్రోగ్రాం లేదా?" అంది.

నెత్తిమీద పిడుగు పడ్డట్లయింది నాకు. నోటమాటరాక అలాగే శిలాప్రతిమలా అత్తయ్యవంకే చూస్తూ ఉండిపోయాను. కానీ అలాకూడా ఎంతోసేపు చూడ్డం వీలుకాలేదు.

అత్తయ్య కళ్ళలోంచి నిప్పులు వర్షిస్తున్నాయి. అత్తయ్యను ఈ రూపంలో చూడ్డం ఇదే ప్రథమం నాకు.

"ఏం........మాట్లాడవేం?" అంది అత్తయ్య.

అయినా నేను మాట్లాడలేదు. అత్తయ్య పెద్దఎత్తున దండకం మొదలు పెట్టింది. ఆవిడ ఏంమాట్లాడుతోందో నేను వినడంలేదు. నా సర్వేంద్రియాలూ పనిచేయడం మానేశాయి. కాసేపటికి అత్తయ్య నాకు దగ్గరగా వచ్చి........ "నేను చెప్పేది వింటున్నావా, లేదా?" అంది.

"వింటున్నానత్తయ్యా?" అన్నాను. నా కంఠంవింటే ఎవరికైనా తెలుస్తుంది. ఏడవడానికి సిద్ధంగా ఉన్నానని.

"మగవాడు తప్పుచేసి ఏడిస్తే అంతా జాలిపడి వాణ్ణి క్షమిస్తారు. ఆడది కావలసింది సాధించుకోవడం కోసమే ఏడ్వాలి తప్పితే...



తప్పుచేసి ఏడిస్తే లాభంలేదు. ఆడదానితప్పు ఏడుపువల్ల పోయేది కాదు........"

"నేనేం తప్పుచేయలేదత్తయ్యా!" అన్నాను నన్ను నేను నిగ్రహించుకునేందుకు ప్రయత్నిస్తూ.

"అయితే నువ్వు శేషగిరితో తిరుగుతున్న మాట నిజం కాదా?........"

"నిజమే........కానీ నేనే తప్పుచేయలేదు........"

"నువ్వు చేసేది తప్పుకాదని నీకుతోస్తే........ఈ విషయం నాకు చెప్పకుండా రహస్యంగా ఎందుకుంచావ్?" అనడిగింది అత్తయ్య. ఈ ప్రశ్నకు నా దగ్గర జవాబులేదు. ఊరుకున్నాను.

"నువ్వెంతో మంచిదానివనుకున్నాను. అమాయకురాలివనుకున్నాను. అందుకే మీ నాన్ననడిగి మరీ నాదగ్గర తెచ్చిపెట్టుకున్నాను. కానీ నువ్విలా ప్రవర్తిస్తావనీ, నా పరువు తీస్తావనీ, మీ నాన్నకు సమాధానమిచ్చుకోవలసిన స్థితికి నన్నులాగుతావనీ నేనెన్నడూ అనుకోలేదు........" అంది అత్తయ్య.

ఇంకనాకు ఏడుపు ఆగలేదు. ఉన్నచోటునే కూర్చుండిపోయి........చేతుల్తో ముఖం కప్పుకున్నాను.

అత్తయ్య ఆ తర్వాత ఇంకాస్సేపు నన్ను తిట్టింది. నేనలా ఏడుస్తూ కూర్చున్నాను. తిట్టితిట్టి అలసిపోయిందో ఏమో అత్తయ్య నా దగ్గరకు వచ్చి కూర్చుని నెమ్మదిగా నా తలనిమిరింది. నాకింకా ఎక్కువ ఏడుపువచ్చి వెంటనే అత్తయ్య ఒడిలోవాలి బావురుమన్నాను.

ఈసారి అత్తయ్య నన్ను ఓదార్చింది. "పిచ్చిపిల్లా........నీ బాగుకోరేదాన్ని కాబట్టి ఇలా కఠినంగా మాట్లాడవలసి వచ్చింది. యుక్తాయుక్త జ్ఞానం తెలియని వయసుకాబట్టి నువ్వు తప్పుదారిన నడుస్తున్నావు. నువ్వు అమాయకురాలివని నాకు తెలుసు. అదే నా బాధకూడానూ........" అన్నది ఆమె ఓదార్పులోని సారాంశం.

ఆ తర్వాత అత్తయ్య నెమ్మదిగా నా దగ్గర్నుంచి వివరాలు లాబట్టింది. అతనెవరో తెలుసుకుంది. నేను హద్దులు అతిక్రమించ లేదని రూఢి చేసుకుంది. ఇకమీదట అతనితో తిరగవద్దని హెచ్చరించింది. అన్నింటికీ మౌనంగా తల ఊపాను.

"అలా ఊరికే తలూపడంకాదు. నేను చెప్పిందంతా గుర్తుంచుకోవాలి. రేపట్నించి నువ్వు తిన్నగా కాలేజీకి వెళ్ళి వదలగానే మళ్ళీ తిన్నగా ఇంటికి వచ్చేసేయ్. నువ్వు బుద్ధిమంతురాలివనీ మళ్ళీ నాచేత చెప్పించుకోవనీ నమ్ముతున్నాను. ఇంకో సారిలాంటి పొరపాటు జరిగితే మాత్రం నువ్వు చదువు మానేసి మీ ఇంటికి వెళ్ళిపోదువుగాని" అంది అత్తయ్య. దానికికూడా నేను మౌనంగానే తలూపాను.

# 16

అత్తయ్య మాటలు నేను తూచా తప్పకుండా పాటించాను. అసలు అత్తయ్య చేత మాటపడేలా ప్రవర్తించినందుకు నామీద నాకే అసహ్యంవేసింది. ఒక కన్నెపిల్లకు కలలుండడంలో తప్పు లేదు. ఆకలల్లోని మనిషి ఎదురుపడితే ఆకర్షణ పుట్టడం కూడా సహజం.

అతన్ని దగ్గరకు రానియ్యడం నేను చేసిన మొదటి తప్పు. ఆ తర్వాత అతనికి దగ్గరవడం అనుకోకుండా జరిగిపోయిన రెండో తప్పు. ఈరెండు తప్పులూ మాఇద్దరిచేతా ఇంకాఎక్కువ తప్పులు చేయించ లేదంటే అదినాఅదృష్టంకాదు. శేషగిరి సంస్కారం. అప్పట్లో అతడిపట్ల నాకున్న ఆకర్షణ అతను సరైనరీతిలో ప్రోత్సహించినట్లయితే నేను శేషగిరికి పెళ్ళికానిభార్యను అయి ఉండేదాన్ని. ఒక విధంగా అతడి సంస్కారమే నా అదృష్టమైంది. ఇప్పుడు నేను శేషగిరి గురించి పట్టించుకోవడం మానేశాను. అతను నామనసంతానిండి ఉన్నాడు. అయినప్పటికీ అతను



కాలేజీగేటుదగ్గర కనబడగానే ఎరగని వ్యక్తిని చూసినట్లుగా వెళ్ళిపోతున్నాను. నన్నెలాకలుసుకోవాలో, నాతో ఎక్కడ మాట్లాడాలో తెలియక అతను తపించిపోతున్నాడని అతని అందమైన కళ్ళు చూసి గ్రహించాను. అతడి కళ్ళు చూసినప్పుడల్లా నాకు బాధగానే ఉంటూంది.

అవంటే నాకు చెప్పలేనంత ఇష్టం. వాటిని నా పెదాలతో స్పృశించి ముద్దుపెట్టుకోవాలన్నది నాలో గాఢంగా నానాటికీ పెరిగిపోతున్నకోరిక. ఆకోరికను ఏదో ఒకరోజున ఈపాటికే తీర్చుకుని ఉండేదాన్నే! కానీ ఆలివపక్కన ఆ మగవాడు చూపే నిగ్రహం నాకు సవాలుగా నిలిచి నాకోరికను పక్కకునెట్టేది.

నన్ను కలుసుకుని మాట్లాడే అవకాశం నేనతనికివ్వడంలేదు. నాలో ఏదో మార్పు వచ్చిందని గ్రహించిన అతను అందుకుకారణం తెలుసుకోలేక కలవరపడుతున్నాడు.

ఇదీ ఒకందుకు మంచిదే అనిపించింది నాకు. కొంత కాలంపాటు అతడి కనుసన్నల్లో మెలగి అతనికి అలుసైపోయాను. ఇప్పుడు మళ్ళా అతడికి నాపట్ల ఆకర్షణ పెరిగి ఉండాలి.

* * *

ఆరోజు కాలేజీనుంచి నేను ఇంటికి రాగానే హాల్లో సోఫాలో కూర్చుని ఉన్న శేషగిరి కనబడ్డాడు. అతన్ని చూస్తూనే నేను భయపడ్డాను. అతనిలా మాఇంట్లో ఎదురు పడతాడని నేనూహించ నైనా ఊహించలేదు.

ఇప్పుడు అత్తయ్య అతని గురించి అడుగుతుంది. ఏం చెప్పాలి ?.

అప్పుడు హాల్లో ఇంకెవ్వరూలేరు. త్వరగా అతన్ని సమీపించి "ఇక్కడికెందుకొచ్చావ్!" అనికంగారుగా అడిగాను. వీలైనంత తొందరగా అతన్ని పంపివేయాలన్నది నాఅభిమతం. అతను ఏదో చెప్పాలని నోరు విప్పాడు కానీ ఆగిపోయాడు.

"అతన్ని నేనే రప్పించాను" అన్నమాటలువిని వెనక్కు తిరిగి చూసాను.

చేతిలో మంచినీళ్ళగ్లాసుతో అత్తయ్య! నిశ్చేష్టురాలినై పోయాను.

"నువ్వు లోపలకువెళ్ళు. నేనిక్కడ చాలా విషయాలు మాట్లాడాలి!" అంది అత్తయ్య.

నేనునాగదిలోకి వెళ్ళిపోయాను కానీ నాదృష్టంతా హాల్లోని ఆషోషాచుట్టూ పరిభ్రమిస్తోంది. అక్కడ అత్తయ్య, శేషగిరి ఏంమాట్లాడుకుంటున్నారో తెలుసుకోవాలని నామనసూరికే కుతూహలపడుతోంది.

అత్తయ్య ఎంతమంచిది!! నేను శేషగిరితో తిరుగుత న్నందుకు తనకు నామీద కోపంవచ్చిందని మాత్రమే నేననుకున్నాను. అంతేగానీ ఇలా శేషగిరిగురించి ఆరాతీసి అతన్నింటికి రప్పించి పెళ్ళివిషయాలు మాట్లాడే ప్రయత్నాలు చేస్తుందని నేను కలలో కూడా ఊహించలేను.

నా ఆలోచన లెంత తొందరగా పరుగెడుతున్నాయంటే అప్పుడే నేనూ, శేషగిరీ పెళ్ళిపీటలపై కూర్చుని ఉంటే అమ్మ, నాన్న, అత్తయ్య, మామయ్య మాపై అక్షింతలు వేస్తున్నారు.

నేను శేషగిరితో ఏకాంతం కోసం ఆతృతగా ఎదురు చూస్తు న్నాను. అదికూడా లభించనే లభించింది. అప్పుడే నేను అతనితో "చాలాకాలంగా నా మనసులో ఉండిపోయిన కోరిక తీర్చుకునే క్షణం ఇంతకాలానికి వచ్చింది అన్నాను. "ఏమిటది?" ఒక్కసారి కళ్ళు మూసుకో". శేషగిరి కళ్ళు మూసుకున్నాడు. నేనతన్ని సమీపించాను. నా పెదాలతో అతడి నయనాలు స్పృశిస్తున్నానన్న భావనే నా శరీరాన్ని పులకరింతలకు గురిచేసింది.

"అతను వెళ్ళిపోయాడు." ఈ కంఠస్వరం అత్తయ్యది. ఆ మాట వింటూనే నా కళ్ళలో దృశ్యం మాయమైంది. ఊహ



ల్లోని అతనుకూడా వెళ్ళిపోయాడు. ఊహలో నా కోరిక తీరడానికి కూడా ఇంకా సమయం రాలేదు.

అత్తయ్య ముఖంలో చిరునవ్వులు చిందాయి. "ఈ రోజుల్లో కులం, మతం అంటూ పట్టుకు వేళ్ళాడ్డం చాలా తెలివి తక్కువ పని. మీ నాన్న ఏమంటాడో తెలియదుకానీ కుర్రాడు యోగ్యుడని నాకు అనిపించింది. ఏమో అనుకున్నానుగానీ నువ్వు తెలివైనదానివే! మంచివాణ్ణే వెతుక్కున్నావు."

"నాకు సిగ్గు వేస్తోంది. ఏం మాట్లాడకుండా అత్తయ్య మాటలు వింటున్నాను."

"మీ నాన్నను ఒప్పించడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఒప్పుకోక పోవడానికి మాత్రం ఇందులో ఏముందిలే. అతడికి నా అన్నవాళ్ళెవ్వరూ లేరు. నెలకుసుమారు ఎనిమిదొందలు వచ్చే ఉద్యోగం ఉంది. అన్నిటికీ మించి మనిషి చాలా మంచివాడు. కట్నం అక్కరలేదుట. పెళ్ళి చేసుకోవడం కోసమే నీతో పరిచయం చేసుకున్నాడు" అంది అత్తయ్య మళ్ళీ.

పిడుగుపడ్డట్లు ఉలిక్కిపడ్డాను. అతనికి ఉద్యోగమా? అంటే తలిదండ్రులను తెగతెంపులు చేసుకున్నాడా? అతను నాతో రెండు కాళ్లున్నాయనీ అస్తమానూ పెద్దవాళ్ళు తనకవి అందుబాటులో ఉంచరనీ చెప్పాడు. తన తలిదండ్రులు వ్యాపారస్థులని చెప్పాడు. అతనికి నా అన్నవాళ్ళెవ్వరూ లేరని అత్తయ్య అంటోంది. నేను కొద్దిరోజులుగా ముభావంగా ఉండడం చూసి అతను ఇక లాభం లేదని పెళ్ళి విషయం తలిదండ్రులతో మాట్లాడి ఉంటాడు. వాళ్ళు దెబ్బలాడి ఉంటారు. ఇతను తెగతెంపులు చేసుకుని ఉంటాడు.

"అతనికి ఉద్యోగమన్న విషయం నాకు తెలియదత్తయ్యా! కొత్తగా చేరాడా?" అనడిగాను.

"కొత్తగా చేరడమేమిటే. మూడేళ్ళనుంచీ చేస్తున్నాట్ట. ఆర్నెల్లక్రితమే పెర్మనెంటు కూడా అయ్యాట్ట, అయితే ఇవేమీ తెలుసుకోకుండానే ఇన్నాళ్ళూ నువ్వతనితో తిరుగుతున్నావా?" అంది అత్తయ్య.

అత్తయ్య మాటలకు నాభయం ఇంకా పెరిగింది. అతను ఉద్యోగం చేస్తున్నాడన్న విషయం నాకు తెలియలేదు. ఆ విషయా న్నతను దాచిపెట్టాడు. అత్తయ్యతో అతను ఇంకే విశేషాలూ చెప్పలేదు. రెండు లక్షల పెళ్ళి ఖర్చు గురించీ, తను చేయబోయే వ్యాపారం గురించీ, తలిదండ్రులతో రానున్న సమస్యల గురించీ ఏమీ మాట్లాడలేదు. మూడు సంవత్సరాలనుంచి ఉద్యోగం చేస్తున్నాననీ, తనకెవ్వరూ లేరనీ చెప్పాడు. ఇందులో ఏది నిజం? అతను నాతో అబద్ధం చెప్పాడన్న అనుమానం నాలో పుట్టి పెరిగి పెద్దదవుతోంది. నేను మోసపోయానన్న భావన నన్ను నిలువునా కదిలిస్తోంది. ఈ విషయాన్నిక్కడ ఆగనివ్వకూడదు. వెంటనే వెళ్ళి నిజమేమిటో తెలుసుకోవాలి.

"ఏమే మాట్లాడవు? అతని ఉద్యోగం గురించి నీకు నిజంగా తెలియదా?" అత్తయ్య రెట్టించింది.

"తెలియదత్తయ్యా. అతనిది మన కులం కాదనికూడా నువ్వు చెప్పేవరకూ నాకు తెలియదు" అన్నాను ఇంకా ఆలోచిస్తూ. అతను చెప్పిన అబద్ధాల గురించి అత్తయ్యకు తెలియనివ్వకూడదు. తర్వాత అతన్ని కలుసుకుని అసలు విషయం తెలుసుకోవాలి. ఆ తర్వాతనే పెళ్ళి ప్రసక్తి!

"బాగుంది వరస. కులం మనది కాకపోతే యేంలే?" అని అత్తయ్య ఏమో చెప్పబోయింది.

"చిన్నతనం వల్ల నేను చాలా పెద్ద పొరపాటు చేశాననిపిస్తోం దత్తయ్యా. నాకేమిటో భయంగా, గాబరాగా ఉంది. మొదట్లో ఇవన్నీ నేనాలోచించుకోలేదు. పిచ్చిదానిలా ప్రవర్తించాను. నన్ను బాగా ఆలోచించుకోనీ అత్తయ్యా! మాది పెద్ద కుటుంబం. నాకింకా పెళ్ళి కావలసిన చెల్లెళ్ళున్నారు" అన్నాను.

అత్తయ్య నావంక విచిత్రంగా చూసింది. "ఇప్పుడా ఇవన్నీ ఆలోచించుకోవడం,"



"అవునత్తయ్యా. తెలిసో తెలియకో, చిన్నదో పెద్దదో ఓ తప్పు చేశాను. దీని గురించి ఈవేళా రేపూ బాగా ఆలోచిస్తాను. ఆ తర్వాత నాకేమనిపించిందో చెబుతాను. ఈ పెళ్ళి నా కిష్టం లేని పక్షంలో నువ్వే నన్ను ఏ గొడవా లేకుండా రక్షించాలి. ఇక ఎదట నీకు చెప్పకుండా, నీకు తెలియకుండా పెన్నులో ఇంకుకూడా పోసుకోను" అన్నాను కంగారుగా.

"పిచ్చిపిల్లా" అని నిట్టూర్చింది అత్తయ్య. "నువ్వు చెప్పిందీ నిజమే బాగా ఆలోచించుకో. కులాంతర వివాహాల్లో తప్పులేదు కానీ ఆడపిల్లలెక్కువగా ఉన్న ఇళ్ళలో అది కాస్త ఆలోచించుకోవలసిన విషయమేమరి" అంది అత్తయ్య.

* * *

అనుకున్నట్లుగానే మధ్యాహ్నం కాలేజీగేటు దగ్గర శేషగిరి కనిపించాడు.

ఇద్దరూ కలిసి కాస్త దగ్గర్లో ఉన్న పార్కుకి వెళ్ళాం. ఆ సమయంలో పార్కు నిర్మానుష్యంగా ఉంది. ఇద్దరం ఓ చెట్టు నీడకు చేరాం.

"నువ్వు నాకు అన్నీ అబద్ధాలే చెప్పావు" అన్నాను నేను.

"అన్నీకాదు. కొన్ని మాత్రమే అబద్ధాలు" అన్నాడతను.

"కత్తితో కాళ్ళను గాయపరిస్తే వైద్య సహాయంతో బాగు చేయించుకోవచ్చు. గుండెల్లో పొడిస్తే మనిషి బ్రతకడు. నీ ఆస్తి గురించి నువ్వు చెప్పిన అబద్ధం అలాంటిది. అది నా కలల్నీ, ఆశల్నీ, కోరికల్నీ అన్నింటినీ చంపేసింది" అన్నాను.

"నన్ను క్షమించు సుమా!" అన్నాడు శేషగిరి.

"ఎందుకు చెప్పావీ అబద్ధాన్ని!" తీవ్రంగా అడిగాను.

"నీ క్లాస్‌మేట్ అరుణ నాకు బాగా తెలుసు. నిన్ను గురించి ఆమె ద్వారానే తెలుసుకున్నాను. తన క్లాసులో అప్సరలాంటి అమ్మాయుందనీ దరిద్రమున్నా, పేదవాళ్ళన్నా ఆమెకు అంతులేని

అసహ్యమనీ ఆమె నాకు చెప్పింది. కుతూహలం కొద్దీ నిన్ను చూశాను. ఆ తర్వాత నాకు తెలియకుండానే నేను నీ ప్రేమలో పడ్డాను. నువ్వులేకపోతే బ్రతకలేననిపించింది, నీతో పరిచయం చేసుకోవాలంటే ధనవంతుడిలా మసలడ మొక్కటే మార్గమని పించింది, అందుకే అబద్ధం చెప్పాను."

నా శరీరం కుతకుత లాడిపోయింది, అయితే అరుణకు శేషగిరి గురించి అంతా తెలుసన్నమాట. అది శేషగిరికి సహకరించి మిత్రద్రోహం తలపెట్టింది నాకు.

"నన్ను క్షమించలేవా సుమా!" అన్నాడు శేషగిరి.

"పేద వాళ్ళంటే నాకు అసహ్యమని తెలుసు. ఎప్పటికైనా నీసంగతి నాకు తెలియక తప్పదనీ తెలుసు. అలాంటప్పుడు ఎందుకిలాంటి అబద్ధం చెప్పావ్!" కోపంగా అడిగాను.

శేషగిరి గొంతుసవరించుకుని "నేను పేదవాడినా? అలాగని ఎవరంటారు? నెలకు ఎనిమిదొందలు వచ్చే ఉద్యోగముంది. డబ్బు దుబారా చేసే చెడు అలవాట్లులేవు. వెనకాముందూ ఎవరూ లేరు. పెళ్ళిళ్ళ బజార్లో నాకు చాలా విలువ ఉంది. కట్నం కావాలంటే పదిహేనువేలకు పైగా పలుకుతుంది. నేను లక్షాధికారిని కాకపోవచ్చు. కానీ పేదవాడిని మాత్రం కాదు" అన్నాడు.

"కావచ్చు. అయితే కోటేశ్వరరావుకూడా నీలాంటివాడే. చెప్పాలంటే అతను నీకంటే మెరుగు. అతనికీ నాకూ కులం కలిసింది: అతనికి నాఅన్నవాళ్ళున్నారు. ఆస్తికూడా ఉంది. అతన్నెందుకుకాదన్నాను? జీవితంగురించి నేను కంటున్న కలలు వేరు. కార్లలో ప్రయాణం, క్లబ్బుల్లో విహారం, అనుదినం షాపింగు, నగలషాపుల్లో అడుగుపెట్టగానే నమ్రతగా ఒరిగిపోయే మనుషులు ఇంట్లో పనివాళ్ళు ఎన్నని చెప్పను? నా కలలన్నీ నీకళ్ళలో ప్రతిఫలించాయి. మోసపోయాను."

"అలాగనకు సుమా! కోటేశ్వరరావు కథ విన్నాకనే నేను నీకోసం ఈనాటకం ఆడాను. అనుభవంలేని నీకు అర్థంలేని



కలతో నిన్ను నీవే మోసం చేసుకుంటూ. చక్కని భవిష్యత్తును చేసుకుంటున్నావనిపించింది.

మనం ఒకరినొకరు ప్రేమించుకున్నాం. మనకున్న కర్యాలతో మనం ఎంతోహాయిగా జీవితాన్ని గడపవచ్చు. నీ కలకు కారణం నీబుద్ధి ఇంకా వికసించకపోవడమే. నీకోరికల్లో వ్వనుకునే సుఖంలేదు. నేనాడిన అబద్ధాలకు నన్ను క్షమించు. ప్రేమను పొందడంకోసమే అబద్ధమాడాను నేను. ఒకసారి ప్రేమలభించేక నేను చేసిన ఎంత పెద్ద తప్పునైనా నువ్వు మించగలవని నేననుకున్నాను. అందమైన నీకళ్ళలో ఒక్కసారి పట్ల ప్రేమ, జాలి ప్రతిఫలించనీ" అన్నాడతను జాలిగా ముఖం ట్టి.

"అలా ఎన్నటికీ జరుగదు. మనపరిచయం ఒకరోజుదికాదు. లతరబడి తిరిగాం. ఒక్కసారి నువ్వు నిజాన్ని చెప్పడానికి యత్నించినా ఎంతోబాగుండేది" అన్నాను.

"ఒక్కసారి ప్రయత్నించానుసుమా! కానీ ఆరోజు ప్రోత్సాహం లభించక ఎంతగానో నిరుత్సాహ పడిపోయాను. గుర్తుందా? ఒకరోజు నేనునీకోసం నాతలిదండ్రులను లిపెట్టి చిన్న ఉద్యోగంలో జేరిపోతానన్నాను. నువ్వు సరేనంటా ఎంతో ఆశగా ఎదురు చూశాను. కానీ"

"అప్పుడైనా నాకోర్కెల బలం నీకు తెలియలేదా శేషగిరీ!"

"తెలిసింది. కానీ ప్రేమపూరితమైన మనసు ఎంతటి ప్పునైనా క్షమించగలదని ఆశపడ్డాను"

"ప్రేమ మోసాన్ని క్షమించదు" అన్నాను. ఇప్పుడు కు అతనిపట్ల అసహ్యం కలిగి పెరుగుతోంది. ఒక అందమైన ళ్ళున్న వ్యక్తి చేసిన తప్పును నేను క్షమించలేక పోవడం ఇదే మదటిసారి! అంతేకాదు. ఆ కళ్ళున్న ముఖాన్ని నేనిప్పుడు

ద్వేషిస్తున్నాను. కళ్ళుచూపి మోసపోయాను అనుకుంటూ అతని
వంక సూటిగా చూశాను.

అందమైన నా కళ్ళలో ద్వేషమా? అసహ్యమా?

ఎందుకో ఉలిక్కిపడ్డాను నేను. కానీ అతని వంక అలాగే
చూడడం మాత్రం మానలేదు. నా చూపుల్ని భరించలేకనో ఏమో
అతను మారు మాట మాట్లాడకుండా తలెత్తి చూడకుండా అక్క
ణ్ణించి లేచి వెళ్ళిపోయాడు. నా మనసు పాడైపోయింది. మెద
డంతా గజిబిజిగా ఉన్నట్లనిపిస్తోంది.

శేషగిరి నా కళ్ళలో ద్వేషాన్నీ, అసహ్యాన్నీ చూశాడు.
అందమైన నా కళ్ళకు అవి నప్పలేదన్నాడు. ఆ దృశ్యం సహించ
లేక వెళ్ళిపోయాడు.

అయితే నేనెంతగానో ప్రేమించే కళ్ళ అందంలో ఏ
విశేషమూ లేదా? పరిస్థితుల ప్రభావానికి లోనైనప్పుడు ఎంత అంద
మైన కళ్ళైనప్పటికీ అవి మామూలు కళ్ళకువలెనే చూస్తాయా?

నేను మంచిదనుకున్న కళ్ళు నన్ను మోసం చేశాయి.
అందమైన వనుకున్న నా కళ్ళలో అసహ్యం, ద్వేషం కూడా ప్రతి
ఫలించబడ్డాయి. కళ్ళు మనిషి శరీరంలోని ఒకభాగం మాత్రమే.
మెదడు ఇచ్చే ఆజ్ఞల ననుసరించి అవి ప్రవర్తిస్తాయి. నేను
గ్రహించిన ఈ సత్యం నాకు సంతోషాన్ని కలిగించలేదు. బరు
వెక్కిన మెదడులో పార్కునించి తిన్నగ కాలేజీకి వెళ్ళకుండా
ఇంటికి వెళ్ళిపోయాను.

అత్తయ్య దగ్గరకు వెళ్ళి "చాలా పొరపాటు చేశాను.
ఇంకెప్పుడూ ఇలాంటిది జరుగనివ్వను. శేషగిరితో పెళ్ళి నాకు
ఇష్టం లేదు." అని చెప్పేసి ఆవిడ ప్రతిభావాలను పట్టించుకోకుండా
నా గదికి వెళ్ళిపోయాను.

# 17

శేషగిరి ప్రకరణం నా జీవితంలో చాలా మార్పులు తీసుకొచ్చింది.
నాలోని చలాకీతనం పోయింది. అరుణతో స్నేహం తగ్గి



ను. చదువుమీద శ్రద్ధ పెంచాను. కాలేజీ, ఇల్లు మినహాయించి
రో చోటకు వెళ్ళడంలేదు. నాలోని మార్పు అత్తయ్యను కొంత
వర పెట్టింది. "చిన్నపిల్లవి, మరీ ఇంత గంభీరంగా ఉండ
దదు" అని అప్పుడప్పుడు అత్తయ్య నాదగ్గర అనేది.

"చిన్నపిల్లను కాబట్టే భయపడుతున్నా నత్తయ్యా! మొద
ంచీ నీ సలహా పాటించి ఉంటే అసలే ఇబ్బంది ఉండేదికాదు
ు. జీవితంలో నేర్చుకోవలసిన పాఠాలన్నీ నీ దగ్గరే నేర్చు
ంటాన్నేను." అని నేననగా అత్తయ్య సంతోష పడేది.

చూస్తూండగానే నా బియే; చదువు ముగిసింది. పెళ్ళి
రుతో వాళ్ళు నన్ను కాల్చేస్తారని నేను భయపడుతున్న
మయంలో అదృష్టం నన్ను కాస్తగానైనా కరుణించింది. బియ్యే
్యాసైన రెండు నెలలకే హైదరాబాదులో ఓ ప్రయివేట్ కంపెనీలో
్యోగం వచ్చింది నాకు.

"నీకుద్యోగం రావడంలో ఆశ్చర్యమేముందే? ఏ బాస్కైనా
జూ నిన్ను అలా చూస్తూండిపోవాలనే ఉంటుంది" అంది
రుణ. దానికి బియ్యే పరీక్షలు రాయగానే పెళ్ళి అయిపోయింది
ళ్ళ బావతో. వెంటనే కాపురానికి వెళ్ళిపోయింది కానీ ప్రస్తుతం
షాఢమాసం పేరు చెప్పి ఇక్కడే ఉంది.

నా ఉద్యోగం గురించి ఇంట్లో పెద్ద రభస జరిగింది. ఈడొ
్చిన ఆడపిల్ల నొక్కర్తినీ ఉద్యోగం పేరు చెప్పి పొరుగూరికి
ా పంపిస్తానంటుంది అమ్మ. నాన్న కలగజేసుకుని "నీకు పెళ్ళి
యకపోతే అంతా నన్నాడి పోసుకుంటారమ్మా నీ జీతపు రాళ్ళకు
వడి నిన్నుద్యోగంలో జేర్పించామని కూడా అనుకుంటారు"
న్నాడు.

"అంటే నేను నీ కూతుర్నికాదు కొడుకుననుకో" అన్నాను.

నాన్న నన్నేమీ అనలేదు. అదాయన బలహీనత. నన్నెన్నీ
నగల అమ్మ నన్నాపలేదు. అదావిడ బలహీనత. ఈ ఇద్దరి

బలహీనతల్ని ఆధారంగా చేసుకుని నేనీ ఇంట్లో స్వేచ్ఛావిహారం చేస్తున్నాను.

అయినా నా వయసింకా ఇరవై ఏళ్ళే! నాన్న నాదగ్గర బాధగా "ఆడపిల్ల పెళ్ళికి ఓ వయసంటూ ఉందమ్మా ఏ వయసు ముచ్చట ఆ వయసులో జరగాలి. నువ్విలా ఎంతకాలం పెళ్ళిచేసుకోకుండా ఉంటావు?" అన్నాడు.

నాన్న కళ్ళల్లోకి చూస్తే నాకు బాధ వచ్చింది. ఆయన్నిబ్బంది పెట్టడం నాకు భావ్యం కాదనిపించింది. "సరదాగా రెండేళ్ళు. ఉద్యోగం చేయాలనుంది నాన్నా! ఆ రెండేళ్ళైపోయాక మీ ఇష్టం. మీరు ఎవరిముందు తలవంచమంటే వాళ్ళముందు వంచుతాను. రెండంటే రెండేళ్ళు'' అన్నాను.

నాన్న ముఖంలో ఉత్సాహం కనబడింది. ''అంతే చాలు. అన్నమాట మీద నిలబడాలి'' అన్నాడు.

"అలాగే!" అన్నాను భయంగా. నేనిచ్చిన గడువు చాలదేమోనన్న భయం నన్నావహించక పోలేదు. రెండుకు బదులు మూడనో, నాలుగనో అనవలసింది.

ఏది ఏమైనా ఓ మంచి ముహూర్తాన నా హైదరాబాదు ప్రయాణం జరిగింది.

*　　　*　　　*

ఉద్యోగం బాగానే ఉంది. బాస్ చాలా మంచివాడు. ఆయన పేరు గోపాలకృష్ణ. కానీ గోపాలకృష్ణుడి బుద్ధులు నాకాయనలో ఏకోశాన కనపడలేదు. నేను కోరే అందమైన కళ్ళు లేకపోయినా ఆఫీసరు స్వంతకారులో వస్తాడాయన. కానీ బాస్ బ్రహ్మచారికాడు. వయసు ముప్పై. వివాహమైంది. భార్య నా అంత అందమైనది కాకపోయినా బాగానే ఉంటుంది. ఆయన కిద్దరు పిల్లలు. ఇద్దరూ మగవాళ్ళే! బాస్‌కు ఒక అందమైన బంగళా ఉంది. అదాయన స్వంతం. ఆ ఇంట్లోనే నాకో గది ఇచ్చాడు బాస్. ఈ గది సదుపాయాల్లో అత్తయ్య ఇంట్లో గదిలాగునే ఉంది.

అత్తయ్య ఇంట్లో మూడేళ్ళుండడం నాకు బాగానే ఉపయోగించింది. బాస్ ఇంట్లో చాలా ఫ్రీగా మసల గలుగుతున్నాను నేను. బాస్ భార్య మాలతి మొదట్లో నేనంటే ఇష్టపడేది కాదుగానీ తర్వాత తర్వాత నాకామె మంచి స్నేహితురాలయింది, ఒక విధంగా చెప్పాలంటే నా జీవితంలోని శేషగిరి ప్రకరణం కూడా నాకు బాగా ఉపయోగపడింది. నా గాంభీర్యం నాకు మగవాళ్ళలో మంచి పేరునీ, ఆడవాళ్ళతో స్నేహాన్నీ తెచ్చిపెడుతోంది.

హైదరాబాదు వెడుతూనే నేను హోటల్లో దిగాను. బాస్ నాకు తన ఇల్లు ఆఫర్ చేశాడు. నేను మొహమాట పడితే అద్దె ఇల్లు దొరికేదాకా ఉండమని చెప్పాడు.

బాస్ మంచివాడేనని నాకు తెలుసు. అతని మనసులో ఏ విధమైన దురూహలూ ఉండకపోవచ్చు. అయినప్పటికీ కూడా అతను నాపట్ల చూసే సుహృద్భావానికి కారణం నా అందమేనని నేను అర్థం చేసుకోగలను.

గడ్డి పువ్వును మనం ఏమాత్రం పట్టించుకోము. కాలితో తొక్కామని బాధపడము. ఆ గడ్డిపువ్వులోని అందాన్ని ఏ వర్డ్స్‌వర్త్ లాంటి కవీశ్వరుడో తప్ప చూడలేడు. కానీ గులాబిలాంటి పువ్వును ప్రతి సామాన్యుడు గుర్తించగలడు. వారిలో కొందరు ఆ పువ్వులను పిండి సెంటు తీసి వ్యాపారం చేస్తారు. కొందరు నలిపి ఆఘ్రాణించి ఆనందిస్తారు. కొందరు చూసి ఆనందిస్తారు. కొందరు షో కేసుల్లో పెట్టి ఆనందిస్తారు. వీరిలో చూసి ఆనందించే వారే ఎక్కువ. నా సౌందర్యం సామాన్యమైనదైతే బాస్ నాకు ఇల్లిచ్చి ఉండేవాడుకాడు. నాకు ఇల్లు దొరికింది అద్దె లేకుండా!

ఆఫీసులో నాపని నేను చూసుకునేదాన్ని. ఇంటి వద్ద పుస్తకాలు చదవడంలో నిమగ్నురాలినై ఉండేదాన్ని. ఆఫీసు, ఇల్లు తప్ప మరోలోకం ఉండేదికాదు నాకు.

మాలతి నాకు స్నేహితురాలు కావడానికి ఎంతోకాలం పట్టలేదు. నెలరోజుల్లోనే ఆ ఇల్లు నాకు శాశ్వత నివాసమైపోయింది

మాలతి పట్టుదల కారణంగా. మాలతి తనను అక్క అని పిలవ మంది. "వదినా అని పిలుస్తాను" అన్నాను.

మాలతి నాకింకా స్నేహితురాలైపోయింది. ఆమె పిల్లలు క్రమంగా నాకు సన్నిహితులయ్యారు. వాళ్ళు నన్ను ముద్దుగా అత్తా అనిపిలుస్తూండేవారు. రెండుమూడు నెలల్లోనే గోపాల కృష్ణ సెంటిమెంట్సు మారాయి. ఆయనిప్పుడు నన్ను ఎవరికైనా "షి ఈజ్ మై సిస్టర్!" అని పరిచయం చేస్తున్నాడు.

గోపాలకృష్ణను చూసినప్పుడల్లా నేను కలల్లో తేలిపో తుంటాను. నేను కోరుకున్నది అలాంటి జీవితమే! అందమైన బంగళా. స్వంతకారు. ఉద్యోగంతో నిమిత్తంలేని ఆస్తి.

ఆఫీసులోకూడా నాకు చాలామంచి పేరు వచ్చింది. మగ వాళ్ళ దగ్గర నేను సౌందర్యాతిశయాన్ని ప్రదర్శించకుండా ఆత్మీయు రాలిలా మసలేదాన్ని. నిజం చెప్పాలంటే మగవాళ్ళు చెడ్డవాళ్ళు కారు. వాళ్ళలోని చెడ్డతనాన్ని ప్రోత్సహించేది ఆడవాళ్ళేనని నాకు అనిపిస్తూంటుంది.

ఇన్నేళ్ళ అనుభవంలో నాలోని అహంకారం బాగా తగ్గి పోయింది. కానీ నాలోని కోరికలు మాత్రం చావలేదు. ఆ కోరికలు గుర్తుకొచ్చినప్పుడల్లా నాకు నవ్వువస్తూంటుంది.

కార్లలో తిరగాలని కలలు కంటూ నెలకు ఎనిమిదివందలు సంపాదించే ఉద్యోగంగల మగవాడిని వదులుకున్నాను నేను. ఆ తర్వాత మూడేళ్ళకు నేను చేస్తున్నది కూడా ఉద్యోగమే! నా చేతికొచ్చే జీతం ఆరొందలు. ఈడబ్బుతో నేను దర్జాగానే కాలం గడుపుతూ నెలకు నూటయాభై రూపాయలవరకు ఇంటికి కూడా పంపగల్గుతున్నాను.

కోటేశ్వరరావు నాగురించి అవివాహితుడుగా ఉండిపోయి నట్లు తెలిసింది. నా బియ్యే పరీక్షలు కాగానే అతన్నించి కబురు వచ్చింది. నేను మళ్ళీ నిరాకరించాను. అలాగని నాకతనంటే ఇష్టం లేదని చెప్పలేదు. ఇంకో రెండేళ్ళవరకు పెళ్ళి చేసుకునే



...ద్దేశ్యంలేదని చెప్పాను. కోటేశ్వరరావులో ఆశ ఇంకా చావలేదను ...ంటాను. అతనీ రెండేళ్ళూకూడా వేచి ఉండడానికే నిశ్చయించు ...న్నాడు.

నేను వివాహానికి సుముఖంగా ఉన్నానని తెలిసిన క్షణంలో ...ళ్ళీ అతనేనాకు సిద్ధమవుతాడేమో? కోటేశ్వరరావు నాగురించి ...దురు చూడడంవల్ల నాకింకో మంచివరుడు దొరుకుతాడన్న ...శనాకు లేకుండా పోయింది. నేను పూర్తిగా డబ్బుమనిషిననీ అందుకే అతన్ని నిరాకరిస్తున్నాననీ కోటేశ్వరరావుకు తెలియదు. తెలియజేసే అవకాశం అతను నాకివ్వలేదు.

కోటేశ్వరరావును గుర్తుచేసుకున్నప్పుడల్లా నాకు శేషగిరి కూడా గుర్తువస్తూంటాడు. శేషగిరి, కోటేశ్వరరావుల్లో నన్నెవరు ...క్కువగా ప్రేమిస్తున్నారన్న ఆలోచన నాక్కలుగుతూంటుంది.

నేనునాన్నకు పెట్టిన రెండుసంవత్సరాల గడువూ ఏవిశేషాలూ లేకుండానే అయిపోయింది. ఆవిషయాన్ని గుర్తు చేస్తూ నాన్న దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిన మర్నాడు నాజీవితం ఊహించని మలుపు తిరిగింది. అదీ నేను కోరిన విధంగా!

## 18

నాఎదురుగా ఉన్న ఫైలుమీద మనసు లగ్నం చేయాలని ఆఫీసులో వ్యర్థప్రయత్నం చేస్తున్నాను కానీ నాన్నరాసిన ఉత్తరం నా ఏకాగ్రతను భంగం చేస్తోంది.

నేనుపెట్టిన గడువైపోయింది కాబట్టి త్వరలో ఓనెలరోజులు సెలవుపెట్టి ఇంటికి రావలసిందిగా నాన్న రాశాడు. ఇంటి వద్ద నాతో మాట్లాడ వలసిన ముఖ్యమైన విశేషాలు చాలా ఉన్నాయట,

ఆ విశేషాలేమిటో నేనూహించుకోగలను, ఇంక నాపెళ్ళి జరగడం తప్పనిసరి! చివరికి నా ఆశలేమీ నెరవేరవా? నా కోర్కెలకు వ్యతిరేకంగా అతిసామాన్యమైన జీవితం గడపాలని

నాజీవితంలో రాసి ఉన్నదేమో ! ఈ దిగులుతో ఉన్న నేను హఠాత్తుగా అతన్ని చూచాను.

అతనెవరో చాలా గొప్పవాడిలాగున్నాడు. మా ఆఫీసుకు ఏదో పనిమీద వచ్చినట్లున్నాడు. అటూ ఇటూ తిరుగుతూ నన్ను చూసి చటుక్కున ఆగిపోయాడు. ఏమనుకున్నాడో ఏమో నా దగ్గరకు వచ్చి " మేడమ్ ఏమీ అనుకోనంటే ఒక చిన్న ప్రశ్న " అన్నాడు.

" ప్లీజ్ " అన్నాను.

" మీ పేరేమిటో చెప్పగలరా ? " అన్నాడతను.

" సుమలత ! " అన్నాను నెమ్మదిగా.

" పేరు అందమైనదే కానీ ముఖం ఇంకా అందంగా ఉంది " అన్నాడతను.

అతని చొరవకు నాకాశ్చర్యంవేసింది " చాలాథ్యాంక్స్ మీకేమైనా ఇక్కడ పని ఉందా ? " అన్నాను.

" ఉంది. కానీ మిమ్మల్ని చూడగానే మరిచిపోయాను. మీకు అభ్యంతరం లేదంటే " అని అతను ఎందుకో తటపటాయిస్తున్నట్లుగా ఆగిపోయాడు.

నేను కుతూహలంగా అతనివంక చూసి " లేదంటే ఊఁ " అన్నాను.

అతను నిట్టూర్చి " నా వయసు ఇరవై యారేళ్ళు. లెక్కలేనంత ఆస్తికి వారసుణ్ణి. మంచి అందమైన భార్యకావాలని ఎంతో కలలుకంటున్నాను. ఇంత వరకూ నాకలలు ఫలించలేదు " అంటూ మళ్ళీ మధ్యలో ఆగిపోయాడు.

ఈసారినాకు కుతూహలం కలగలేదు. కొద్దిగా భయం కూడా వేసింది. డబ్బున్న వాడెవడూ పనిగట్టుకుని తను లెక్కలేనంత ఆస్తికి వారసుణ్ణని చెప్పుకోడు. వీడెవడో నాబలహీనతను తెలుసుకుని వచ్చాడనిపించింది. మళ్ళా మరో శేషగిరి తయారవడం లేదుకదా అని కంగారుపడ్డాను. ఇలాంటి వాణ్ణి మొగ్గలోనే త్రుంచేయాలనిపించింది.



" మీ అభిప్రాయం నాకు అర్థమైంది. కానీ నేను మీ ...కున్న లాంటి మనిషిని కాను. నేను చూడగానే మనుషుల్ని ...చనా వేయగలను. మీ ముఖం చూశాను. మీకళ్ళు నాకు నచ్చ...ు. కళ్ళు బాగాలేని ఏమనిషైనా నాకు నచ్చడు " అన్నాను.

నేను మర్యాదనతిక్రమించి నట్లు నాకు తెలియకపోలేదు. ...యితే అతను కాస్త ఎక్కువగా చొరవ తీసుకున్నాడనిపించడం ...్ల నేనలా చేశాను.

నా సమాధానం వింటూనే అతనిముఖం వివర్ణమైంది ...చూడండి. ఇంతవరకు జీవితంలో ఓటమిఅన్నది ఎరుగను ...ు. ఏ నిర్ణయమైనా క్షణాలమీద తీసుకోవడం నా అలవాటు. ...మ్మల్ని చూసీ చూడగానే వివాహం చేసుకోవాలనిపించింది. ...దుకోసం ఏమైనా చేయగలను. ఒప్పుకోకపోతే బలవంతంగా ...త్తుకు పోయైనా వివాహం చేసుకోగలను. ఒప్పుకుంటే ఇప్పుడే ...క్షణంలో మీపేరే బ్యాంకులో లక్షరూపాయలతో అకౌంట్ ...పెన్ చేయగలను " అన్నాడు.

షాక్ తిన్నట్లయింది. ఏమిటితను మాట్లాడు తున్నది ?

నాకోసం కారుతీసుకు వచ్చాడు శేషగిరి. అయితే అదతని ...సొంతంకాదు. కానీ నేనునమ్మి అతనివెంటపడి చివరకు నిజం ...తెలుసుకున్నాను.

నాపేరున బ్యాంకులో లక్షరూపాయలకు అకౌంట్ ఓపెన్ ...స్తానంటున్నాడితను. ఈవ్యవహారంలో ఇంకమోసముండే ...అవకాశంలేదు. ఎటొచ్చీ ఇతడి మాటలకు భ్రమపడి ఇతను ...భాగ్యవంతుడని నమ్ముతానని భావిస్తున్నాడేమో ! అయినా ...కలకైనా అంతుండాలి. ఇతగాడి సంగతేమిటో వెంటనే ...తేల్చేయాలనుకున్నాను. అందుకే " అయితే నాపేరున లక్ష ...రూపాయలకు అకౌంట్ ఓపెన్ చేయండి. నేను మిమ్మల్ని వివాహం ...చేసుకుంటాను " అన్నాను.

ఆమాటలు నేను చాలాసులభంగా అనగలిగాను. అందుక్కారణం అతడు అబద్ధాలాడుతున్నాడన్న నానమ్మకమే ! ఏదో ఉపాయంతో ఈ సవాల్ నుంచి అతను తప్పించుకుంటాడని నా అనుమానం. అయితే ఈసవాల్‌ని స్వయంగా అతనే సృష్టించాడు. ఎవరైనాకోరి అలా ఎందుకు చేస్తారు ?

" మీ బాస్‌నడిగి పర్మిషన్ తీసుకోండి. ఇప్పుడేబ్యాంకుకి వెడదాం " అన్నాడతను.

నేను షాక్ తిన్నాను, " ఏ బ్యాంకులో ?" అనడిగాను. బహుశా బ్యాంకులా కనబడే ఓ ప్రాంతానికి తీసుకెళ్ళి అకౌంట్ ఓపెన్ చేసినట్లు నన్ను మభ్య పెడతాడేమో ; అలాచేయడం కోసం ముందుగానే ప్రిపేరై వచ్చాడేమో !

" మీరు కోరిన బ్యాంకులో ! " అన్నాడతను.

నా ఆశ్చర్యం ఇంకా పెరిగింది " అయితే స్టేట్ బ్యాంకుకు వెడదాం " అన్నాను. స్టేట్ బ్యాంకులో నాకు తెలిసిన గుమాస్తాలు కూడా ఉన్నారు,

" అలాగే ఏబ్రాంచో చెప్పండి. నాకార్లో వెడదాం ! " అన్నాడతను.

నా కిప్పుడు నిజంగా భయంవేసింది. అతడివంక భయంగానే చూశాను. నాకళ్ళకు అతడొక ముఠానాయకుడిలా గజదొంగగా, పరమ దుర్మార్గుడిలా కనిపించాడు.

అతడికూడా వెళ్ళడం చాలా ప్రమాదమనిపించింది. అందుకే అతనికి నేను చేరదల్చుకున్న బ్యాంకు చిరునామా ఇచ్చి " మీరక్కడకువెళ్ళండి. ఓ గంటలో నేనూ అక్కడకు వస్తాను " అన్నాను. నా మాటలకు అతను అభ్యంతరం చెబుతాడేమోననుకున్నాను కానీ అతను వెంటనేలేచి టైము చూసుకుని " సరిగ్గా గంటలో మీరక్కడకు వస్తారని నేనాశిస్తున్నాను" అని అక్కణ్ణించి వెళ్ళిపోయాడు. అప్పుడు నాగుండెలు వేగంగా కొట్టుకోడం ప్రారంభించాయి.

జరుగుతున్నది కలా, నిజమా అన్న సందేహం నాకు కలగడంలో ఏమాత్రమూ ఆశ్చర్యంలేదు అది నిజమని నేను నమ్మలేకపోవడంకూడా నాతప్పుకాదు. అది కలే అయుంటుందని సార్థి చేసుకుని " సరే ఈకల ఇలా ఎంతసేపు జరుగుతుందో చూస్తాను. మెలకువ వచ్చేవరకు ఈ తమాషా బాగానే ఉందికదా " అనుకున్నాను.

ఒకసారి నేను బ్యాంకు వంక పరీక్షగా చూశాను. అది నేనెరిగున్న బ్రాంచి. అక్కడున్న ఉద్యోగస్థులంతా నాకు పరిచితులు. అంతానావంక ఆశ్చర్యంగా చూస్తున్నారు. వంద, రెండు వందలకు మించి ఎన్నడూ చెక్ డ్రాచేయని ఒకసామాన్య వనిత ఈరోజు లక్షరూపాయలతో కొత్త అకౌంట్ ఓపెన్ చేయడం వారిఆశ్చర్యానికి కారణమనుకుంటాను.

అతను నాతో పరిహాసమాడలేదు. చెప్పే విషయం సీరియస్‌గానే చెప్పాడు. నిజంగానే ఆక్షణంలో నేను లక్షాధికారిణి అయ్యాను. ఫారాలమీద సంతకంపెడుతూంటే నా చేతులు వణుకుతూంటే అదుపు చేయడం కష్టమైంది.

" మీరు వేళాకోళంగా అన్నారనుకున్నాను. నిజంగానే అన్నంతపనీ చేశారు " అన్నాను నేను అతనివంక అదోలా చూస్తూ.

ఇప్పుడు నేను నిర్ణయం తీసుకోవలసిన సమయం ఆసన్నమైంది. నామెదడు చురుగ్గానూ, తీవ్రంగానూ పనిచేయసాగింది. నేనుకోరిన భోగభాగ్యాలు నావి కానున్న తరుణం ఆసన్నమైంది. ఇటువంటి అవకాశం వస్తే బాగుండునని ఇంతకాలమూ అనుకుంటున్నానుగానీ వస్తుందన్న నమ్మకంనాలో ఉన్నట్లులేదు. ఇప్పుడు నేనాలోచించుకోవలసిన విషయం ఒక్కటే. ఇతగాడికి నేనుకోరే అందమైన కళ్ళులేవు. కానీ డబ్బుంది.

అందమైన కళ్ళున్న శేషగిరి ప్రవర్తన ఎంత అందంగా ఉందో చూడనే చూశాను. అందువల్ల పురుషుడికది ఒక ప్రత్యేకతగా నేనుభావించనవసరంలేదు. అదీ కాక నేనాలోచించవలసింది నాగురించి, నాసౌభాగ్యంగురించి !

ఆలోచిస్తూంటే నాకు అర్థమైపోయింది, ఇంతకాలం నే నెదురు చూస్తున్నది అందం కోసం కాదు, డబ్బుకోసం. నేను కోటేశ్వర్రావుని కాదన్నది డబ్బు కోసమే. కోటేశ్వరరావు, శేషగిరులలో శేషగిరి నెన్నుకున్నది డబ్బుకోసమే. నేను కోరే వరుడిలో అందంకూడా కావాలన్నది ఇంతకాలం నేననుకుంటున్న భ్రమ మాత్రమేనని తెలిసిపోయింది.

నేను అతనివంక కృతజ్ఞతతో చూశాను, ఆ చూపులతనికి నా అభిప్రాయాన్ని తెలిపాయి, అప్పటికి నేను అంతకుమించి ఏమీ మాట్లాడలేదు, అతనూ నన్నడగలేదు.

ఆరోజే నాన్న కుత్తరం రాశాను. "మీకే విధమైన ఇబ్బందీ లేకుండా నా వరుణ్ణి నేనే ఎన్నుకున్నాను, అతను యువకుడు, వయసు ఇరవైయారేళ్ళు, అంతులేని సంపదకు వారసుడు, సమాజంలో పెద్ద హోదా గలవాడు, ఇంకా వివాహం కాకుండానే అతడు నా పేరున బ్యాంకులో లక్షరూపాయలు వేశాడు. అతని కులగోత్రాలు నాకు తెలియవు, వాటితో నాకు నిమిత్తమూ లేదు, ఈ వివాహం ద్వారా ఎవరికీ ఏ ఇబ్బందీ ఉండదు, మనదేశంలో కులగోత్రాల పట్టింపుకు పేదరికమే కారణం. డబ్బున్న వాళ్ళనవి బాధించవు, ఈ వివాహం ద్వారా నా భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవడమే కాక మన కుటుంబాన్ని కూడా ఉన్నత స్థానానికి తీసుకు రాగలనన్న నమ్మకం నాకుంది, ఒక్కసారి మీరిక్కడకు బయల్దేరి రావలసిందని కోరుతున్నాను."

ఈ వివరాలతో నేను వ్రాసిన ఉత్తరం అందుకుని అమ్మా, నాన్నాకూడా కదలివచ్చారు, ఇద్దరం రావడం కంగారుగానే వచ్చారు, రాగానే వారిని బ్యాంకుకు తీసుకు వెళ్ళి నా అకౌంట్ వివరాలు చూపించాను, అప్పటికే వారికి నోటమాటరాలేదు,

మేము వాళ్ళింటికి వెళ్ళాం. ఆ. ఇల్లు, అక్కడి వ్యవహారం చూసి అమ్మ, నాన్న హడిలిపోయారు, అక్కడ వాళ్ళిద్దరికీ గొప్ప మర్యాదలు జరిగాయి.

కాబోయే అత్తమామలకు అతను జరిపిన సత్కారం ఇంకా గొప్పది, ఇద్దరికీ పట్టుబట్టలుకాక అమ్మకు నాలుగుపేటల చంద్రహారం కూడా ఇచ్చాడు. అమ్మకు నోటమాట రాలేదుకానీ నాన్న మాత్రం చాలా మొహమాట పడ్డాడు, "మీరు కాదనకూడదు, మా సంప్రదాయం ఇది'' అన్నాడతను.

అక్కణ్ణించి వచ్చాక కులం, సంప్రదాయం గురించి అమ్మ నడిగాను. అమ్మ మాటలు వింటూంటే ఇప్పుడు నేనభ్యంతర పెడితే మెడలువంచి మరీ పెళ్ళి చేసేలా ఉంది, ఈ పర్యాయం ఆవిడ నా అభ్యంతరాల్ని సహించే స్థితిలోలేదు, కాబోయే అల్లుడి వైభవం ఆవిడకు మతిపోగొట్టింది, అతను డబ్బుతో నన్ను, మా వాళ్ళను కొనేశాడు, డబ్బుకు అమ్ముడుపోవడం నాకూ ఇష్టమే, అందుకే సరిగ్గా పదిరోజులు తిరక్కుండా, మావివాహం అత్యంత వైభవంగా జరిగింది, అతను కాదుకాదు వారు కోటేశ్వరరావు, శేషగిరి సాధించలేనిది సాధించి నావారయ్యారు.

# 19

నేను రామనాధం శ్రీమతిని కావడం నా జీవితంలోని ఒక బంగారు కల. ఇప్పటికీ నేనింకా నమ్మలేకుండా ఉన్న నిజం, నా కిప్పుడు స్వంత కారుంది, డ్రైవింగు కూడా వచ్చును, చాలా తరుచుగా షాపింగుకు వెడుతూ ఉంటాను నేను, ఏ షాపుకు వెళ్ళినా అంతులేని గౌరవం లభిస్తూంటుంది నాకు, ఇప్పుడు దరిద్రం పట్ల నా అసహ్యం మరింత పెరిగింది.

అయితే శ్రీవారిపట్ల నాకు గల అసహ్యాన్ని మాత్రం పైకి వ్యక్తపరచలేక పోతున్నాను, ఇది నాకు బాధగానే ఉంది. నేను ప్రపంచంలో ఎక్కువగా ప్రేమించేవి రెండే రెండు, ఒకటి డబ్బు. అది నాకు లభించింది, రెండు, అందమైన కళ్ళు. అవి వారికిలేవు, నేను డబ్బును ప్రేమించడంతోపాటు దరిద్రాన్ని అసహ్యించు

కుంటాను, అందమైన కళ్ళను ప్రేమించినట్లే వికారమైన కళ్ళను అసహ్యించుకుంటాను, కానీ వారి కళ్ళనెలా అసహ్యించుకునేది?

ఆ కళ్ళు నన్ను చూడడం వల్లనే నాకీ వైభవం లభించిందని నాకు తెలుసు, అయినా సరే ఆ కళ్ళంటే నాకు అసహ్యం. ఎంత సహించుకుందామన్నా కుదరడంలేదు, ఇంత అదృష్టం నాకు కలిగించిన భగవంతుడీ ఒక్క విషయంలోనూ ఎందుకు చిన్నచూపు చూశాడో అర్థం కావడంలేదు. మా ఇరువురి తొలిరేయి అనుభవం నాకిప్పటికీ గుర్తుంది, సిగ్గుతో తలవంచుకుని వున్న నన్ను చుబుకం ఎత్తి చూశారాయన, చూసీ చూడగానే నాకాయన నయనాలు కనిపించాయి. వాటిని చూస్తూనే నాకు కలిగిన జుగుప్సాభావ మింతా అంతాకాదు, నా భావాలెక్కడ ఆయన చదివేస్తారోనని వెంటనే కన్నులు క్రిందకి వాల్చేశాను. "సిగ్గా?" అన్నారాయన.

"ఊఁ" అన్నాను.

"నువ్వెంత అందంగా ఉన్నావు సుమా!" అన్నారాయన, సుమా అన్న పిలుపు వింటూనే నాకు శేషగిరి గుర్తుకు వచ్చాడు, ఆ క్షణంలో శేషగిరి నన్ను పిలుస్తూ న్నట్లనిపించింది. శేషగిరికీ నాకూ భౌతిక సంబంధం లేకపోవచ్చుకానీ అతను నా హృదయానికి చాలా దగ్గరగా వచ్చాడు, అతను నన్ను సుమా అని పిలుస్తుంటే నాకేదో తీయని అనుభూతి కలిగేది, అతని ముఖం చూస్తే చాల పరవశం కలిగేది, నా తీరని కోరిక, అతడి నయనాలను నా అధరాలతో స్పృశించాలని! సుమా అన్న పిలుపు వింటూనే మళ్ళీ ఆయన ముఖంలోకి చూశాను, వెంటనే వికారమైన ఆ కళ్ళు కనబడ్డాయి, మళ్ళీ నా కళ్ళు వాలిపోయాయి.

"అందానికి సిగ్గు అందమేకానీ, మనకిది సిగ్గుపడవలసిన సమయంకాదు, ఒక్కసారి నాకళ్ళలోకి చూడు సుమా!" అన్నారాయన.

సుమా అనగానే మళ్ళీ శేషగిరి పిలుపే వినబడింది. అప్రయత్నంగా ఆయన ముఖంలోకి చూశాను. నాలో దాగి ఉన్న బల



మైన కాంక్షో ఏమో తెలియదుకానీ అప్పుడు నాకు శేషగిరే కనిపించాడు. అన్నీ మరిచిపోయి తన్మయత్వంతో ఆయన ముఖంలోకే చూస్తూ ఉండిపోయాను.

"ఆహా తన్మయత్వంలో నువ్వు చూసే చూపులు నాశరీరాన్ని తాకుతుంటే ఏదో గిలిగింతలు పెట్టినట్లుంది. మన్మథుడి బాణా లంటారే ఆ పదానికిప్పుడే అర్థం తెలిసింది" అంటూ చటుక్కున నన్ను బలంగా కౌగలించుకున్నారు. "నా ఊహల్లోంచి శేషగిరి మాయమై ఆయన ప్రత్యక్షమయ్యారు. కానీ నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. నాకు మాటి మాటికీ శేషగిరి ఎందుకు గుర్తుకొస్తున్నాడు? అతన్ని నేను ప్రేమించానా?"

"ఎందుకలా ఆలోచిస్తావ్? అతణ్ణి నీవు ప్రేమించావో లేదో నీకు తెలియదూ?" అనడిగింది నా మనసు తీవ్రంగా. అవును శేషగిరిని నేను ప్రేమించాను ఈ విషయం నాకు తెలుసు, లేదు నేను శేషగిరిని ప్రేమించలేదు. అయితే ఒకసారి శేషగిరి నా కోసం వెన్నెల్లో తడిసిన బట్టలు తెచ్చాడు, మరొకసారి నేనతని కన్నులను ముద్దుపెట్టుకోవాలని ఏదో ప్రతిబంధకం రాగా ఆగిపోయాను, చాలాసార్లు అతను నన్ను గాఢంగా కౌగలించుకుని నన్ను పరవశురాల్ని చేశాడు. కానీ ఇవన్నీ కలలు, ఊహలు. వాస్తవంలో జరగాలను కున్నప్పుడేకదా? కాదు, కలల్లో మన ప్రవర్తన్పై మనకు అదుపు ఉండదు, కలలు మన కోరికలను ప్రతిఫలించవు. పోనీ శేషగిరి పక్కన ఉన్నప్పుడు నామనోభావాలెలా ఉండేవి? అతను చొరవ తీసుకుని ఉంటే, నిదానాన్ని ప్రదర్శించి ఉండకపోతే నేనెప్పుడో అతనిదాన్నై ఉండేదాన్ని. ఎన్నో పర్యాయాలు అతనికి బాగా దగరవాలనీ, కౌగలించుకోవాలనీ అనిపించింది. "అంటే?" అంటే ఏమో, నేను శేషగిరిని ప్రేమించలేను. హఠాత్తుగా వాస్తవంలోకి వచ్చాను. నా పరధ్యానంలో, ఆలోచనల్లోపడి నన్నాయనేం చేస్తున్నారో గుర్తించలేదు. ఆయననాకు భర్త కావచ్చు. కానీ అదినాకు తొలిరేయి. ఒకపురుషుడు నా దగ్గర కొత్తరకం చనువు తీసుకునేరోజు. అటువంటీరోజున నేనాయన కౌగిలిలో ఒదిగిన

క్షణంలో శేషగిరికి సంబంధించిన ఊహలు నన్ను చుట్టుముట్టగా నేను పరధ్యానంలో, ఏదో మైకంలో పడిపోయాను. ఈలోగా ఆయన నాపై చాలా చొరవతీసుకున్నారు. నేనేస్థితిలో ఉన్నానో చూసుకుని చటుక్కున ముడుచుకుపోయి మంచంమీద వాలిపోయాను. ఆయన నాపక్కనేచేరి నాశరీరంమీద తన చేతితో మృదువుగా నిమురుతూ "మళ్ళీ సిగ్గు వచ్చిందా ?" అనడిగారు. మళ్ళీ సిగ్గు రావడానికి అసలది పోయిందెప్పుడు ? ఏదో శేషగిరి ధ్యాస. అయినా ఈసమయంలో నాకు శేషగిరి ధ్యాస కలగడమేమిటి? అతన్ని నేను ప్రేమించానా, ఏమన్నానా ? నాకాక్షణంలో శేషగిరి ఎందుకు గుర్తుకొచ్చాడో ఊహించాను నాభర్త కళ్ళు బాగుండవు. శేషగిరి కళ్ళు బాగుంటాయి.

"ఏం మాట్లాడవు ఒక్కసారి నావంక చూడవూ ?" అన్నారాయన.

అప్రయత్నంగా ఆయనవంక ఒక్కక్షణం మాత్రం చూశాను. ఆక్షణంలోనే ఆయనకళ్ళలోని తీవ్రమైన కాంక్ష కనబడింది. ఆక్షణంలోనే ఆ కళ్ళు కాంక్షతో చూసేదినన్నేనన్న గుర్తింపు కలిగింది. నాలోని అణువణువునూ ఆకళ్ళు తీవ్రంగా పరిశీలిస్తున్నాయన్న ఊహ నన్ను వణికించింది. ఒక్కసారి సిగ్గు మరిచిపోయాను. అంతులేని జుగుప్సాభావం అప్రయత్నంగా నాచేత "ప్లీజ్ దీపంతీసేయండి" అనిపింపజేసింది. అదాయన నాసిగ్గుగా భావించారు. నామాట మన్నించారు. దీపం ఆరిపోగానే ఆయన స్పర్శకు నాలోని స్త్రీ చలించగలిగింది. ఇప్పుడాయన చూపులకు ఏవిధమైన సంబంధమూలేదు. ఆయన పురుషుడు నేను స్త్రీ ! మళ్ళీ నేను శేషగిరిని గుర్తు చేసుకోవలసిన అవసరం నాకుకలగలేదు. ఆ చీకట్లో, ఆ ఆనందసమయంలో మేము ఎన్నో కబుర్లు చెప్పుకున్నాం, మనసు విప్పి ఒకరినొకరు అర్థం చేసుకున్నాము. భవిష్యజ్జీవితాన్నెలా ఆనందమయం చేసుకోవాలో పథకాలు వేసుకున్నాము. ఒకరిపట్ల ఒకరు ఆరాధనా భావాన్ని వ్యక్తపర్చుకున్నాము. ఒకరి అదృష్టాన్నొకరు అభినందించుకున్నాము.



కరిపట్ల ఒకరికి ఎంతో సంతృప్తికలుగగా అదొక మరపురాని
ధురమైనరేయిగా నాజీవితంలో మిగిలిపోయింది. అందుకు నేను
లా సంతోషించాను. అయితే అంతటితో నా ఇబ్బంది తీరలేదు.

నేనాయనంటే ఇష్టపడ్డాను మొదట్లో. తర్వాతనుంచి ఆయన్ని
ప్రేమించడం కూడా మొదలయింది. నేనాయన్ని ప్రేమిస్తున్నానని
గ్రహించానంటే ఆయనకు కలిగే ప్రతి అసంతృప్తీ నన్నుకూడా
సంతృప్తిగా వేటాడుతుంది. ఆయన ఒకపూట భోజనంచేయక
తే నాప్రాణం విలవిలలాడిపోతూంది. ఆయనకు చిన్న గాయం
గిలితే అదినాకు తగిలినట్లే ఉంటుంది. ఆయనకు కోపంవస్తే
శమించేవరకు నాకుస్థిమితముండదు. ఆయన సౌఖ్యంకోసం
ను ఆనందంగా త్యాగాలు చేయగలుగుతాను. నామనసునిండా
రిగురించిన ఆలోచనలే ! ఇటువంటి పరిస్థితిలో కూడా మామధ్య
శృతులు పలకడానికి కారణం ఆయనకళ్ళు ! ఎన్నో అనుకునే
ను ఆకళ్ళను అసహ్యించుకోకుండా ఉండలేకపోతున్నాను.

ఆయన ప్రేమగా నన్ను దగ్గరకు తీసుకుని "నీ అంద
ంతా కళ్ళలో ఉంది సుమా !" అని నాకళ్ళను ముద్దుపెట్టు
ంటారు. నేనుకూడా తనకు అలాచేస్తానని ఆశిస్తారు. కానీ
నెన్నడూ ఆయనకళ్ళను ముద్దు పెట్టుకోలేను. అందువల్ల కలిగిన
వమైన ఆశాభంగం ఆయనకళ్ళలో ప్రతిఫలిస్తుంది. చలించను
ను. ఆయన్ని ఆవిధంగా చాలాసార్లు నిరుత్సాహ పరిచాననే
ప్పాలి. వారు దగ్గర లేనప్పుడు ఎన్నోసార్లు నాకు వారిమీద
రికలుగు తూంటుంది. ఒక అనామకురాలికి రాజయోగం
ట్టించిన వ్యక్తికి తగిన సుఖం ఇవ్వలేకపోతున్నానని అప్పుడప్పుడు
కు అనిపిస్తూండేది. నన్ను నేను ఈవిషయంలో సంస్కరించుకోవా
ని కూడా పదే పదే అనుకునేదాన్ని. కానీ ఆకళ్ళను చూడగానే
న్నిమరచి పోయేదాన్ని. ఆకళ్ళు కాంక్షతో నన్ను చూస్తూంటే

నాశరీరంపై గొంగళీ పురుగు పాకిన అనుభూతికలిగి నాకళ్ళలో ప్రతిఫలించేది.

నేను కృతఘ్ను రాలినే కావచ్చు. మామూలు బలహీనతకు లొంగి పోయిన ఒకసామాన్యురాలిని కృతఘ్నురాలు అనవచ్చునంటే నేను కృతఘ్నురాలినని ఒప్పుకుని ఊరుకుంటాను.

ఏదో అతీత శక్తికి లోనై అలా ప్రవర్తిస్తున్నా నేమోనని ఒకసారి అనిపించగా "ఓ అతీతశక్తీ! నేనాయన కళ్ళను ప్రేమించేలా చేయి. మా సంసార జీవితంలోని ఈ అసంతృప్తిని తొలగించు" అని ప్రార్థించుకున్నాను. నా ప్రార్థన నిజంగా ఫలించనున్నదన్న విషయం అప్పుడు నాకు తెలియదు.

# 20

ఆరోజంతా అదో లాగుంది నాకు. అన్నం సహించలేదు. ఎక్కడికీ వెళ్ళబుద్ధి కావడం లేదు. ఏం చదువుదామన్నా తలనొప్పి వస్తోంది. మనసు నిలకడ ఉండడం లేదు. గట్టిగా అయిదు నిముషాలు నిలబడితే కళ్ళు తిరుగుతున్నాయి. వారేమో ఇంట్లో లేరు. చాలాసేపు అవస్థపడ్డాక అదేదో జబ్బై ఉంటుందని అనుమానపడి లేడీడాక్టర్ వనజకు ఫోన్ చేశాను. ప్రస్తుతం నా హోదా ఏమిటో వేరే ఎవ్వరికీ చెప్పనవసరం లేదు. డాక్టర్ వనజ సరిగ్గా అయిదు నిముషాల్లో మా యింట్లో నేను పడుకున్న గదిలోకి వచ్చింది. నేను మర్యాదకు నమస్కారం పెట్టాను. ఆవిడ దాన్నందుకుని ఆత్రుతను ముఖంలో వ్యక్తపరుస్తూ నన్ను సమీపించి నా చేయి పట్టుకుని చూసింది. "ఏమయింది డాక్టర్!" అన్నాను ఆత్రుతగా.

వనజ ముఖంలో చిరునవ్వు కనబడింది "చెబుతాను. ఒక్క అయిదు నిముషాలు నన్ను పరీక్షించనివ్వండి" అంది. అయిదు నిముషాల తర్వాత "మీరేమీ కంగారు పడనవసరం లేదు. అన్నింటికీ నేనున్నాను" అంది వనజ.



"కానీ డాక్టర్ ఇలాంటి అనుభవం నాకిదే మొదటిసారి" అన్నాను.

"అందులో ఆశ్చర్యమేముంది. మీరు తల్లి కాబోవడం కూడా ఇదే మొదటిసారి గదా" అంది డాక్టరు చిరునవ్వును పెనునవ్వుగా మారుస్తూ.

ఉలిక్కిపడ్డాను. నాకు తెలియకుండానే ఉత్సాహం నన్నావరించింది. అయితే భయంకూడా క్రమంగా శరీరాన్నావరించుకుంది. ఇంతకాలం నేను వివాహం గురించి సుఖజీవనం గురించీ ఆలోచించానుగానీ నేను తల్లిని కావడం గురించి ఆలోచించలేదు. ఆడదాని అందానికి తల్లి కావడం చరమాంకమని ఎందరో చెప్పగా విన్నాను. తల్లి అనగానే నాకు మా అమ్మ, చెల్లి గుర్తుకు వస్తారు. ఆ దృశ్యాలు నాకు బాగా గుర్తు. చెల్లి బోసి నోటితో ఎంతో అందంగా, ముద్దుగా ఉండేది. అవి నాకు బాగానే ఉండేవి. కానీ అది బట్టలు పాడు చేసుకునేది. పక్క బట్టలు పాడుచేసేది. మాకు అసహ్యం వేసే పరిస్థితిలో అది కేరింతలు కొడుతూ ఆడుకునేది. మేము అసహ్యించుకునే పనులన్నీ అమ్మచేసి చెల్లిని శుభ్రంగా ఉంచేది.

"అమ్మ అసహ్యం కాదే!" అని నేనడిగితే చిన్నప్పుడు నువ్వూ అంతే" అని చాలా మెత్తగా అమ్మ జవాబు చెప్పింది. వయసులో అమ్మ అందంగా ఉండేదనీ పెళ్ళై పిల్లలు పుట్టేక ఆ అందం పోయిందనీ చుట్టుపక్కల చాలామంది అనేవారు. నాకు జ్ఞానం వచ్చినప్పట్నించీ అమ్మను ఒక తల్లిగా తప్ప అందమైన యువతిగా ఎన్నడూ చూడలేదు. ఇప్పుడు నన్నీ అవస్థ ఆవహించిందన్నమాట. నేను తల్లిని కాబోతున్నానంటే నా కడుపులో ఓ చిన్నారి పాపాయి జీవం పోసుకుంటున్నదన్న మాట. ఈ అనుభూతి నాకు విచిత్రంగా తోచి అప్రయత్నంగా పొట్ట తడుముకున్నాను. నా కడుపులో మరో జీవి. కొన్ని నెలలపాటు అక్కడే పెరిగి ఒకరోజున బయటకు వచ్చి నన్ను తల్లిని చేస్తుంది. నాతో

పాటు వారు తండ్రికూడా అవుతారు. ఈవార్త వినగానే వారికెలా ఉంటుందో?

"ఫోన్లో లక్షణాలు చెప్పగానే జబ్బేమిటో ఊహించ గలిగాను. నా దగ్గర సిద్ధంగా ఉన్న కొన్ని మందులుకూడా తీసుకువచ్చాను. ఒకవారం రోజులపాటు ఇవి వాడండి, తర్వాత శరీర తత్వాన్ని బట్టి మార్పులుంటే ఏం చేయాలో సూచిస్తాను" అని వనజ కొన్ని మందులిచ్చి అవి వాడే పద్ధతి చెప్పి వెళ్ళిపోయింది.

ఇప్పుడు నేను వారికోసం ఎదురు చూస్తున్నాను. భయం సంగతి ఎలాగున్నా, ఆనందం నాకు ఎక్కువగానే ఉన్నట్లుంది. అది వారితో పంచుకోవాలన్న కోరిక నాలో ఎక్కువగా ఉంది.

అయితే ఆరోజుకు నాకోరిక తీరలేదు, అనుకోకుండా వారేదో ఊరికివెళ్ళి ఓరెండురోజుల తర్వాతవచ్చారు. వస్తూనే ఆయన నన్ను చూడడానికేవచ్చారు.

"చెప్పకుండా అలావెళ్ళి పోయారేమిటి? మీకోసం నేనిక్కడ ఎంతగా ఎదురుచూస్తున్నానో మీకేంతెలుసు?" అన్నాను చిరుకోపంతో. ఆయన చిరునవ్వుతో "సుమా! నిన్ను వదిలి నేను క్షణంకూడా ఉండలేను. ఒకోసారి నీకోసం ఈ వ్యాపారాన్నే వదిలిపెట్టేయాలని ఉంటుంది" అన్నారు.

"అన్నీ కబుర్లే!" అన్నాను.

"కబుర్లుకాదు. నువ్వు ఊఁ అను. ఈ క్షణంనుంచీ అన్నిపనులూ మానేస్తాను" అన్నారాయన.

నేనుభయపడ్డాను. ఊఁ అనలేదు. మాటమారుస్తూ "నేను మీకోసం ఎదురుచూస్తున్నానన్నానుగదా ఎందుకని అడగరేం?" అన్నాను. "అడగడమెందుకు నాకు తెలియదు గనుకనా నేనూ నీకోసం నీకంటె ఎక్కువగా ఎదురు చూస్తున్నాను మరి" అన్నారాయన.

"అదికాదండీ ఈసారి ఓ ప్రత్యేకమైన విశేషముంది" అన్నాను.



"ఏమిటది?" అన్నారాయన ఆత్రుతగా.

"మీరు బయటకు వెడితే మీకోసం ఇప్పుడు నేనొక్కర్తినే ఎదురు చూస్తున్నాను. ఒకఏడాదిపోతే మీకోసం ఎదురుచూసేవారింట్లో ఇద్దరుంటారు" అన్నాను.

ఆయన ముఖం పాలిపోయింది "ఎందుకు సుమా! నన్నలా కలవరపెట్టిస్తావు" అన్నారాయన బాధగా. "నీకు చెప్పకుండా బయటకు వెళ్ళినంతమాత్రాన్న నువ్వు నాశీలాన్ని శంకించకూడదు. నేను రెండో పెళ్ళి చేసుకుంటానని ఎందుకనుకుంటున్నావు?" ఆయన ఈప్రశ్నకు నాలో కంగారుపుట్టింది "అయ్యో అలాంటి ఊహే నాకు లేదండీ మీరు భుజాలు తడుముకుంటుంటే గుమ్మడికాయల దొంగేమోనని మీమీద నాకు అనుమానంగా కూడా ఉంది" అన్నాను.

"మరైతేనువ్వు చెప్పదల్చుకున్న విశేషమేమిటి?" అడిగారాయన.

"మీరు సంతోషించే విధంగా నాకు జబ్బు చేసింది. వివరాలు నాకు చెప్పననీ మీకేచెపుతాననీ డాక్టర్ వనజ అంది. అసలు విషయం ఏమిటో ఆవిడకి ఫోన్‌చేసి తెలుసుకోండి" అన్నాను ఏలాగు ఆయన్ను మరి కొంతసేపు వేధించాలని. ఆయన ముఖం మళ్ళీ పాలిపోయింది. నిరుత్సాహంగానే డాక్టర్ వనజకు ఫోన్ చేశారు.

ఫోన్‌లో వనజ చెప్పిన మాటలు వినగానే ఆయన ముఖంలో ఉత్సాహం కనిపించింది. చటుక్కున నన్ను సమీపించి "ఇంత మంచి వార్త వెంటనే ఎందుకు చెప్పలేదు" అంటూ నన్ను గట్టిగా కౌగిలించుకున్నారు.

నేను విడిపించుకునేందుకు ప్రయత్నిస్తూ "చెబితే అర్థం చేసుకునే తెలివితేటలు మీకు లేకపోయాయి. అందుకే డాక్టర్‌కి ఫోన్ చేయమన్నాను" అన్నాను.

" సుమా ! ఇప్పుడు నామనసెంత ఉత్సాహంగా ఉందో నువ్వర్థంచేసుకోలేవు. నాజీవితంలో ఒక ముఖ్యమైనకోరిక తీరేసమయం ఇప్పుడువచ్చింది " అన్నారాయన.

ఆయన సంతోషిస్తారని నేనూహించానుగానీ మరీ ఇంతలా ఉప్పొంగి పోతారని నేనూహించలేదు. అందువల్ల నాకు చాలా ఆశ్చర్యం కలిగింది " మీభార్య పిల్లల్ని కనాలన్నది జీవితంలోని మీ ముఖ్యమైనకోరికా ? చాలా విచిత్రంగా ఉందే ! " అన్నాను.

ఆయననవ్వి " అవును సుమా ! నా ప్రతిబింబాన్ని చూసుకోవాలన్నది నాకోరిక. ఇలాంటి కోరిక ఎవరికి మాత్రం వుండదు ?" అన్నాను.

" ప్రతిబింబం చూసుకోడానికి మనింట్లో అద్దాలు తక్కువయ్యేయా ? " అన్నాను.

ఏదో చెప్పాలనుకుని ఆగి పోయారాయన. ఒక్కనిమిషం ఇద్దరి మధ్యా నిశ్శబ్దం ఆవహించాక, ఆయనే దాన్ని ఛేదిస్తూ " అద్దంలోని ప్రతిబింబం నిజమైనదికాదు " అన్నారు.

" ఎందుకనీ ? "

" దానికి జీవంలేదు. అది నా దుఃఖాన్ని పోగొట్టలేదు. నాకుసంతోషాన్నివ్వలేదు. అంతే కాదు నేను పోగొట్టుకున్న వాటిని తెచ్చివ్వలేదు " అన్నారాయన.

ఆయన మాటలు నాకర్థంకాలేదు " మరైతే ఈ ప్రతిబింబం అవన్నీ చేస్తుందంటారా ? " అన్నాను. " ఆ ప్రతిబింబం విలువ నీకర్థంకాదులే " అని ఊరుకున్నారాయన.

ఆయన ఏదో ఆలోచిస్తున్నారని గ్రహించి నేనూ ఊరుకున్నాను. ఎంతసేపటికీ ఆయన మాట్లాడక పోవడం చూసి ఊరుకోలేక నేనే " ఏమిటండీ ఆలోచిస్తున్నారు ! " అనడిగాను.

అయితే ఆయన ఏమీ ఆలోచిస్తున్నట్లులేదు. నాప్రశ్న కోసమే ఎదురుచూస్తున్న వారిలా " నీకు మగపిల్లాడు కావాలా, ఆడపిల్ల కావాలా ? " అనడిగారు.

" ఏం ? "



" ముందు చెప్పు "

"నే నేమీ అనుకోవడంలేదు........" అన్నాను; ఏం చెప్పడానికి నాకు నిజంగానే సిగ్గువేసింది.

"నే నేమనుకుంటున్నానో చెప్పనా........"

"చెప్పండి !" అన్నాను.

"మనకు బాబుపుట్టాలి వాడికి పూర్తిగా నా పోలికరావాలి...." అన్నారాయన.

అంతవరకూ ఏ మైకంలో ఉన్నానో తెలియదుగానీ హఠాత్తుగా వాస్తవంలోకి వచ్చాను, అప్పుడేనేనాయన కళ్ళను చూశాను. ఎంతో అసహ్యంగా ఉన్న ఆయనకళ్ళు నా వైపు కుతూహలంగా చూస్తున్నాయి.

హఠాత్తుగా ఆయనస్థానంలో నాకు బాబుకనిపించాడు. పిల్లాడు బొద్దుగా ఉన్నాడు. నా వంకచూసి చేతులు జాపుతున్నాడు. కానీ వాడివి పూర్తిగా ఆయన పోలికలు. ఆ కళ్ళుకూడా ఆయనవే.... వాడు "అమ్మా !" అని పిలుస్తూ నా వంక చేతులు జాపుతూంటే, అసహ్యకరమైన వాడికళ్ళను చూసి నేను వాణ్ణి అందుకోలేక పోతున్నాను. కళ్ళు అందంగా లేవని భర్తనసహ్యించుకుంటున్నాను. కన్నబిడ్డను కూడా అసహ్యించుకోగలనా ? ఈ భావన కలగ్గానే వణికి పోయాను.

అప్రయత్నంగా...." బావుంది....చాలామంచి కోరికే........ రాకరాక వాడికి మీ కళ్ళేరావాలా " అన్నాను. అనగానే నాలిక్కరుచుకున్నాను. ఆ భావం నా మదిలో ఉండవచ్చు. దాన్ని బైటకు రాకుండా అణచిఉంచవలసింది. ఆయన ముఖం అదోలాగై పోయింది........ "ఏమన్నావ్ ?" అన్నారు.

అప్పటికి నా పొరపాటు గుర్తించక నేను ... "పోనీలెద్దురూ- ఇప్పట్నుంచీ పోలికల ప్రసక్తి ఎందుకు ? మనం ఏ మనుకున్నా జరుగనున్నది మనచేతుల్లోలేదుగా - కొన్నాళ్ళాగితేసరి........" అన్నాను.

అయితే ఆయన ఊరుకోలేదు.... "బాబుకు నా పోలికరావడం నీ కిష్టంలేదా ?"

ఇదేంప్రశ్న ! అయినా నేను మొండిగానే జవాబు చెప్పాను..........మీ పోలిక రావడం నా కిష్టమే..........కానీ మీ కళ్ళు.........." అంటూ నీళ్ళు నమిలాను.

"నా కళ్ళకేం లోటొచ్చింది ?" అన్నారాయన కాస్త తీవ్రంగా.

ఆయన కళ్ళు అందంగా ఉండవన్న సంగతి ఆయనకు తెలియకపోలేదు. ఆ మాత్రం దానికాయనంత కోపగించకానడ మెందుకు! ఉన్నమాటంటే ఉలుకంటారు..........ఇదేకాబోలు !

"ఈ సంతోషసమయంలో ఎందుకంత కోపగించుకుంటారు ? మీ కళ్ళు అందంగా ఉండవన్న విషయం మీకు నేనే వేరే చెప్పాలా? నేను అందంగా ఉన్నాయని అబద్ధం చెబుతేమాత్రం అవి అందంగా అయిపోతాయా ? మనచేతుల్లో లేని పోలికల గురించి ఇప్పుడు చర్చ ఎందుకు ?" అన్నాను. కోపం నా కంఠంలోనూ ధ్వనించింది.

"ప్రతి సంతోషసమయాన్ని ఇలామార్చడం నీకు కొత్త కాదు. నీకు అందానికి అర్థం తెలియదు. తెలిసుంటే నా కళ్ళు దివ్యసౌందర్యంతో వెలిగిపోతూ కనిపించేవి నీకు. అయినా నీతో నాకు మాటలేమిటి.........."అంటూ తీవ్రంగా అని చాలావిసురుగా అక్కణ్ణించి వెళ్ళిపోయారాయన.

నాకు అందానికి అర్థం తెలియదూ ? నేను ప్రతిసంతోష సమయాన్ని పాడుచేసేలా ప్రవర్తిస్తానా ?....—నేను తెల్లబోయాను షాక్ తిన్నాను. ఈయన నన్నింతమాట అంటారని నేననుకోలేదు. అదే నాకు ప్రథమానుభవం మరి ? ఈ శుభవార్త ఇలా పరిణమించిందేమిటి దేవుడా..........అనుకున్నాను.

* * *

అంతులేని భోగభాగ్యాలకు వారసురాలిని నేను. కాబట్టి పురిటికి నన్ను పుట్టింటికి పంపడం జరుగలేదు. నా స్థాయికి తగ్గ



ర్పాట్లు వాళ్ళు చేయలేరు. అందుకే అమ్మ నా ఇంటికి వచ్చింది. నీ అమ్మ అనుభవం నాకాట్టే అవసరపడలేదు. అమ్మ అనుభ నికీ డాక్టర్ వనజ వైద్యానికీ అంతగా సరిపడడంలేదు. అమ్మ మాటలు వినవద్దనీ తన మాటలు అతిక్రమించవద్దనీ వనజ నన్ను హెచ్చరించింది కూడా. అలాగని వనజ అమ్మను చిన్నబుచ్చలేదు. చూడండమ్మా - మీ రోజులువేరు. ఈ రోజులు వేరు. మీరోజుల్లో ు పద్ధతులు పాటించి మీరు సుఖప్రసవాలు సాధించారు. మీ పద్ధతుల్లో సుఖప్రసవం అంటే అది అదృష్టం. ఇప్పుడు ప్రసవాన్ని అదృష్టానికి వదిలిపెట్టడంలేదు. వైద్య విజ్ఞానం చాలా ముందడుగు వేసింది. ఆడదానికి ప్రసవకాలంలోనే పునర్జన్మ లభిస్తుంది. మీ అమ్మాయి పునర్జన్మకు నేను గ్యారంటీపడుతున్నాను" అని చెప్పింది వనజ. నా విషయంలో ఏయే మందులు ఏయే సమయాల్లో వాడాలో అమ్మకే చెప్పింది వనజ.

అన్నీ సక్రమంగా ఉన్నప్పుడు కూడా ఇన్ని మందులు వాడాలా అని విసుక్కుంటూనే అమ్మ నాకు వేళ తప్పకుండా మందులిచ్చేది. నన్ను కంటికి రెప్పలా కాపాడుకునేది. నాలో కలిగే ఎన్నో సందేహాలకు సమాధానం చెప్పింది, తన అనుభవాలు చెప్పి నా భయాలనన్నింటినీ పోగొట్టేది.

డాక్టర్ వనజ నన్ను బాగానే చూసుకుంటోంది. కానీ అమ్మ దగ్గర నాకున్న చనువు ఆవిడ దగ్గరెలా వస్తుంది? ఈ సమయంలోనే నాకు తల్లి విలువ తెలిసొచ్చింది. తల్లి లేకపోతే ఎంత డబ్బున్నప్పటికీ ఈ సమయంలో ఎవరు నన్నింతలా ఆదుకునేవారని అనిపించింది.

పురిటిరోజులు దగ్గర పడుతున్నకొద్దీ రెండురకాల భయాలు నన్ను బాధ పెట్టసాగాయి. నేనేమైపోతానో అన్న భయం ఒకటి, నాకు ఆయన పోలికలతో బాబు పుట్టి నాచే అసహ్యించుకోబడతాడేమోనన్న భయం ఇంకొకటి.

నా బాబును నేను అసహ్యించుకునే స్థితి ఎన్నడూ రాకూడదు. అది నేను ఊహలోకూడా భరించలేను. అయితే వాటికి

ఆయన కళ్ళు వస్తే, ఆ కళ్ళను నేను అసహ్యించుకోకుండా ఉండగలనా? నాలోని ఈ విచిత్రమైన బలహీనతను మాతృప్రేమ జయించగలుగుతుందా?

చిన్నతనం నుంచీ మా అమ్మంటే నాకు సదభిప్రాయం లేదు. నాకే ముఖ్య విశేషాలున్నా అవి నాన్నతోనే చెప్పుకునేదాన్ని. అమ్మను నేను అంతో ఇంతో ద్వేషించుకునేదాన్ని కూడా. అలాంటిది జీవితంలో ఓ కొత్తరకం అనుభవం. అదీ ఆడవారికి మాత్రమే పరిమితమైన అనుభవం, ఎదురయ్యేసరికి అమ్మ విలువ తెలుసుకున్నాను. అమ్మకు నాపై ఉండే అభిమానమూ, అమ్మ పట్ల నాకున్న గౌరవభావమూ అప్పుడే తెలిశాయి. సృష్టిలో తల్లీ బిడ్డల మధ్య ద్వేషభావమంటూ ఉంటే అది భ్రమ తప్ప మరొకటి కాదు.

అయితే నేను నాబాబును నాకు నచ్చని పోలికల్లో ఉన్నప్పటికీ ప్రేమించగలనా?

"భగవంతుడా! పుట్టబోయే బేబీకి ఆయన కళ్ళు మాత్రం రాకూడదు. ఈ వర మొక్కటే నాకనుగ్రహించు" అని ఎన్ని పర్యాయాలు భగవంతుడికి మొక్కుకున్నానో నాకే తెలియదు.

* * *

ఒకసారి అనగా వివాహానికి ముందు, ఆయన నాకు చెప్పారు. జీవితంలో తననుకున్న ప్రతిదీ సాధించానని! ఆ నమ్మకంతోనే ఆయన నా దగ్గరకు వచ్చి నన్నుకూడా సాధించ గలిగారు.

డబ్బునీ, అందమైన కళ్ళనీ సమంగా ప్రేమిస్తున్నాననుకున్న నేను వికారమైన కళ్ళున్న ఆయన్ను భర్తగా అంగీకరించాను. అంటే ఆయన సంకల్పబలం ముందు నేనాగలేక పోయానన్న మాట! అంతటి బలమైన సంకల్పబలంతో ఆయన తన పోలికలతో బాబు కావాలనుకున్నప్పుడు అలాకాక మరెలా జరుగుతుంది? ఈ భయమే నాచేత దేవుళ్ళకు మొక్కుకునేలా చేసింది. కానీ దేవుళ్ళుకూడా ఆయన సంకల్ప బలానికి తలవంచారు. నాకు బాబు పుట్టాడు.

ఇంట్లోని పనివాళ్ళందరూ బాబు కళ్ళను మెచ్చుకుంటున్నారు. నేను మనిషి అందాన్ని కళ్ళతో అంచనా వేస్తానని వాళ్ళందరికీ తెలుసు. అందుకే వాళ్ళలాగంటూ ఉండవచ్చు. బాబు కళ్ళ గురించి నా అంతగా తృప్తిలేక పోవడానికి కారణముంది. బాబును చూడగానే అంతా ఆయన పోలికన్నారు. నాకు వాడి కళ్ళు నచ్చాయిగానీ మిగతా పోలికలు తెలియలేదు. అయితే నెలలు గడుస్తున్న కొద్దీ వాడి ముఖానికి ఓ ఆకారం ఏర్పడ్డం ప్రారంభమయింది. వాడిలో ఆయన పోలికలు క్రమంగా కనబడసాగాయి. కొన్నాళ్ళయ్యేసరికి వాడిలో ఆయన పోలికలు స్పష్టంగా తేలాయి. వాడి ముక్కు, చెవులు, పెదవులు. అన్నింటికీమించి విశాలమైన ఆ నుదురు, ఉంగరాల జుట్టు సందేహం లేదు, ఆయన కోరిక తీరింది, బాబుకు పూర్తిగా ఆయన పోలికలే వచ్చాయి. దేవుడు ఆయన కోరికను మన్నించాడు, అయితే దేవుడు నా కోరికనుకూడా మన్నించాడు. వాడికళ్ళు ఆయనవికావు.

బాబుకు అన్ని పోలికలూ ఆయనవే వచ్చి కళ్ళొక్కటీ ఎందుకు రాలేదు? అంటే దేవుడు నా మొర విన్నాడనుకోవాలా లేక నా తల్లి ప్రాణానికి వాడి కళ్ళు అందంగా కనబడుతున్నాయా? తెలుసుకునేవరకూ నాకు స్థిమితం ఉండదు. నా బాబు నాకు బాగు ప్పటికీ సంతృప్తి ఉండను. నామనఃస్థితి నాకే చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పుడు నా ఊహలనిండా బాబే, నా జీవితమంతా వాడి కోసమే! బాబును చీమ కుడితే నన్ను పాము కరిచినట్లుంటుంది, వాడేడిస్తే నా నవనాడులూ కదిలిపోతాయి. వాడు నవ్వితే నేను అమృతం తాగిన అనుభూతి చెందుతాను. అయితే నా జీవితం నాకూ, నా బాబుకూ పరిమితం కాకూడదు. వాణ్ణి నాతోపాటు తదితర ప్రపంచమంతా గుర్తించాలి. వాడి సౌందర్యాన్ని ప్రతి ఒక్కరూ ప్రశంసించాలి. వాడి చేష్టలకు ప్రతి ఒక్కరూ నాతో

సమంగా మురిసిపోవాలి. వాడి తెలివితేటలకు అందరూ ముక్కు మీద వేలేసుకోవాలి.

ప్రతి కన్న తల్లికీ తన బాబు గురించి నాకులాంటి కోరికలే ఉండవచ్చు, కానీ నా బాబు సామాన్యుడు కాడు, అంతులేని భోగ భాగ్యాలకు వారసుడు.

నాకింకా ఆశ్చర్యకరమైన విషయం ఆయన ప్రవర్తన. ఆయనకు బాబు అంటే ఎంత అభిమానమో చెప్పడానికి మాటలు చాలవు. బాబు పుట్టేక మా ఇద్దరి అనుబంధం ఇంకా పెరిగింది. ఆయన నన్నింకా ఎక్కువ అభిమానిస్తున్నారు. ముఖ్యంగా వాడి కళ్ళంటే ఆయనకు ప్రాణం, రోజుకో వందసార్లయినా ఆయన వాటిని ముద్దాడుతారు. ఆ దృశ్యం నాకు చాలా ఆనందాన్ని కలిగిస్తుంది. దాన్ని కప్పి పుచ్చుకుంటూ "మిమ్మల్నిద్దర్నీ చూస్తుంటే మీలో ఎవరు చంటి పిల్లాడో తెలియడం లేదండీ" అన్నానోసారి.

"అవును, నేను నా సజీవ ప్రతిబింబంతో ఆడుకుంటున్నాను. నీకు తెలియకపోవడంలో ఆశ్చర్యమేముంది?" అన్నారాయన.

"వాణ్ణి మీ ప్రతిబింబం అనొద్దండీ మీ ఇద్దరికీ కళ్ళలో తేడా ఉందిగదా!" అన్నాను. అలా అనడానికి కారణం ఆయన్ను నొప్పించాలనికాదు. బాబు కళ్ళు నిజంగానే తనవిలా ఉన్నాయన్న విషయం ఆయనకూడా గుర్తిస్తే కానీ నాకు తృప్తిగా ఉండదు.

"సుమా!" అన్నారాయన తాపీగా. "నేను కోరిన విధంగా నా ప్రతిబింబాన్ని నాకిచ్చావు. నువ్వు చేసిన ఈ ఉపకారానికి నేను నీకు జీవితాంతం కృతజ్ఞుణ్ణి. నువ్వెన్ని తప్పులు చేసినా నేను క్షమించగలను. నువ్వు తిట్టినా నా చెవులకు పొగడ్తలుగానే వినబడతాయి. ఈ బాబుకు తల్లిగా నువ్వు నన్ను ఏమనడానికైనా అధికారముంది!"

ఏమనాలో తెలియదు. ఒకోసారి నేను అసభ్యంగా ప్రవర్తిస్తున్నానని నాకు తెలుసు. ఆయన మంచితనం నాకిప్పుడింకా బాగా అర్థమవుతోంది. మానసికంగా నేనాయనకు బాగా దగ్గరవుతున్నాను. కానీ ఆయన కళ్ళపట్ల నాకున్న అసహ్యభావం మాత్రం లేశమయినా తగ్గడం లేదు.

# 21

"అమ్మా, చూడు" అంటూ బాబు నాదగ్గరకు ఓ పుస్తకం పట్టుకుని వచ్చాడు. వాడేమి చేసినా నాకెంతో ముచ్చటగా ఉంటుంది. చేతిలోకి కొత్త వస్తువు వచ్చినపుడల్లా వాడు నాకే పట్టుకొచ్చి చూపిస్తాడు. వాడి తృప్తికోసం ఆ పుస్తకం అందుకున్నాను. తర్వాత అదేమిటో చూశాను. అది ఆయన డైరీ! పేఫర్ ఎక్కడైనా చింపేశాడేమోనని కాస్త జాగ్రత్తగా పరిశీలించి చూశాను. చింపినజాడ ఎక్కడా కనబడలేదు. కానీ డైరీకున్న సైడు కవరులో ఏదో ఫొటో ఉన్నట్లనిపించి, లాగి చూశాను. ఆ ఫొటో, ఉలిక్కిపడ్డాను. ఆ ఫొటోలో వ్యక్తి నాకు బాగా తెలుసు, గుర్తుపట్టటానికి క్షణంకూడా పట్టలేదు. నాచే తొలిసారిగా అసహ్యించుకోబడ్డ అందమైన కళ్ళున్న వ్యక్తి అతను.

అతను శేషగిరి! శేషగిరి ఫొటో ఈ డైరీలోకెలా వచ్చింది. శేషగిరి ఈయనకు తెలుసా? ఫొటో దగ్గరుంచుకునేటంత ఆప్తుడా అతను? శేషగిరి నిజంగానే అంత స్నేహితుడైతే, అతని ఫొటోను డైరీలో ఉంచుకుంటూకూడా నా దగ్గర అతడి ప్రసక్తిని ఆయన తీసుకురాక పోవడానికి కారణమేమిటి?

పరుగున ఆయన దగ్గరకు వెళ్ళాను. నేనువెళ్ళేసరికి ఆయన ఏదో రాసుకుంటున్నారు. నన్ను చూసి "ఏమిటోయ్ విశేషం!" అన్నారు. ఫోటో ఆయనకు చూపించి "బాబు మీ డైరీతో ఆడుతూంటే ఈఫోటో అందులోంచి పడింది. ఎవరండీ ఈయన?" అనడిగాను. ఆయన దానివంక పరీక్షగా చూసి "ఈ ఫోటో ఎవరిదోయ్ ఇది నా డైరీలోకెందుకొచ్చింది? నువ్వగానీ

పొరబడ లేదుగదా " అన్నారు. లేదు ఇది మీడైరీలోంచే క్రిందపడింది " అన్నాను.

" ఎప్పుడైనా పొరపాటున ఈ ఫోటోను నువ్వే నా డైరీలో దాచేవేమో గుర్తుచేసుకో ! " అన్నారాయన, ఆయనలా అనడం నాకాశ్చర్యాన్ని కలిగించింది,

" బాగుంది, అలా ఎందుకు జరుగుతుంది ! " అన్నాను.

" ఈఫోటో నీదగ్గరుందనుకో. ఇదెవరూ చూడ్డం నీకిష్టం లేదనుకో. ఇదినీచేతిలో ఉండగా ఎవరో అటు వచ్చారనుకో. అప్పుడు హడావుడిగా కనబడ్డ పుస్తకంలో ఈ ఫోటోను దాచేవనుకో. అప్పుడు నాడైరీలోకి నాకు తెలియని ఫోటో వస్తుంది " అన్నారాయన.

ఆయన మాటలు నాకు విచిత్రంగా తోచి. " బాగుంది నాకంత రహస్యాలెందుకుంటాయ్ ? అందులోనూ మీదగ్గర !" అన్నాను. ఆయనకూడా నవ్వి " ఊరికే అన్నాన్లే నీకు నాదగ్గర రహస్యాలెందుకుంటాయ్ ? ఈ ఫోటోలో మనిషిని నువ్వెరిగుండి ఉంటే ఎవరండీ ఈయన అనెందుకు అడుగుతావు ?" అన్నారు.

ఉలిక్కిపడ్డాను. ఆయన ఏమంటున్నారు ? ఈ ఫోటోలో వ్యక్తిని నేను గుర్తుపట్టి ఉండాలన్న ధ్వని ఆయన మాటల్లో ఎందుకు వచ్చింది ?

" మీ మాటలు నాకర్థం కావడం లేదండీ !" అన్నాను.

" నువ్వు ఆడదానివి. మాటలు పట్టించుకోకపోయినా పరవాలేదు. ఆ ఫోటో ఇలాఇవ్వు. ఇది నాడైరీలోకెలావచ్చిందో నేను తెలుసుకుంటాలేగానీ నువ్వుమాత్రం ఈఫోటో సంగతి మరిచిపో " అన్నారాయన.

ఆయన మాటల్లో ఏదో తిరకాసుందని పించింది. ఆయనకు నామీద ఏదో అనుమానంవచ్చింది. ఈ ఫోటో ఆయన కావాలనే కళ్ళబడేలా చేసి నాతో చెలరేగే సంచలనాన్ని గమనించాలనుకుంటున్నారు. అయితే నాకేం భయం ? నేనేమైనా తప్పు చేస్తే గదా ! నేనేమీ తప్పుచేయకపోతే ఆఫోటోలోనివ్యక్తి శేషగిరిని ఎందుకు చెప్పలేకపోయారు ? నేనక్కణ్ణించి కదలి బాబు దగ్గరకు వెళ్ళి " బాబూ ఇందాకటి పుస్తకం నీకెలావచ్చిందిరా ? " అనడిగాను.

" నాన్నిచ్చారు " అన్నాడు వాడు.

నాలో భయం పెరిగింది. నా ఇంట్లో మార్పురానున్నది. ఏదో భయంకర సమస్య నాజీవితాన్నావహించనున్నది. నాసుఖజీవనానికి గ్రహణం పట్టనున్నది. గ్రహణం అయితే పరవాలేదు. అదితాత్కాలికమే అవుతుంది. కానీ ఇంక ఆలోచించలేదు. ఆరోజల్లా ఆయన్ను తప్పించుకు తిరిగాను. రాత్రి ఆయన నా చెంత చేరినప్పుడు కూడా అన్యమనస్కంగానే ఉన్నాను.

ఆయనలో పెద్దగా మార్పున్నట్లులేదు, ఆయన ఉత్సాహంగా ఏవో చిలిపిపనులు చేస్తూనేఉన్నారు. నేను శాస్త్రానికన్నట్లుగా ప్రతిఘటిస్తూ అన్యమనస్కంగా ఉన్నాను. ఆఖరికాయన " నాకు చాలాసంతోషంగా ఉంది సుమా ! నీలోగొప్ప ఆరోగ్యకరమైన మార్పు వచ్చింది " అన్నారు. అప్పుడుకూడా నేను అన్యమనస్కంగానే " ఏమిటది ? " అన్నాను.

" దీపం ఆర్పమనలేదునువ్వు " అన్నారాయన నవ్వుతూ. భార్యభర్తల మధురానుబంధ సమయంలో నేనాయన చూపుల్ని భరించలేను. తొలిరేయినుంచి ఈనాటివరకు నాప్రవర్తన మారలేదు. అందు కాయన అభ్యంతరము చెప్పలేదు. నేను పడే సిగ్గు ఆయనకు నాపట్ల ఆకర్షణను మరింతగా పెంచుతున్నది.

" ఇన్నేళ్ళుగా కాపురంచేస్తున్నాం. ఆసంగతి ప్రత్యేకంగా చెప్పాలామీరు ? "అన్నాను.

" చెప్పాల్సిందే ఏదోఒకరోజున నువ్వావిషయం మరిచిపోకపోవుగదా అన్న ఆశనాకుంటుంది. నాఆశ ఈరోజు ఫలించింది " అన్నారాయన. " అదేంకాదు. నా కోరికే మీ అలవాటుగా కూడా పరిణమించింది. అందుకేనేను మరిచిపోయినా మీరు గుర్తుచేస్తున్నారు " అంటూ చేయిసాచి మంచానికి దగ్గర్లోనే ఉన్న

స్విచ్ నొక్కాను. దీపం ఆరిపోయింది. ఆయన ఊపిరి నాకు వెచ్చగా తగుల్తూంటే నాలోంచి అనుమానాలు ఆవిరై బయటకు పోసాగాయి. నన్ననుమానించే మనిషైతే ఆయన నాదగ్గరంత చనువుగా మసలలేరు. అంత అభిమానంగా ఉండలేరు. ఆయన ప్రవర్తనలో నామీద మనసులో ఏదో ఉంచుకున్న లక్షణాలు కనబడలేదు.

*    *    *

ఒక వారంరోజులయ్యాక కుతూహలంపట్టలేక నేనే ఇంకో రోజు ఫోటో గురించి ఆయన్నడిగేశాను.

ఆయన సానునయంగా " అనవసరపు విషయాల గురించి ఆలోచించకు సుమా ! " అన్నారు.

మళ్ళీ ఇంకోనాలుగు రోజుల తర్వాత ఆయన్నా ఫోటో గురించి అడిగాను.

ఆయననవ్వి మొత్తానికీ ఫోటో సంగతి మరిచేలా లేవే : " అని " నిన్ననే తెలిసింది. అతని పేరు అశోక్ కుమార్. విశాఖపట్నంలో నాకు పరిచయమయ్యాడు. స్వల్ప వ్యవధిలోనే ఇద్దరం బాగా పరిచయస్థులమయ్యాము. అతను స్నేహితులందరి ఫోటోలూ ఆల్బంలో ఉంచుతాడట. అదతని హాబీ. తన కేమేరాతో నాకో ఫోటో తీసుకున్నాడు. అతనలా చేసినప్పుడు బాగుండదని నేనూ అతని ఫోటో ఒకటి అడిగాను. వెంటనే ఇచ్చాడు. డైరీలో పెట్టాను. అందువల్లనే ఈవిషయం వెంటనే గుర్తు రాలేదు నిన్న అతనీ ఊరు వచ్చి వెళ్ళాడు " అన్నారు.

"అతని పేరు ఏమిటన్నారూ?"

"అశోక్ కుమార్!" అన్నారాయన. "ఏదేనా, పొరపాటు పడుతున్నారా?" "అలా ఎందుకను కుంటున్నావ్! అతని పేరు మరేదైనా అయుంటుందను కుంటున్నావా?"

"అబ్బే, లేదు" అన్నాను, కానీ నా మనసు పరిపరి విధాల పోయింది.



"ఆ ఫోటోలో మనిషి నాకు గుర్తుకు వచ్చాడు. అతని రు అశోక్ కుమార్ కాదు."

"ఆ ఫోటోలో మనిషి నీకు తెలుసా?" అన్నారాయన ఆశ్చ ్యంగా. అది తెచ్చిపెట్టుకున్న ఆశ్చర్యంగా నాకు అనిపించింది. ఊ(" అన్నాను. "అయితే అతని పేరేమిటో చెప్పు!" శేషగిరి!" అన్నాను ఏమైతే అయిందని. ఆయన రవంతకూడా శ్చర్యపడినట్లులేదు. గంభీరమైన ముఖంతో మౌనం వహించారు. ఏదో ఒకటి. పేరులో ఏముందిలెద్దూ!" అన్నారాయన.

"అదికాదండీ, తనపేరు శేషగిరి అయితే అశోక్ కుమార్ ని ఎందుకు చెప్పాడు! ఇందులో ఏదో మోసముంది. అతను ాసగాడైనా ఉండాలి, వేరే వ్యక్తి అయినా అయుండాలి."

"అంతా కాకతాళీయంగా జరిగింది సుమా! నేనే నీకు ారపాటు చెప్పాననుకుంటాను. అశోక్ కుమార్ వేరే వ్యక్తి. తను నాకు తన పేరు శేషగిరి అనే చెప్పినట్లు గుర్తు" అన్నారా యన.

నేను నిశ్చేష్టురాలినై పోయాను. ఉండబట్టలేక "నాకు షగిరి ఎలా తెలుసునని అడగరేం?" అనేశాను.

"నువ్వేమీ చెప్పక్కర్లేదు. అంతా తెలుసు నాకు." ఇలాంటి ఏదో ఆయన అంటారని నాకు అనుమానం ఉంది. అందుకే. మీరు తెలుసుననుకునేదంతా నిజంకాదు, శేషగిరి మోసగాడు. మామూలు మోసగాడుకాదు. పచ్చిమోసగాడు. అతను మిమ్మల్ని లుసుకుని మీకేం చెప్పాడో నాకు తెలియదు. నిజం నేను చెబు ను వినండి!" అన్నాను.

ఆయన కళ్ళు ఎర్రబడ్డాయి. కోపాన్ని అదుపులోకి తెచ్చు నేటందుకు ప్రయత్నిస్తూ, "సుమా! మన బాబునేమైనా అన్నా సహిస్తానుగానీ శేషగిరినేమైనా అంటే సహించలేను. నీ గురించి అంతా చెప్పాడు శేషగిరి, అయితే అది జరిగింది కొద్ది నెలల్రితం

మన వివాహానికి ముందు. అతను నిన్ను ప్రేమించానని చెప్పాడు. కానీ నువ్వతన్ని ప్రేమించలేదట, నువ్వో అమాయకురాలివట, డబ్బు గురించి కలలుకంటున్నావని చెప్పాడు. నీ గురించి అతను చెప్పిన వివరాలూ, నిన్ను నేను వివాహం చేసుకోవాలన్న అతని కోరికా మన ఈ ప్రస్తుత జీవిత విధానానికి దారి తీశాయి" అన్నారు.

నాకు మతిపోయి నట్లయింది, నేనను కుంటున్న దేమిటి? జరుగుతున్న దేమిటి?

నా సుఖజీవనాన్ని చూసి ఓర్వలేక శేషగిరి పచ్చని నా సంసారంలో నిప్పులు పోయాలనుకుంటున్నాడని నేను నమ్ముతున్నాను. అసలీ సుఖజీవనానికి కారకుడతడేనని ఆయన అంటున్నారు.

శేషగిరి కోరికమీద ఆయన నన్ను వివాహమాడేరా? ఇది నిజమా? నా కోరిక బాగా తెలిసిన శేషగిరి నాకోసం ఇంత మంచి వరుణ్ణి వెతికాడా?

"నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. కానీ ఏదో పెద్ద రహస్యాన్ని మీరు దాస్తున్నారు, శేషగిరి మీకెలా తెలుసు? వివాహ విషయంలో అతను చెప్పినమాట వినేటంతగా మీ పరిచయం ఎలా పెరిగింది?" అనడిగాను.

"శేషగిరి గురించి నన్నేమీ అడక్కు. నేనీ వివరాలు నీకు చెప్పడానికి ఒక్కటే కారణం! శేషగిరిని ఎవ్వరూ ద్వేషించ కూడదు. ఆ అమృత హృదయుణ్ణి ఎవ్వరేమన్నా నేను భరించ లేను" అన్నారాయన.

ఆయన శేషగిరిని పొగుడుతూంటే ఎందువల్లనో నాకు సంతోషమే కలిగింది. అయినప్పటికీ అసలు విషయం తెలుసుకునే వరకూ నాకు సంతృప్తి కలగదు. మళ్ళీ ఆయన్నడిగాను.

"శేషగిరి నాకు అత్యంత ఆప్తుడు. అందువల్లనే అతడి ఫొటోను నా డైరీలో ఉంచుకుంటున్నాను. ఆ డైరీ బాబు తీస్తాడనీ, ఆ ఫొటో నీ కళ్ళబడుతుందనీ నేనెన్నడూ అనుకోలేదు. అలా జరిగాక ఎలాగో అలా ఆ ఫొటో గురించిన ఆలోచన నీ మనసునించి తప్పించాలను కున్నాను. మొదట్లో భయపెట్టాను. ర్వాత అబద్ధాలు చెప్పాను. రెండూ ఫలించలేదు. ఇప్పుడసలు విషయం చెప్పక తప్పదు. శేషగిరికీ నాకూగల పరిచయం గురించి వరికీ చెప్పననీ, ముఖ్యంగా నీకు చెప్పననీ అతనికి మాట ఇచ్చాను. ఆ మాట తప్పలేను. కాబట్టి ఇంకేమీ నన్నడగొద్దు" అన్నారాయన.

"మిమ్మల్నింకేమీ అడగను, అతన్నే పిలవండి. వివరాలన్నీ అతని ద్వారానే తెలుసుకుంటాను" అన్నాను.

"అతన్ని కలుసుకోడం సాధ్యంకాదు సుమా!" గంభీరంగా అన్నారాయన.

"ఎక్కడున్నాడో చెప్పండి. నేనతన్ని కలుసుకుంటాను."

ఆయన అదోలా నవ్వి, "స్వర్గమనేది ఉంటే అతనక్కడే ఉండి ఉంటాడు. ఇంద్రుడనే వాడుంటే ఈ పాటికతనికి అర్ధ సింహాసనమిచ్చి ఉంటాడు" అన్నారు.

"మైగాడ్! శేషగిరి చచ్చిపోయాడా?" అన్నాను అప్రయత్నంగా.

"అతను చచ్చిపోలేదు, నీమీద ప్రేమ అతన్ని చంపింది" అన్నారాయన.

"అంటే?" "అయామ్‌సారీ సుమా! ఇంకేమీ నన్నడగొద్దు."

"అలాగంటే కుదరదు, మీరీ వివరాలన్నీ నాకు చెప్పక పోతే బాబుమీద ఒట్టే!" అన్నాను.

ఆయన ముఖంలో రంగులు క్రమంగా మారాయి. ఒక్కక్షణం ఆగి.... "నీకు విషయం చెప్పనని శేషగిరికి మాటిచ్చాను. కానీ ఆమాట నిలబెట్టుకోలేక పోతున్నాను. నిలబెట్టుకోవడంవల్ల ప్రయోజనమూ కనబడ్డంలేదు. ఈ నిజం నువ్వు తెలుసుకోవలసిన అవసరం కూడా ఉందనిపిస్తోంది నాకు........."అని........ "ఫోటో చూశావు

మనిషికూడా తెలుసు. నిస్సంకోచంగా చెప్పు. శేషగిరి కళ్ళె
ఉంటాయి........" అన్నారాయన. అప్పుడాయన ముఖంలో
ఏ విధమైన భావమూలేదు. "చాలా అందంగా........" అన్నాన
"మరినావి" "ఎందుకండీ........తెలిసుండీ అడుగుతారు........?
అన్నాను నా నోటితో నేను అవి అసహ్యంగా కనబడతాయ
అనలేక. మరెండూ ఒకటేనంటే నమ్మగలవా? "ఏమిటీ?
అన్నాను. విషయం సరిగ్గా అర్థంకాకపోయినా ఎందుకో షా
తిన్నట్లనిపించింది.

* * *

విధి ప్రతికూలిస్తే మనిషిసామర్థ్యం ఎందుకూ పనికిరాదన
విషయం రామనాథం విషయంలో నిజమైంది. ఎంతవేగంగా కా
నడుపుతున్నప్పటికీ కూడా అన్నీ తన అదుపులో ఉంటాయనుకున
రామనాథం ఓ రోజున విధి ప్రతికూలించి కారు ప్రమాదాని
గురయ్యాడు. "ప్రమాదం మరీ పెద్దదికాదు........ఎటొచ్చీ కళ
బాగా బాగా దెబ్బతిన్నట్లున్నాయి........" అన్నాడు ఫారి
రిటర్న్‌డ్ డాక్టర్. కొత్తకళ్ళు కావాలతనికి. ఎవరైనా అతనికి ఓజ
కళ్ళు దానం చేస్తే మళ్ళీ ఈలోకాన్ని చూడగలుగుతాడు, లేకపో
శాశ్వతంగా గుడ్డివాడవుతాడు. పత్రికలో ప్రకటన వేయించాడు
దేవుడిచ్చిన సహజసంపదముందు మనిషిసంపాదించుకున్న కృత్రిమ
ధనం ఎందుకూ పనికిరాదని రామనాథానికి అప్పుడే అర్థమైంది
అతని డబ్బు అతనికి చూపు తెప్పించలేదు. అతనిడబ్బు కొత్తకళ్ళన
తయారు చేయలేదు. రామనాథానికి ఈ సమయంలో వేదాంతం బాగ
వంటబట్టింది అతనిలోని అహంకారం నశించింది. అప్పుడే
అతనికి శేషగిరి పరిచయం లభించింది. శేషగిరి రామనాథాని
వెతుక్కుంటూ వచ్చాడు. మీ ప్రకటన చూశాను. నేను మీక
నా కళ్ళను ఇస్తాను. ఫలితంగా నేను కోరినదివ్వగలరా? అనడిగ
డతను. రామనాథానికి మొట్టమొదట కలిగింది ఆశ్చర్యం అతన
శేషగిరిని వివరాలడిగాడు.



శేషగిరి వివరాలేమీ చెప్పకుండా........ "నా ప్రశ్నకు జవాబు కావాలి?" అన్నాడు.

"చెప్పడానికేముంది....లక్షరూపాయలిస్తాను...."" అన్నాడు మళ్ళీ రామనాథం. ఈ దెబ్బతో మళ్ళీ అతను బేరమాడడని అతనభిప్రాయపడ్డాడు. "నాకు డబ్బక్కర్లేదు........" అన్నాడు శేషగిరి.

"అయితే యేం కావాలి?" ఆశ్చర్యంగా అడిగాడు రామనాథం.

"మీరు పెళ్ళిచేసుకోవాలి....నేను కోరిన అమ్మాయిని...."

"ఇదేంకోరిక?" అనుకున్నాడు రామనాథం........ పైకి విచిత్రం........" "ఆ అమ్మాయికేమైనా లోపాలున్నాయా?" "ఈ సృష్టిలో ఏ లోపమూ లేకుండా పుట్టిన మనిషంటూ ఉంటే ఆమె ఒక్కతే? సౌందర్యంతో ఆమెకు సాటిరాగల ఆడది ఇంతవరకూ పుట్టలేదు........ఇకముందు పుట్టబోదు........ఆమెను నేను ప్రేమించాను? "కానీ ఆమె డబ్బును ప్రేమిస్తోంది. నాకు అందలేదు. ఆమె ప్రేమించే డబ్బు ఆమెకు అందుబాటవ్వాలన్నది నాకోర్క....అంతే!" అన్నాడు శేషగిరి.

"అయితే నేనే మీకు రెండు లక్షలిస్తాను. అప్పుడు మీరే ఆమెను వివాహం చేసుకోవచ్చుగదా?" అన్నాడు రామనాథం.

"నేనుగుడ్డివాడినైనాక ఆమెను కోరడం మహాపాతకం. ఆమె అంగీకరించినప్పటికీ?" అన్నాడు శేషగిరి. ఆ ఆలోచనతో అతని శరీరం కంపించినట్లనిపించింది....అతని మాటల్లోని వణుకు వింటూంటే.

అప్పుడే రామనాథానికి స్ఫురించింది .... గుడ్డివాడినైనాక తన ప్రియురాల్ని వివాహం చేసుకోవడం తప్పని భావిస్తున్నాడు శేషగిరి. మరి తనసంగతేమిటి? తనగురించి శేషగిరి గుడ్డివాడు కావాలనుకోవడం న్యాయమా? అయితే శేషగిరి అతనికి సందేహం నివృత్తి చేశాడు. అతను కాన్సర్‌తో బాధపడుతున్నట్టు. అతని జబ్బుకు వైద్యంలేదు. రోజులు లెక్క పెట్టుకుంటూ బ్రతుకుతున్నాడు.

ఏ పరిస్థితుల్లోనూ తాను ఆరునెలలకు మించి బ్రతుకడట. మరణానంతరం తన కళ్ళు రామనాధానికే ఇస్తాడట. ఎటొచ్చీ అతడి షరతులకు రామనాథం ఒప్పుకోవాలి.

రామనాథం శేషగిరి షరతుకు వెంటనే ఒప్పుకోలేదు. ఇద్దరూ ఆరునెలల పాటు స్నేహంగా మసిలారు. ఆ స్నేహం తొలిరోజుల్లోనే బలపడిపోగా వారిద్దరూ ఆప్తమిత్రులయ్యారు.

"నాకు చూపుమీద కంటె నీ స్నేహం మీదనే మోజు ఎక్కువగా ఉన్నది. నువ్వు చావడానికి వీల్లేదు. నా డబ్బుతో నిన్ను బ్రతికించుకుంటాను. నీకు వైద్యం జరిపిస్తాను'' అన్నాడు రామనాథం ఒకరోజున.

"నీకు చూపునే కొనలేని ఈ డబ్బు నాకు ప్రాణాలు కొని పెడుతుందా అసాధ్యం!'' అన్నాడు శేషగిరి. "ప్రయత్నిద్దాం'' అన్నాడు రామనాథం.

"నువ్వలాంటి ప్రయత్నాలు చేస్తే నేను మళ్ళీ నీ దగ్గరకు రాను'' అన్నాడు శేషగిరి.

అదే జరిగితే తనకు శేషగిరి స్నేహము దక్కదు, అతని కళ్ళూ లభించవు. రామనాథం వాస్తవ దృక్పథంలో ఆలోచించి ఊరుకున్నాడు. ''మన స్నేహానికి వయసు పెరుగుతోంది కానీ - నువ్వు నాకు మాటివ్వడంలేదు'' అన్నాడు శేషగిరి ఒక రోజున.

"ఈ రోజే నీకు మాటిస్తున్నాను. నాకు చూపురాగానే ఆమెను వివాహం చేసుకుంటాను'' అన్నాడు రామనాథం. అతనలా గనడానికి కారణముంది. రామనాథం తనకు బాగా కావలసిన ఒకరిద్దర్ని పంపించి సుమలతను చూసిరమ్మన్నాడు. వారు సుమలత సౌందర్యాన్ని వర్ణించి చెప్పాకనే అతనీ నిర్ణయానికి రాగలిగాడు.

"మాట తప్పవు కదూ!'' అన్నాడు శేషగిరి.

"తప్పను" అన్నాడు రామనాథం.

అలాగనడం ఎంత ప్రమాదానికి దారితీస్తుందో రామనాథానికి అప్పుడు తెలియదు. మర్నాడు శేషగిరి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసి అతను ఆశ్చర్యానికి మించి షాక్ పొందాడు. జీవితంలో అన్ని



విధాలా ఓడిపోయిన తనకు జీవితేచ్ఛ నశించిందనీ, తన బాధకు ఎవరూ బాధ్యులు కారనీ - తన కళ్ళను ఫలానా రామనాథం ఉపయోగించవలసిందనీ అతను మరణించబోయేముందు డాక్టర్‌కు ఫోన్‌చేసి చెప్పాడు.

*           *           *

"నేనిచ్చిన వాగ్దానంతో మా స్నేహం ఆరునెల్లకు మాత్రమే పరిమితమైపోయింది. అతని కళ్ళు నాకు లభించాయి. నేను నిన్ను పొందగలిగాను. అప్పుడే నాకు అర్థమైంది శేషగిరి నాకు నేత్రదానం చేయడమే కాక ఒక అపూర్వ నిధిని నాగురించి దాచి ఉంచాడని!'' అన్నారాయన.

నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ''మీకోసం నాకోసం అతను కొంచెం ముందుగా ప్రాణాలు తీసుకున్నాడన్నమాట!'' అన్నాను.

"కొంచెం ముందుగా కాదు, చాలా చాలా ముందుగా—అతనికి ఏ కాన్సరూ లేదనీ మనిషి సంపూర్ణారోగ్యంతో ఉన్నాడనీ పోస్టుమార్టంలో పోలీసు డాక్టరు చెప్పాడు.''

''ఆఁ అని నోరు తెరిచాను. నా కిప్పుడు తగిలిన దెబ్బ సామాన్యమైనది కాదు. ఆ దెబ్బలోనే నాకు జ్ఞానోదయం కూడా అయింది. శేషగిరి నన్నుచూసి ప్రేమించాడు. అది సామాన్యమైన ప్రేమకాదు. నేను లేకపోతే బ్రతకలేనంత ప్రేమ! అంతటి ప్రేమలో అతను నా దగ్గరకు వచ్చి ప్రేమభిక్ష కోరాడు. బిచ్చగాడి వేషంలో శేషగిరి నా కళ్ళముందు మెదిలాడు. ఆ దృశ్యం తలచుకోగానే నాకు కళ్ళ నీళ్ళాగలేదు. అతణ్ణి నేను బిచ్చగాడిని లాగే చూసాను. అతని ప్రేమను తిరస్కరించాను.

"నీ కోసం సమస్త సంపదలనూ వదిలిపెట్టి వచ్చేస్తాను కాదనకు అంటున్న శేషగిరి నా కళ్ళముందు మెదిలాడు. అతని కళ్ళలోని దీనమైన అర్థింపు స్పష్టంగా చూడగలుగుతున్నాను. దాని వెనుకనున్న ప్రేమలోతులు నాకిప్పుడే అర్థమవుతున్నాయి. నా కన్నీళ్ళు ఇంకా అధికమయ్యాయి. డబ్బుంటే తప్ప అతన్నాదరించలేనని నేను

ఖచ్చితంగా చెప్పేశాను. అతని ప్రేమతో నాకు నిమిత్తం లేదని స్పష్టంచేశాను.

నా తిరస్కారం శేషగిరికి జీవితంమీదనే విరక్తిని కలిగించింది. అతడు తన బ్రతుకు నంతం చేసుకోవా లనుకున్నాడు. అయితే ఆలోగా తన ప్రియురాలికైనా సంపదలు సాధించాలని అనుకున్నాడు. నాకు డబ్బంటే ఇష్టమని అతనికి తెలుసు. నేను ప్రేమించింది తన కళ్ళననీ తెలుసు. ఆ రెండూ నాకు లభించే ఏర్పాటు చేసి తన జీవితాన్ని త్యాగం చేశాడు. చనిపోయినా కలకాలం అతని కళ్ళు నన్ను చూసే ఏర్పాటు చేశాడు. అతని ప్రేమ అపూర్వం! అయితే ప్రేమ పరంగా నేను దరిద్రురాలిని. వికారనయనిని, ఎందుకంటే నా దగ్గర ప్రేమలేదు. అందమైన ప్రేమ దృష్టి లేదు. అయస్కాంతాంకు ఉత్తర దక్షిణ ధృవాలుంటాయి. ఒక అయస్కాంతపు ఉత్తరధృవం. మరో అయస్కాంతపు ఉత్తర ధృవం దగ్గరగా వస్తే వ్యతిరేక శక్తులు పనిచేసి ఒకదాన్నొకటి తిప్పికొట్టగా, రెండూ దూరంగా విడిపోతాయి. అయితే రెండు భిన్న ధృవాలు, అనగా ఉత్తర, దక్షిణ ధృవాలు దగ్గరగా వస్తే పరస్పరాకర్షణకు గురై దగ్గరౌతాయి. ఇది అయస్కాంతపు లక్షణం.

నేను దరిద్రాన్నీ, అందవికారాన్నీ అసహ్యించుకోవడానికి కారణం నాలోని ఈ అయస్కాంతపు లక్షణమే! శేషగిరి ముఖానికి ఎంతో అందమిచ్చిన ఆ కళ్ళు శ్రీవారి ముఖంలో అసహ్యంగా కనబడుతున్నాయి. కళ్ళలో ఏమీ లేదు. వాటికి ప్రాముఖ్యత లేదు. నేను ప్రాముఖ్యత నివ్వవలసింది కళ్ళకుకాదు, మనసుకు.

ఈ సత్యం గుర్తించిన నేను తటాలున ఆయన్ను కౌగలించుకుని ఆ కళ్ళను ముద్దు పెట్టుకున్నాను. అప్పుడు నాకు కలిగిన అనుభూతి అపూర్వం.

సృష్టిలో ఇంతవరకూ ఏ ప్రియురాలికీ లభించని అమూల్య కానుక ఆ కళ్ళు! ఇప్పుడా కళ్ళు నాకు చాలా చాలా అందంగా కనబడుతున్నాయి.



అలా ఎంతసేపుండి పోయానో తెలియదుగానీ ఎంతసేపైనా ఉండిపోవాలనుంది నాకు, కానీ ఆయనే నన్ను నెమ్మదిమీద విడిపించి "సుధా! ఏవిటీ ఆవేశం, ఇది పగలు" అని మెత్తగా మందలించారు.

ఆయనలా అన్నప్పటికీ ఇటువంటి అనుభూతి కోసం ఆయన ఎంతకాలంగానో ఎదురు చూస్తున్నారని నాకు తెలుసు. ఇంతకాలం ఎంత వెర్రిదాన్నయ్యాను నేను? నన్ను ప్రాణానికి మిన్నగా ప్రేమించి నాకోసం వారి ముఖంలో వెలసిన ఆ అపూర్వ నేత్రాలను అస్పృశ్య నయనాలుగా భావించి అసహ్యించుకున్నాను. అవి నా శరీరాన్ని చూస్తుంటే ఆ చూపుల తాకిడికి పులకరించడానికి బదులు అసహ్యంతో వణికిపోయాను. ఈ పొరపాటు ఇకమీదట జరగకూడదు. ఈ రాత్రితో పాత అలవాట్లకు స్వస్తి చెప్పాలి. కొత్త జీవితానికీ, కొత్త అనుభవాలకూ నాంది పలకాలి. ఆ రాత్రి గురించి ఎన్నో కలలుకంటూ అప్పటికి వారి పక్కనుంచి లేచాను నేను.

## 22

రాత్రి పదయింది. ఆయన ఇంకా యింటికి రాలేదు, ఎందుకో ఈరోజు బాబింకా నిద్రపోవడం లేదు. వాడిని నిద్రపుచ్చటానికి ప్రయత్నిస్తూంటే రకరకాల ఆలోచనలు నన్ను ముసురుకుంటున్నాయి. నాలో చెలరేగుతూండే ఎన్నో ప్రశ్నలకు ఆయన చెప్పిన ఒక్క శేషగిరి కథ జవాబిచ్చింది.

కారు ప్రమాదానికి ముందు ఆయనకూ అందమైన కళ్ళే ఉండివుంటాయి. అందుకే బాబులో తన ప్రతిబింబాన్ని చూసుకోవాలని ఆయన అంతగా తహతహ లాడారు. అద్దంలో కనిపించేది నిజమైన ప్రతిబింబం ఎలా అవుతుందని ఆయన అడిగినప్పుడు అందులోని గూఢార్థం నాకు గోచరించలేదు. బాబుకు తనపోలిక రావాలన్న తపన, తను పోగొట్టుకున్నవి బాబు తప్ప మరెవ్వరూ ఇవ్వలేరని ఆయన చెప్పడమూ అన్నీ గుర్తుకు వస్తూంటే శేషగిరి కోరిన

ప్రకారం తన రహస్యాన్ని దాచడం కోసం ఆయన ఎంత అవస్థ పడ్డారు, మథనపడ్డారు అనిపించింది.

ఇంట్లో కారు ప్రమాదానికి ముందువి ఆయన ఫోటోలు ఒక్కటికూడా లేవు. పాత ఫోటోలు ఎందుకు లేవని ఒకసారి అడిగితే "అదొక విషాదగాథ, నన్నడగొద్దు" అన్నారాయన. ఆ విషాదగాథ నాకు సంబంధించిదేనని అప్పట్లో నాకు తెలియదు.

అయితే ఇప్పుడు నన్ను వేధిస్తున్న సమస్య ఒక్కటే! శేషగిరి తన త్యాగాన్ని రహస్యంగా ఉంచాలని ఎందుకు కోరుకున్నాడు? బాగా ఆలోచించిన మీదట అందుకు సమాధానం దొరికింది.

శేషగిరి నన్ను ఏ ఉద్దేశ్యంతోనైతేనేం, మోసగించాడు. అందుకు నేనతన్ని అసహ్యించుకున్నాను. అతనిపట్ల నాకు అసహ్యం పోదన్నది తథ్యం. ఎందుకంటే ఆయన డైరీలో శేషగిరి ఫోటో కనపడ్డప్పుడుకూడా నేనతన్ని తప్పుగానే అర్థం చేసుకున్నాను. శేషగిరిలో ఈ భయం ఉండి ఉండాలి. వారి కళ్ళు తనవే అని తెలిస్తే నేను వారినికూడా అసహ్యించుకుంటాననీ, వారితో వివాహానికి అంగీకరించననీ అతనభిప్రాయపడి ఉండాలి. అందుకే ఈ విషయం రహస్యంగా ఉంచమని వాగ్దానం తీసుకున్నాడు. తన కళ్ళను నేనసహ్యించుకుంటున్నట్లు వారు గుర్తించే ఉంటారు, అది భరించలేకే వారు నాకు నిజం చివరకు చెప్పేశారు. బాబు డైరీని నా దగ్గరకు తీసుకురావడం ఎంతమంచి పని చేసింది. ఈ రాత్రి నిజంగా మధురమనోహరం కావాలి. ఇంతకాలం నేను వారికి కలిగించిన బాధ ఈ ఒక్కరాత్రిలో పోగొట్టాలి. బాబు పడుకునే సరికి పదీ ఇరవై అయింది. పదిన్నరకు వారు వచ్చారు. ఇద్దరం కలిసి భోజనాలు చేశాం. ఆయనలో పెద్దగా మార్పేమీ లేదు నేనే ఉద్వేగంలో ఉన్నాను.

ఆయన గదిలోకి వచ్చి మంచం మీద పూలు చూసి "ఇవేమిటి?" అన్నారు.



"పూలు" అన్నాను. "ఎందుకు?" "మన మధ్యనుంచి అన్ని రహస్యాలూ తొలగిన ఈ రాత్రి మనం పొందబోయే అపూర్వ అనుభవాలకు సూచనగా ఉంచానిక్కడ ఈపూలు!" అన్నాను.

"ఊహూఁ" అని నవ్వారాయన.

"అంతేకాదు, నా బట్టలనీరోజు వెన్నెట్లో తడిపాను, మీ కోసం!" అన్నాను.

"వెన్నెట్లో తడిపావా, ఎలా?" అన్నారాయన.

"ఇందాకా భోజనాల సమయంలో మీ చూపులు ఎటు ప్రసరిస్తే అటే నిలబడ్డాను, వాటిలోంచి ప్రసరించే కాంతి నా బట్టలను వెన్నెలమయం చేసింది" అన్నాను.

"అయితే ఇప్పుడు నాకు నీ శరీరాన్ని వెన్నెలమయం చేయాలనుంది" అన్నారాయన.

"మీ ఇష్టాన్ని నేనెప్పుడు కాదన్నాను!" అంటూ నేనాయన కనులవంక ఆరాధనా పూర్వకంగా చూడసాగాను.

ఆయన నన్ను సమీపించి నన్ను దగ్గరగా లాక్కున్నారు, చిలిపిగా నా నడుము తాకుతూ "ఇప్పుడు దీపం ఆర్పేయనా?" అన్నారు.

"వద్దు!" అన్నాను కంగారుగా.

"మీ చూపులు సోకితే పరవశించాలని నా శరీరంలోని అణుఅణువూ తపించిపోతోంది. ఆ కోరిక ఇపుడు నాలోని సిగ్గును కూడా జయించింది. ఇంతకాలం మన జీవితంలో పగలు మాత్రమే వెలుగుండేది. ఇకనుంచి రాత్రికూడా వెలుగే!" అంటూ కాంక్షతో ఆయన ముఖాన్ని దగ్గరగా తీసుకుని ఆ కళ్ళను ముద్దుపెట్టుకున్నాను. అయితే ఆయన ముఖంలో ఆనందానుభూతి కనబడలేదు నాకు. కదలికలు ఇబ్బందిగా ఉన్నాయి. పరిశీలనగా కళ్ళలోకి చూస్తే ఏదో వింత అనుభూతి కనబడింది. అలాంటి అనుభూతి చాలా మంది కళ్ళలో కనబడుతుంది. అదేమిటో నేను త్వరగానే గుర్తుపట్టగలిగాను. అది అసూయ! అవును, ఇంతకాలం నేనా కళ్ళను

అసహ్యించుకున్నాను. ఆయన ఎంత కోరినా మొహమాటా
వాటిని ప్రేమించలేకపోయాను, ఈరోజు శేషగిరివి అని తెలియ
వాటిని ముద్దు పెట్టుకుంటున్నాను. నాలో హఠాత్తుగా వచ్చిన
మార్పు ఆయనకు ఆనందాన్నెలా కలిగిస్తుంది? అవి శేషగిరి క
అని నాకు తెలియనంతకాలం వాటిపై నేను చేసే ప్రతి శృం
చేష్టా ఆయన కానందాన్ని కలిగిస్తుంది, కానీ ఇప్పుడు మా
అందుకు వ్యతిరేకంగా జరుగుతుంది.

శేషగిరి ప్రేమకథ నన్ను కదిలించింది. అతనిమీద అ
నాన్ని కలిగించింది.

కానీ శేషగిరి ఇప్పుడు జీవించిలేడు, అతని కళ్ళు మా
ఆయన ముఖంలో జీవం పోసుకున్నాయి. నేనా కళ్ళను ప్రే
వ్యభిచారిణిని అవుతానా? కాని పక్షంలో ఆయనకంత అస
ఎందుకు? ఇప్పుడాయన నా దగ్గరగా వచ్చారు, తనకు దగ్గ
లాక్కున్నారు. ఆయన వెచ్చని వూపిరి నాకు తగుల్తూ నా
అసంతృప్తిని బయటకు తరిమేసి ఇతర భావాలను నాలో ప్ర
పెట్ట డానికి ప్రయత్నిస్తోంది. ఆయన చేష్టలు, మాటలు నన్నా
నకు దగ్గరచేసాయి, అయితే మా అనుబంధం చీకటిలోనేగానీ
లేదా? ఆ తర్వాతనుంచి కూడా మా అనుబంధం చీకటిలోనే వ
తోంది. ఇప్పుడు నాకు ఆయన కళ్ళంటే ఎంతో ఇష్టం, నా
చేష్టలోనూ ఆ భావం వ్యక్తమవుతూనే ఉంటుంది. నా మది
భావాలను దాచుకోవడం చిన్నప్పట్నించీ నాకు చేతకాదు.

కానీ ఆ కళ్ళను పొగడలేను. ముద్దాడలేను.

ఆయన అన్ని విధాలా ఎంతో మంచివారు, సంసా
వంతులు, శేషగిరి అంటే ఆయనకున్న కృతజ్ఞతాభిమానాలు ఇ
అంతాకాదు, మరి ఆయనలో ఇటువంటి భావమెలా చోటు
కుంది? బహుశా శేషగిరివంటి అసామాన్యపురుషుడి నయనా
తాకే అర్హత నాకు లేదని తోచి భగవంతుడు కలకాలం వా
నాకు అస్పృశ్య నయనాలుగా చేసి ఉంటాడు, అంతే?

సమాప్తం.